RNI.No.TELTEL/2013/52694

Estd.: 2000

www.voodayam.com /voodayam /Voodayam




# వుదయం

Simultaneously published from Adilabad, Hyderabad, Khammam, Karimnagar,Guntur & Warangal

**రిపోర్టర్లు కావలెను...**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో
వుదయం తెలుగు దిన పత్రికకు రిపోర్టర్లుగా
పని చేయుటకు ఆసక్తిగల,
అనుభవజ్ఞులైన అభ్యర్థులు కావలెను.

- సిరికొండ అగస్టిన్
BA. L.L.B., M.C.J.
వుదయం ఎడిటర్

సెల్: 9247698676

సంపుటి : 13 ‖ సంచిక : 186 ‖ ఆదిలాబాద్ ‖ శుక్రవారం, నవంబర్ 14 , 2025 ‖ VOODAYAM Telugu Daily ‖ వెల : రూ. 3.00 ‖ పేజీలు : 12

# హైదరాబాద్‌లో రోడ్లకు ప్రముఖ కంపెనీల పేర్లు

**సీఎం రేవంత్‌రెడ్డి**




దిల్లీ: హైదరాబాద్‌లో రోడ్లకు నేతల పేర్లు పెట్టే ట్రెండ్ మార్చి.. ప్రముఖ కంపెనీల పేర్లు పెట్టాలని భావిస్తున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. హార్వర్డ్, స్టాన్‌ఫోర్డ్, ఆక్స్‌ఫర్డ్ వంటి విశ్వవిద్యాలయాలు తెలంగాణలో క్యాంపస్‌లు ఏర్పాటు చేయాలని సీఎం ఆహ్వానించారు. అత్యున్నత జీవన ప్రమాణాలతో కూడిన అంతర్జాతీయ స్థాయి నగరంగా హైదరాబాద్‌ను నిలపడమే తన మొదటి ప్రాధాన్యత అని వివరించారు. భారత్ ఫ్యూచర్ సిటీ దేశంలోనే నూతన నగరంగా మారనుందన్నారు. మూసీ నదీ పునరుజ్జీవనం పూర్తయితే హైదరాబాద్ నైట్ ఎకానమీ కొత్త దశలోకి ప్రవేశిస్తుందని పేర్కొన్నారు. దిల్లీలో జరిగిన అమెరికా -భారత్ వ్యూహాత్మక భాగస్వామ్య సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులు, పరిశ్రమలకు అనువైన వాతావరణం, భద్రతకు ఢోకా లేని హైదరాబాద్.. పెట్టుబడిదారులకు ఉత్తమ గమ్యస్థానమని తెలిపారు. తెలంగాణలో పెద్ద సంఖ్యలో యువత, వేగవంతమైన వృద్ధి రేటు ఉందన్నారు. గత 35 ఏళ్లుగా కాంగ్రెస్‌తో పాటు అనేక పార్టీల ప్రభుత్వాలు సారథ్యం వహించినప్పటికీ.. పెట్టుబడులకు, పెట్టుబడిదారులకు అందరూ మద్దతుగా నిలిచారని ముఖ్యమంత్రి వివరించారు. భారతదేశంలో పెట్టుబడులకు హైదరాబాద్ ముఖ ద్వారంగా నిలిచిందని సీఎం తెలిపారు. జీసీసీలకు గమ్యస్థానమైన హైదరాబాద్‌లో పెట్టుబడులకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలను సీఎం రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. మహిళా సాధికారిత, నాణ్యమైన విద్య, యువతకు నైపుణ్య శిక్షణ, పట్టణాభివృద్ధితో పాటు మెరుగైన వసతులు, అత్యున్నత జీవన ప్రమాణాలతో కూడిన అంతర్జాతీయ స్థాయి నగరంగా హైదరాబాద్‌ను నిలపడమే తన ప్రథమ ప్రాధాన్యత అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.

గత 23 నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సీఎం వివరించారు. అద్భుతమైన మౌలిక వసతులతో 30 వేల ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో భారత్ ఫ్యూచర్ సిటీ దేశంలోనే నూతన నగరంగా మారుతుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మూసీ నదీ పునరుజ్జీవనం పూర్తయితే లండన్, టోక్యో, దుబాయి, సియోల్ రివర్‌ఫ్రంట్‌ల తరహాలతో హైదరాబాద్ నైట్ ఎకానమీ కొత్త దశలోకి ప్రవేశిస్తుందని సీఎం అన్నారు. డ్రై పోర్ట్, మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్, రేడియల్ రోడ్లు, మాన్యుఫ్యాక్చరింగ్ జోన్ వంటి కీలక ఇన్‌ఫ్రా ప్రాజెక్టుల పురోగతిని వివరించారు. సదస్సు ప్రారంభంలో తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను ప్రదర్శించారు. తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యం.. సిస్కో మాజీ సీఈవో జాన్ ఛాంబర్స్ తదితర అంతర్జాతీయ వ్యాపార వర్గాలను ఆకట్టుకుంది. డిసెంబరు 8,9 తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరు కానున్నట్లు అమెరికా-భారత్ వ్యూహాత్మక ఫోరం అధ్యక్షుడు ముఖేష్ ఆఘి తెలిపారు.



## జూబ్లీహిల్స్ ఓట్ల లెక్కింపు..
# 10 రౌండ్లలో కౌంటింగ్

హైదరాబాద్ ,నవంబర్ 13జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని ఆర్వో కర్ణన్ తెలిపారు. యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలోని డీఆర్సీ సెంటర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

"శుక్రవారం ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్‌తో ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. 407 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఓట్లు లెక్కిస్తాం. మొత్తం 58 మంది అభ్యర్థులు ఉన్నందున ప్రత్యేక అనుమతి తీసుకుని లెక్కింపునకు 42 టేబుళ్లు ఏర్పాటు చేశాం. 10 రౌండ్లలో కౌంటింగ్ పూర్తిచేస్తాం. కౌంటింగ్‌కు మొత్తం 186 మంది సిబ్బందిని కేటాయించాం. ఫలితాలను ఎప్పటికప్పుడు ఈసీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తాం.

మీడియాకు ప్రత్యేకంగా ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేసి ఫలితాలను వెల్లడిస్తాం"అని చెప్పారు. ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద 250 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామని నగర జాయింట్ సీపీ తఫ్సీర్ ఇక్బాల్ తెలిపారు. 15 ప్లాటూన్ల సిబ్బందిని రప్పిస్తున్నామన్నారు. 144 సెక్షన్ అమల్లో ఉంటుందని.. అనుమతి ఉన్నవారు మాత్రమే లెక్కింపు కేంద్రం వద్దకు రావాలని సూచించారు. శాంతిభద్రతలకు భంగం వాటిల్లితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# ఆర్టీసీ రెవెన్యూ పెంచేందుకు మార్గాలు అన్వేషించాలి



హైదరాబాద్ ,నవంబర్ 13 : ఆర్టీసీ రెవెన్యూ పెంచేందుకు మార్గాలు అన్వేషించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. ఆర్టీసీ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త కాలనీలకు బస్సు రూట్‌లు పెంచేలా అధ్యయనం చేయాలన్నారు. కారుణ్య నియామకాల కింద ఎంపికైన కండక్టర్ల ప్రొవిజన్ పీరియడ్ రెండేళ్లకు తగ్గించాలని చెప్పారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీ డిపోలు లాభాల్లోకి వచ్చేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఆరంఘర్‌లో బస్సు టెర్మినల్ కోసం పోలీసు శాఖ భూములపై చర్చించాలన్నారు. హైదరాబాద్‌లో కొత్త డిపోలకు స్థల పరిశీలన చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. బస్సు ప్రమాదాలను తగ్గించడానికి డ్రైవర్ మానిటరింగ్ సిస్టం అమలు చేస్తామని వివరించారు. త్వరలో ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లతో జూమ్ మీటింగ్ నిర్వహిస్తామని తెలిపారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కౌంటింగ్‌పై
# బీఆర్ఎస్ ప్రత్యేక దృష్టి

**ుకేటీఆర్, హరీశ్ రావు, పార్టీ నేతల ఆధ్వర్యంలో కీలక సమావేశం**

హైదరాబాద్ ,నవంబర్ 13 శుక్రవారం జరగనున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ఓట్ల లెక్కింపును భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఈ నియోజకవర్గంలో పోటీ తీవ్రంగా ఉన్న నేపథ్యంలో, కౌంటింగ్ ప్రక్రియ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించేందుకు పార్టీ నిర్ణయించింది. ఓట్ల లెక్కింపు పర్యవేక్షణ కోసం పార్టీ సీనియర్ నాయకులను, ప్రముఖులను ఎలక్షన్ ఏజెంట్లుగా, కౌంటింగ్ ఏజెంట్లుగా నియమించింది. ఈ ఏజెంట్లందరితో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరియు పార్టీ సీనియర్ నాయకులు హరీశ్ రావు తదితర ముఖ్య నేతలు తెలంగాణ భవన్‌లో ఓ కీలక సమావేశాన్ని నిర్వహించారు.

**కౌంటింగ్ అక్రమాలకు అడ్డుకట్టే లక్ష్యం** ఈ సమావేశంలో కౌంటింగ్ ఏజెంట్లకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ సందర్భంగా అనుసరించాల్సిన అంశాలపై మార్గదర్శనం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ పోలింగ్ సందర్భంగా అన్ని రకాల అక్రమాలకు పాల్పడిందని, ప్రభుత్వ వ్యవస్థలను దుర్వినియోగం చేసిందని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. ఈ నేపథ్యంలో కౌంటింగ్ సందర్భంగా కూడా కాంగ్రెస్ పార్టీ అక్రమాలకు పాల్పడే అవకాశం ఉందని, వాటిని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని ఏజెంట్లకు దిశానిర్దేశం చేశారు. ప్రతి ఒక్క కౌంటింగ్ ఏజెంట్, ఎలక్షన్ ఏజెంట్ అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని, కాంగ్రెస్ పార్టీ ఏ విధంగా అక్రమాలు చేసే అవకాశం ఉందో వివరించినట్లు బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి.మొత్తంగా, రేపటి ఎలక్షన్ కౌంటింగ్ ప్రక్రియను బీఆర్ఎస్ ప్రతిష్టాత్మకంగా తీసుకుని, కాంగ్రెస్ పార్టీ అక్రమాలకు అడ్డుకట్ట వేసేలా ఈ సమావేశాన్ని నిర్వహించింది.

## పరారీలో కశ్మీర్ వైద్యుడు..
## ఇంటర్‌పోల్‌ను ఆశ్రయించిన పోలీసులు

దిల్లీ:దిల్లీలోని ఎర్రకోట సమీపంలో పేలుడు ఘటన తో ముడిపడి ఉన్న ఫరీదాబాద్ ఉగ్ర నెట్‌వర్క్ కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ క్రమంలోనే టెర్రర్ మాడ్యూల్‌తో సంబంధం ఉన్న, జమ్మూకశ్మీర్‌లోని కాజీగుండ్‌కు చెందిన డా.ముజఫ్ఫర్‌పై రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేయాలని ఇంటర్‌పోల్ ను ఆశ్రయించారు. ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు వైద్యులు సహా ఎనిమిది మంది అరెస్టయ్యారు. వారిలో డా.ఆదిల్ ఒకడు. అతడి సోదరుడే డా.ముజఫ్ఫర్.

నిందితులను విచారిస్తున్న క్రమంలో ముజఫ్ఫర్ పేరు బయటకు వచ్చింది. 2021లో తుర్కియేను సందర్శించిన డా.ముజమ్మిల్, డా.ఉమర్ నబీ తదితర వైద్యుల బృందంలో ఇతడు కూడా ఉన్నట్లు నిందితులు తెలిపారు. ఈ బృందం తుర్కియేలో 21 రోజుల పాటు ఉంది. ఎర్రకోట వద్ద పేలుడుకు కారణమైన కారును డా.ఉమర్ నబీనే నడుపుతున్నట్లు సీసీటీవీ దృశ్యాలను అధికారులు గుర్తించిన విషయం తెలిసిందే. డీఎన్ఏ నమూనాలూ మ్యాచ్ అయినట్లు జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి.ముజఫ్ఫర్ పేరు బయటకు రాగానే అతడి ఆచూకీ కోసం పోలీసులు యత్నించారు. కానీ, ఆగస్టులోనే దుబాయికి పారిపోయినట్లు గుర్తించారు. ప్రస్తుతం అఫ్గానిస్థాన్‌లో తలదాచుకున్నట్లు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అతడిపై రెడ్ కార్నర్ నోటీసు జారీ చేయాలని 'ఇంటర్‌పోల్'ను కోరారు. ఇదిలా ఉండగా.. ఈ కేసులో తుర్కియే పేరు బయటకు రావడాన్ని ఆ దేశం ఖండించింది. భారత్‌ను లేదా మరే ఇతర దేశాన్ని లక్ష్యంగా చేసుకుని తమ దేశం ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతోందనే వాదనలను తప్పుడు, నిరాధార ఆరోపణలుగా పేర్కొంది.

# మంత్రి కొండా సురేఖపై కేసు ఉపసంహరించుకున్న నాగార్జున



హైదరాబాద్ నవంబర్ 13 మంత్రి కొండా సురేఖ , ప్రముఖ నటుడు నాగార్జున మధ్య నెలకొన్న వివాదానికి తెర పడింది. నాగార్జునను ఉద్దేశిస్తూ మంత్రి సురేఖ నిన్న ఎక్స్ వేదికగా క్షమాపణలు చెప్పారు. ఆమె బహిరంగ క్షమాపణలను పరిగణనలోకి తీసుకున్న నాగార్జున, తమకు న్యాయం జరిగిందని భావించి.. క్రిమినల్ దావా పిటిషన్‌ను ఉపసంహరించుకోవాలని నిర్ణయించుకున్నారు.నాగార్జున కుటుంబంపై తాను గతంలో చేసిన వ్యాఖ్యలపై చింతిస్తున్నానని మంత్రి కొండా సురేఖ నిన్న ఎక్స్‌లో పోస్టు చేసిన విషయం తెలిసిందే. "నాగార్జున, ఆయన కుటుంబాన్ని బాధ పెట్టాలనే ఉద్దేశంతో నేను ఆ వ్యాఖ్యలు చేయలేదు. వారిని ఇబ్బందిపెట్టాలని కాని, వారి పరువు-ప్రతిష్టలకు భంగం కలిగించాలన్నది కాని నా ఉద్దేశం కాదు. నాగార్జున కుటుంబంపై నేను చేసిన వ్యాఖ్యల్లో ఏదైనా పొరపాటు ఉంటే అందుకు చింతిస్తున్నా. నా వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నా" అని పేర్కొన్నారు. దీంతో నాగార్జున, మంత్రి కొండా సురేఖ మధ్య కొన్ని నెలలుగా కొనసాగుతున్న న్యాయపరమైన వివాదానికి తెరపడినట్లయింది.

## ఆ నివేదికలో పైలట్‌ను నిందించలేదు'
# సుప్రీం కోర్టుకు కేంద్రం వెల్లడి



దిల్లీ: అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన ప్రమాదం పై విడుదల చేసిన ప్రాథమిక నివేదికలో పైలట్‌ను నిందించలేదని సుప్రీం కోర్టుకు కేంద్రం తెలిపింది. ఈ ఘటనపై 'విమాన ప్రమాదాల దర్యాప్తు బ్యూరో' దర్యాప్తు బృందాన్ని అంతర్జాతీయ నిబంధనల ప్రకారమే ఏర్పాటు చేసినట్లు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా.. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీలతో కూడిన సుప్రీం ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు.ఎయిరిండియా పమాదంలో మృతి చెందినవారిలో కెప్టెన్ సుమీత్, కో-పైలట్ క్లైవ్ కుందర్‌లు కూడా ఉన్నారు. ఈ కేసును న్యాయస్థానం పర్యవేక్షణలో దర్యాప్తు కోరుతూ.. సుమీత్ తండ్రి పుష్కరాజ్ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై సుప్రీం ధర్మాసనం విచారణ కొనసాగించింది. "ఏఏఐబీ దర్యాప్తు అనేది ఒకరిని నిందించేందుకు కాదు. మరోసారి అటువంటి తప్పిదం జరగకుండా ఉండటానికి కారణాన్ని వెలికితీసేందుకు ఉద్దేశించింది మాత్రమే" అని జస్టిస్ బాగ్చీ తెలిపారు.ఓ ఎన్జీవో తరఫున న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపిస్తూ.. ఈ దుర్ఘటనపై 'కోర్టు ఆఫ్ ఎంక్వైరీ' మాదిరి సమాంతర విచారణ నిర్వహించాలన్నారు. సంబంధిత విమానాలను నమ్మలేమని, వాటిలో ప్రయాణించేవారికి ప్రమాదం పొంచి ఉందని పైలట్ ఫెడరేషన్ ఆరోపించినట్లు పేర్కొన్నారు. అయితే.. ప్రస్తుత వాదనలు విమానయాన సంస్థల మధ్య పోరుగా మారకూడదని జస్టిస్ సూర్యకాంత్ వారించారు. సుమీత్ తండ్రి దాఖలు చేసిన పిటిషన్‌కు స్పందన తెలియజేయాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ఆదేశించారు. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేశారు.జూన్ 12న అహ్మదాబాద్ నుంచి లండన్ బయల్దేరిన ఎయిరిండియా విమానం టేకాఫ్ అయిన వెంటనే కూలిపోయింది. ఈ ప్రమాదంపై 'ఏఏఐబీ' జులైలో తన ప్రాథమిక నివేదికను విడుదల చేసింది. రెండు ఇంజిన్లకు ఇంధన సరఫరా నిలిచిపోవడంవల్లే విమానం కూలిపోయిందని పేర్కొంది. ఇంధన సరఫరాను ఎందుకు ఆపావని ఒక పైలట్ ప్రశ్నించగా.. తాను ఆపలేదని మరో పైలట్ సమాధానమివ్వడం కాక్‌పిట్ వాయిస్ రికార్డర్‌లో నమోదైందని తెలిపింది. దీంతో పైలట్ల లోపం ఉందనే ఊహాగానాలకు దారితీసింది. ఈ నివేదికను పైలట్ సంఘాలు తీవ్రంగా విమర్శించాయి.



## ఆ టెన్త్ విద్యార్థుల
# పరీక్ష ఫీజు నేనే కడతా

హైదరాబాద్ ,నవంబర్ 13 కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తన ఉదారతను చాటుకున్నారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులందరికీ ఎస్ఎస్సీ బోర్డు పరీక్ష ఫీజును తానే కడతానని ప్రకటించారు. ఈ మొత్తాన్ని ఎంపీగా తనకు వచ్చే వేతనం నుంచి భరించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ అందించిన అంత్యోదయ స్ఫూర్తితోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. పదో తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులకు ఈ సందర్భంగా ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ అంశంపై హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందనకు రాసిన లేఖను ఆయన 'ఎక్స్'లో షేర్ చేశారు. ఏ ఖాతాలో ఈ మొత్తాన్ని డిపాజిట్ చేయాలనే విషయాన్ని తనకు తెలియజేయాలని కలెక్టర్‌ను కోరారు. అలాగే, పాఠశాలల వారీగా పదో తరగతి విద్యార్థుల వివరాలు,

# పేదలకు అండగా ప్రజా ప్రభుత్వ పాలన

- ♦ రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- ♦ మంగాపురం తండా అభివృద్ధికి 7 కోట్ల 65 లక్షల రూపాయలు మంజూరు
- ♦ బుద్దారం గ్రామాభివృద్ధికి 12 కోట్ల 24 లక్షల రూపాయలు మంజూరు
- ♦ నేలకొండపల్లి మండలంలో పర్యటించి సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి మండల లబ్ధిదారులకు సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేసిన మంత్రి పొంగులేటి



ఖమ్మం నేలకొండపల్లి,నవంబర్ 13 (వుదయం ప్రతినిధి): రాష్ట్రంలో నిరుపేదలకు అండగా ప్రజా ప్రభుత్వం పాలన కొనసాగిస్తున్నదని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు.మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నేలకొండపల్లి మండలంలో గురువారం విస్తృతంగా పర్యటించి మంగాపురం తండ గ్రామంలో 30లక్షలతో, బుద్దారం గ్రామంలో 15 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మంగాపురం గ్రామంలో 30 లక్షల రూపాయలతో అంతర్గత సిసి రోడ్లకు శంకుస్థాపన చేసుకున్నామని, గత 20 నెలల కాలంలో 57 లక్షలతో మంగాపురం గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణం పూర్తి చేసామని మంత్రి తెలిపారు. బుద్ధారం గ్రామంలో 26 లక్షల రూపాయల తో సిసి రోడ్లు నిర్మించామని, నేలకొండపల్లి గంద్రాయి బీటీ రోడ్డు పైన 7 కోట్ల రూపాయ లతో బ్రిడ్జి నిర్మాణానికి టెండర్లు పూర్తి చేసామని మంత్రి తెలిపారు. బుద్ధారం గ్రామానికి గత 22 నెలల కాలంలో 12 కోట్ల 24 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామని అన్నారు. రైతును రాజు చేసే కార్యక్రమంలో భాగంగా రెండు లక్షల వరకు పంట రుణమాఫీ పూర్తి చేసామని, రైతన్నలకు మద్దతు ధరతో పాటు సన్న వడ్లకు క్వింటాల్ కు 500 రూపాయల బోనస్ , రైతు భరోసా క్రింద 9 వేల కోట్ల రూపాయలను రైతుల ఖాతాలో జమ చేశామని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, రేషన్ లో సన్న బియ్యం సరఫరా, నూతన రేషన్ కార్డుల జారీ వంటి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వం పేదలకు సొంతింటి కార్యక్రమం విస్మరిస్తే ప్రజా ప్రభుత్వంలో మొదటి సంవత్సరం 4.5 లక్షల ఇండ్లు మంజూరు చేశామని, అర్హులైన ప్రతి ఒక్కరికి రాబోయే రోజులలో 3 విడతల్లో ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని, ప్రతి సోమవారం లబ్ధిదారుల ఖాతాలలో ఇందిరమ్మ ఇండ్ల డబ్బులు జమ చేస్తున్నామని తెలిపారు.నేలకొండపల్లి మండల లబ్ధిదారులకు సి.ఎం.ఆర్.ఎఫ్. చెక్కులను అందజేసిన మంత్రివర్యులు: నేలకొండపల్లి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో 58 మంది లబ్ధిదారులకు 20 లక్షల 29 వేల రూపాయల విలువ గల సి.ఎం.ఆర్.ఎఫ్. చెక్కులను మంత్రి అందజేసి మాట్లాడుతూ, విద్య, వైద్య రంగాలకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వం లోని ప్రభుత్వం పెద్దపీట వేసి పని చేస్తున్నదని తెలిపారు. పేదప్రజలకు పూర్తిస్థాయిలో భరోసా కల్పించేందుకు ఎన్ని కష్టాలు వచ్చినా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నదని అన్నారు. వైద్య రంగం పట్ల పేద ప్రజలకు అనేక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని అన్నారు. ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస రెడ్డి, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, నేలకొండపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నుపూసల సీతారాములు, పంచాయతీ రాజ్, డిసిఓ, హార్టికల్చర్, గ్రామ పంచాయతీ, సంబంధిత అధికారులు, తహసిల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ ఎర్రయ్య, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# యూనిటీ మార్చ్ ఏర్పాట్లు పూర్తి దశలో... అదనపు కలెక్టర్ డి. వేణు

♦ సర్దార్ వల్లభభాయ్ పటేల్ 150వ జయంతి వేడుకలపై పత్రికా సమావేశం



పెద్దపల్లి జిల్లా: నవంబర్ 13 (వుదయం) ప్రతినిధి: నవంబర్ 15న పెద్దపల్లి పట్టణంలో యూనిటీ మార్చ్ నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్ డి. వేణు తెలిపారు. సర్దార్ వల్లభభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా చేపట్టిన వేడుకలపై గురువారం పత్రికా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా 763 గ్రామాల్లో యూనిటీ మార్చ్ నిర్వహణ జరుగుతుందని, పెద్దపల్లి జిల్లాలో కూడా విస్తృతంగా కార్యక్రమం చేపడుతున్నామని చెప్పారు. ఈ యూనిటీ మార్చ్‌లో ఎమ్మెల్యేలు, ఎంపీతో పాటు ప్రజాప్రతినిధులు పాల్గొనే అవకాశం ఉందని తెలిపారు.జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారి అన్ని కళాశాలలకు సమాచారం అందజేసి, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే యూనిటీ మార్చ్ ప్రశాంతంగా, సాఫీగా జరగేందుకు పోలీసులు అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. అదనపు కలెక్టర్ వేణు మాట్లాడుతూ, "సర్దార్ వల్లభభాయ్ పటేల్ దేశ ఏకతకు ప్రతీక. ఆయన స్ఫూర్తిని యువతలో నాటడం మనందరి బాధ్యత" అని అన్నారు. నవంబర్ 15న ఉదయం 9.30 గంటలకు ప్రభుత్వ ఐటీఐ కళాశాల వద్ద నుంచి జూనియర్ కళాశాల వరకు యూనిటీ మార్చ్ కొనసాగుతుందని వివరించారు. స్కౌట్, ఎన్‌సీసీ బృందాలు, విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. తదుపరి ఆయన యూనిటీ మార్చ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా యువజన అధికారి సురేష్, వెంకట్ రాంబాబు, కళాశాల ప్రిన్సిపల్స్ రవీందర్ రెడ్డి, నీతా రెడ్డి, సీఐ ప్రవీణ్ కుమార్, పీటీలు, ఎన్‌సీసీ అధికారి ధ్రువ కుమార్, సంబంధిత అధికారులు, పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు

# నూతన లేబర్ పాలసీ శ్రమశక్తి నీతి-2025 రాజ్యాంగ విరుద్ధం సిఐటియు రాష్ట అధ్యక్షులు చుక్క రాములు

- శాండ్విక్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సెమినార్




సంగారెడ్డి జిల్లా, పటాన్ చెరు ,నవంబర్ 13 (వుదయం ప్రతినిధి): కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నూతన లేబర్ పాలసీ శ్రమశక్తి నీతి-2025 రాజ్యాంగ విరుద్ధమని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు అన్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు పారిశ్రామిక ప్రాంతంలో శాండ్విక్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన శ్రమశక్తి నీతి-2025 సెమినార్ కి చుక్క రాములు ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రాములు మాట్లాడుతూ ఈ లేబర్ పాలసీతో కార్మికులను బానిసలుగా మార్చే కుట్ర జరుగుతున్నదని, సమిష్టి బేరసారాల హక్కును హరించి, ఐఎల్ ఓ ను బైపాస్ చేసి కార్పొరేట్ల ప్రయోజనాల కోసం ఈ పాలసీ తెచ్చారని ఆరోపించారు. దేశంలో కార్మికశక్తిని ఐక్యం కానీయకుండా కార్పొరేట్ల రాజ్యంలా మార్చడానికి ఈ శ్రమశక్తి నీతి 2025 ఉపయోగపడుతుందని, మన రాజ్యాంగంలో కార్మికులకు కల్పించిన సామాజిక న్యాయం, సమానత్వం, శ్రమకు గౌరవం వంటి విలువలకు పూర్తి విరుద్ధమని, దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి మూల కారణమైన కార్మికవర్గ హక్కులపై యూనియన్ల తో చర్చించకుండా ఏకపక్షంగా అమలుచేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఈ పాలసీని కేంద్ర ప్రభుత్వం తక్షణమే రద్దుచేయాలని, ఈ అంశంపై కార్మికవర్గమంతా ఐక్యమై పోరాటాలకు సిద్ధంకావాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో శాండ్విక్ యూనియన్ నాయకులు పి. పాండురంగా రెడ్డి, ఎమ్. మనోహర్, ఎ. వీరారావు, ఎమ్. సత్తిబాబు, వివిధ కమిటీల సభ్యులు, మాజీ ఆఫీస్ బేరర్స్, మాజీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరం నూనె కుమార్




కొండపాక,నవంబర్ 13 (వుదయం ప్రతినిధి): మండల పరిధిలోని దుద్దెడ గ్రామానికి చెందిన ముగ్గురు లబ్ధిదారులు పులిగిల్ల ఉమారాణి కి 60000, యాదాండ్ల రమేష్ కి 14,500, క్యాతం రజిత కి 13500 రూపాయల చెక్కులను గురువారం రోజు దుద్దెడ మాజీ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ తో కలిసి అందించారు బిఆర్ఎస్ పార్టీ కొండపాక మండల అధ్యక్షుడు నూనె కుమార్ యాదవ్.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన ఈ ముగ్గురు లబ్ధిదారులు గతంలో అనారోగ్యానికి గురై ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం చేయించుకోని ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఆర్థిక సహాయం కోసం మమ్మల్ని సంప్రదించగా ఈ విషయాన్ని ఎంఎల్సి డాక్టర్ యాదవ రెడ్డి , బిఆర్ఎస్ ఇంచార్జ్ ప్రతాపరెడ్డి ,మాజీ మంత్రి హరీష్ రావు దృష్టికి తీసుకువెళ్లి వారి సహకారంతో సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు చేయించామని తెలిపారు. వైద్యాన్ని నిరుపేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులోకి తెచ్చిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కే దక్కుతుందన్నారు.అనారోగ్యాల బారిన పడిన నిరుపేద మధ్యతరగతి కుటుంబాలు సీఎంఆర్ఎఫ్, ఎల్ఓసి ద్వారా లబ్ది పొందే అవకాశం ఉన్నందున అర్హులు అందరూ ఇలాంటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ మిద్దె శివకుమార్, బిఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు చిక్కుడు భాను, ఎస్టీ సెల్ అధ్యక్షుడు కేమ్మసారం శ్యామ్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు గుర్రాల కనకయ్య, ఆరెళ్ళ అఖిల్, జనగాం శశి, పెద్ద గొల్ల కొమురయ్య, గాదగని రాకేష్ గౌడ్, కెమ్మసారం సంతోష్, పిట్టల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# పేదల పక్షపాతిగా ఇందిరమ్మ ప్రభుత్వం పని చేస్తుంది

-రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి

-15 రోజులలో మీడియం, ప్రధాన రిజర్వాయర్లలో రొయ్య పిల్లల విడుదలకు చర్యలు

-కూసుమంచి మండలంలో పర్యటించి పాలేరు రిజర్వాయర్ లో చేప పిల్లలను విడుదల చేసిన మంత్రి పొంగులేటి



ఖమ్మం కూసుమంచి, నవంబర్ 13 (వుదయం ప్రతినిధి): పేదల పక్షపాతిగా ఇందిరమ్మ ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు.మంత్రివర్యులు, కూసుమంచి మండలం పాలేరు గ్రామంలోని పాలేరు రిజర్వాయర్ లో గురువారం చేప పిల్లలను విడుదల చేసారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆశీర్వాదంతో తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ ప్రభుత్వం వచ్చి 22 నెలల సమయం గడిచిందని, మన పాలనలో పేదలు భరోసాతో తల ఎత్తుకొని తిరిగే విధంగా పాలన సాగిస్తుందని అన్నారు.పేద ప్రజలకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్నదని, అందులో భాగంగా మత్స్యకార సోదరులకు ఉపయోగపడే విధంగా నీటి వనరులలో ఉచితంగా చేప పిల్లలను విడుదల చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అతి పెద్ద ప్రాజెక్టు పాలేరు రిజర్వాయర్ లో 2 సార్లు చేప పిల్లలను విడుదల చేశామని, మత్స్యకారుల విజ్ఞప్తి మేరకు ఈ సంవత్సరం రాబోయే 15 రోజులలో పెద్ద సైజ్ గల రొయ్య పిల్లలను రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 101 మీడియం, మేజర్ రిజర్వాయర్లలో విడుదల చేయడం జరుగుతుందని మంత్రి తెలిపారు. అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ చేప పిల్లలు విడుదల చేస్తున్న సమయంలో మత్స్యకారులు ముఖాలలో ఆనందం చూస్తే చాలా సంతృప్తి కలిగిందని అన్నారు. మంత్రి ఆదేశాల మేరకు రిజర్వాయర్లలో రొయ్య పిల్లలను విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేస్తామని అన్నారు.అనంతరం కూసుమంచి క్యాంప్ కార్యాలయంలో 90 మంది లబ్ధిదారులకు 37 లక్షల 97 వేల 500 రూపాయల సి.ఎం.ఆర్.ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మత్స్య సహకార సంఘాల సమాఖ్య చైర్మన్ మెట్టు సాయి కుమార్, ఖమ్మం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, కూసుమంచి మండల తహసిల్దార్ రవి కుమార్, ఎంపిడిఓ, ప్రజా ప్రతినిధులు, మత్స్యకార సంఘం నాయకులు, మత్స్యకారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గద్వాల పట్టణంలో దొంగల హల్ చల్.. రెండు చోట్ల చోరీకి యత్నం



గద్వాల నవంబర్ 13 (వుదయం ప్రతినిధి): జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రమైన గద్వాల పట్టణంలో అర్ధరాత్రి దోపిడీ దొంగలు వరుస ఘటనలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఒకే రోజు పట్టణంలోని పాత హౌసింగ్ బోర్డు, కొత్త హౌసింగ్ బోర్డు ప్రాంతాలలో దొంగలు రెండు చోట్ల చోరీకి యత్నించడం స్థానికంగా కలకలం రేపింది. ఇప్పటికే హత్య కేసులు, అవినీతి ఆరోపణలతో సతమత మవుతున్న జిల్లా పోలీసులపై ఈ వరుస దొంగతనాల ఘటనలు మరింత ఒత్తిడిని పెంచుతున్నాయి.రెండు ప్రాంతాల్లో చోరీ యత్నం.. పాత హౌసింగ్ బోర్డులో భారీ చోరీ పట్టణంలోని పాత హౌసింగ్ బోర్డు ప్రాంతంలో విశ్వభారతి స్కూల్ దగ్గరలోని ఒక ఇంట్లో దొంగలు పడ్డారు. ఇంటి తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించిన దుండగులు ఇంట్లో ఉన్న సుమారు 3 తులాల బంగారాన్ని, 20 తులాల వెండిని అపహరించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గద్వాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కొత్త హౌసింగ్ బోర్డులో చోరీకి విఫలయత్నం పాత హౌసింగ్ బోర్డులో చోరీ చేసిన దొంగల ముఠా అదే రాత్రి కొత్త హౌసింగ్ బోర్డులోని మరో ఇంట్లోనూ చొరబడేందుకు ప్రయత్నించింది. అయితే, ఇక్కడ దొంగలకు ఎలాంటి విలువైన వస్తువులు లభించనందున, వారు ఏమీ అపహరించకుండానే వెనుదిరిగినట్లు సమాచారం. ఈ రెండు వరుస ఘటనలు గద్వాల పట్టణంలో రక్షణ ప్రశ్నార్థకంగా మారేలా చేశాయి.సతమతమవుతున్న జిల్లా పోలీసులు..ఒకవైపు జిల్లాలో హత్య కేసులు పెరుగుతుండటం, మరోవైపు పోలీసు అధికారులపైనే అవినీతి ఆరోపణలు వస్తుండడంతో జిల్లా పోలీసులు ఇప్పటికే తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో, పట్టణంలో దోపిడీ దొంగల హల్చల్ మొదలవడంతో శాంతిభద్రతల పరిరక్షణ జిల్లా పోలీసులకు పెను సవాలుగా మారింది. దొంగతనాలు జరిగిన ప్రాంతాల్లో పోలీసులు గస్తీని పెంచాల్సిన అవసరం ఉందని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. వరుస దొంగతనాలపై పోలీసుల ముమ్మర దర్యాప్తు..వరుస దొంగతనాలపై అప్రమత్తమైన పోలీసులు, కేసులను ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. దొంగతనం జరిగిన ప్రాంతాలలో క్లూస్ టీం ద్వారా వేలిముద్రలు సేకరించారు. ఆయా ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా దొంగల ముఠాను త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు వెల్లడించారు.

# 60 లక్షల రూపాయలతో ఇంద్రేశం రహదారి మరమ్మతులు

- అతి త్వరలో పూర్తిస్థాయిలో రహదారి విస్తరణ.. నిర్మాణం..
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



సంగారెడ్డి జిల్లా ,పటాన్చెరు,నవంబర్ 13 (వుదయం ప్రతినిధి): శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్చెరు నుండి ఇంద్రేశం మీదుగా పెద్ద కంజర్ల వరకు గల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందించేందుకు అతి త్వరలో హెచ్ఎండిఏ ద్వారా రహదారి విస్తరణ పనులు చేపట్టనున్నట్లు పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. గురువారం పటాన్చెరు పరిధిలోని ఓఆర్ సర్వీస్ రోడ్డు నుండి ఇంద్రేశం మీదుగా పెందకంజర్ల వరకు 60 లక్షల రూపాయల నిధులతో చేపట్టనున్న బీటీ ప్యాచ్ వర్క్ పనులకు ఎమ్మెల్యే జిఎంఆర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రమైన పటాన్చెరు పట్టణానికి ఇంద్రేశంతో పాటు. రామేశ్వరం బండ, పెద్దకంజర్ల, చిన్న కంజర్ల, ఐనోలు, బచ్చు గూడెం, పోచారం తో పాటు నర్సాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాల ప్రజలు ఈ రహదారినే వినియోగిస్తారని తెలిపారు. గతంలో ఇంద్రేశం నుండి పెద్దకంచెర్ల వరకు 22 కోట్ల రూపాయలతో రహదారి విస్తరణ పనుల కోసం నిధులు కేటాయించడం జరిగిందని తెలిపారు. అనివార్య కారణాల వలన విధుల కేటాయింపు రద్దు కావడం మూలంగా.. తిరిగి రహదారి వరమ్మత్తులు చేపట్టారని. ప్రస్తుత ప్రభుత్వంలోని మంత్రులకు విజ్ఞప్తి చేయడం జరిగిందని తెలిపారు. అతి త్వరలో రహదారి విస్తరణ పనులు సైతం ప్రారంభిస్తామని తెలిపారు. ప్రస్తుతానికి 20 లక్షల రూపాయల ప్రభుత్వ నిధులతో బీటీ ప్యాచ్ వర్క్ పనులు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఏ ఈ చంద్రశేఖర్, ట్రాఫిక్ సిఐ లాలు నాయక్, మాజీ ప్రజాప్రతినిధులు అంతిరెడ్డి, బండి శంకర్, దుర్గా రెడ్డి, రామచందర్, సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి కోసం ఊర్ల పంచాయతీ

జయశంకర్ భూపాలపల్లి నవంబర్ 13(వుదయం ప్రతినిధి): ఉపాధి కోసం నడుస్తున్న ఊర్ల పంచాయతీ కాస్త పోలీస్ స్టేషన్ తాసిల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతుంది. జయశంకర్ జిల్లా మహాదేవపూర్ మండలం లో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఇసుక క్వారీల్లో నుండి వివిధ ప్రాంతాలకు ఇసుకను తరలించే క్రమంలో వాహనదారులకు ఇబ్బందులు ఏర్పడకుండా లారీలలో లోడ్ చేసిన ఇసుకను కూలీల ద్వారా లేవల్ చేస్తూ ఉపాధి పొందుతున్న క్రమంలో మహాదేవపూర్ మండల కేంద్రంతో పాటు మండలంలోని ఎడపెల్లి గ్రామస్తుల మధ్య ఉపాధి పంచాయతీ మొదలైంది. ఇదిలా ఉంటే కొత్తపేట శివారులో ఏర్పాటైన ఇసుక క్వారీ లో తాము ఇసుకను లెవల్ చేస్తామంటూ అటు హాదేవపూర్,ఎదపల్లి గ్రామస్తుల మధ్య పంచాయితీ మొదలైంది. ఈ క్రమంలో క్వారీ మహాదేవపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని వస్తుందని రెవెన్యూ అధికారులు స్పష్టం చేశారు. దీంతో సమస్యను పరిష్కరించడానికి అధికారులకు తలకు మించిన భారంగా ఏర్పడింది. ఈ విషయంపై మహాదేవపూర్ డిప్యూటీ తహసిల్దార్ ను వుదయం ప్రతినిధి వివరణ కోరగా క్వారీ కొత్తపేట రెవెన్యూ గ్రామ శివారులోకి వస్తుందని మహాదేవపూర్ గ్రామపంచాయతీ పరిధిలోకి వస్తుందని తెలిపారు.

# ఇస్లామాబాద్ దాడికి కారణం భారత్.. పాకిస్తాన్

పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో జిల్లా కోర్టు ముందు ఆత్మహుతి దాడి జరిగి 12 మంది మరణించిన ఘటన ఆ దేశంలో తీవ్ర భద్రతా ఆందోళనలను రేకెత్తించింది. ఈ దుర్ఘటన జరిగిన కొద్ది గంటల్లోనే.. పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ సంచలన ఆరోపణలకు తెరతీశారు. ఈ దాడి వెనుక భారత్ హస్తం ఉందని సాక్ష్యాధారాలు లేకుండానే తీవ్ర ఆరోపణలు గుప్పించారు. పాకిస్తాన్ ప్రభుత్వ వార్తా సంస్థ అయిన ఏపీపీ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఇస్లామాబాద్ కోర్టు వద్ద జరిగిన కారు పేలుడు దాడికి, ఆఫ్ఘనిస్థాన్ సరిహద్దు సమీపంలోని వానా నగరంలో ఉన్న కేడెట్ కాలేజీపై జరిగిన దాడికి భారత్ ప్రేరేపిత ఉగ్రవాద ప్రాక్సీలే కారణమని ఆయన తీవ్ర ఆరోపలు చేశారు. పాకిస్తాన్‌ను అస్థిరపరచాలనే లక్ష్యంతో భారత్ చేపడుతున్న ప్రభుత్వ ప్రేరేపిత ఉగ్రవాదానికి ఈ దాడులు కొనసాగింపు అని పేర్కొన్నారు. అఫ్ఘనిస్థాన్ భూభాగం నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తున్న తాలిబన్ నెట్‌వర్క్ అమాయక పిల్లలపై కూడా దాడి చేసిందని ఆరోపించారు. భారత ఆశ్రయం కింద అఫ్ఘానిస్థాన్ గడ్డపై నుంచి జరుగుతున్న ఈ దాడులను ఎంత ఖండించినా తక్కువేనని షరీఫ్ నిరాధార ఆరోపణలు చేశారు. ఈ సందర్భంగా భారత్, తాలిబన్లను ఉద్దేశించి షెహబాజ్ షరీఫ్ కీలక వ్యాఖ్యలు చేశారు. అఫ్గాన్ తాలిబన్ పాలనను భారతదేశ ఏజెంట్‌గా ఆయన అభివర్ణించారు. తెహ్రిక్-ఎ-తాలిబాన్ పాకిస్తాన్‌ను కూడా భారత్‌తో ముడిపెట్టడానికి ఫితా అల్ హిందూస్తాన్ అని పిలవడం గమనార్హం. ఇస్లామాబాద్ పేలుడు జరిగిన కొన్ని గంటల్లోనే షెహబాజ్ షరీఫ్ ఇలాంటి ఆరోపణలు చేయడం గమనార్హం. మరోవైపు పాకిస్తాన్ రక్షణ శాఖ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ ఇస్లామాబాద్‌లో జరిగిన ఈ ఆత్మహుతి దాడిని పాకిస్తాన్‌కు ఒక మేల్కొలుపుగా అభివర్ణించారు.

## ఢిల్లీ పేలుడుపై ఇజ్రాయెల్ సంఘీభావం.. నెతన్యాహు శక్తివంతమైన సందేశం



ఢిల్లీలో జరిగిన దారుణమైన పేలుడు ఘటనను ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనలో బాధితులైన కుటుంబాలకు ఆయన హృదయపూర్వక సానుభూతిని తెలియజేశారు. భారత్‌కు ఇజ్రాయెల్ ఎల్లవేళలా అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ దాడిని ఓ చీకటి శక్తిగా అభివర్ణిస్తూ, దాన్ని ఎదిరించే ధైర్యం రెండు దేశాలకూ ఉందని పేర్కొన్నారు. భారత్, ఇజ్రాయెల్ రెండూ పురాతన నాగరికతలని, వాటి పునాదులు శాశ్వత సత్యాలపై నిర్మితమైనవని నెతన్యాహు తన సందేశంలో గుర్తు చేశారు. శత్రువులు దాడుల ద్వారా భయపెట్టాలని చూసినప్పటికీ, ఈ దేశాల స్థితిస్థాపకతను దెబ్బతీయలేరని ఆయన ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా ఆయన ట్వీట్‌లో రెండు దేశాల ఐక్యతను ప్రతిబింబించే శక్తివంతమైన సందేశాన్ని పంచుకున్నారు. ఈ ఘటన రెండు దేశాల మధ్య బలమైన స్నేహ బంధాన్ని మరోసారి హైలైట్ చేసింది.నెతన్యాహు తన ట్వీట్‌లో శత్రువుల చీకటి శక్తులను రెండు దేశాల వెలుగు తరిమికొడుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఢిల్లీలోని నగర ప్రజలు ఈ దాడి ఎదుర్కొన్న తీరు భారత్ యొక్క ధైర్యానికి నిదర్శనమని ఆయన ప్రశంసించారు. ఈ దాడులు రెండు దేశాల ప్రజలను భయపెట్టలేవని, మరింత దృఢంగా ఐక్యంగా నిలబడతాయని ఆయన పేర్కొన్నారు. ఈ సందేశం భారతీయులలో ఆత్మవిశ్వాసాన్ని నింపడమే కాక, అంతర్జాతీయ సమాజంలోనూ సానుకూల స్పందనను రేకెత్తించింది. ఈ ఘటన భారత్-ఇజ్రాయెల్ మధ్య దీర్ఘకాలిక సంబంధాలకు ఒక గుర్తుగా నిలిచింది. రెండు దేశాలూ గతంలోనూ అనేక సవాళ్లను ఎదుర్కొని, బలంగా నిలబడ్డాయని నెతన్యాహు సందేశం సూచిస్తోంది.

## పారదర్శకంగా ఎన్నికలు నిర్వహిస్తే బంగ్లాకు వెళ్తా



బంగ్లాదేశ్‌లో తలెత్తిన ఉద్రిక్తతల కారణంగా ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా భారత్‌కు వచ్చి ఆశ్రయం పొందుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఆమె తిరిగి తన స్వదేశానికి వెళ్లే విషయంలో అక్కడి ప్రభుత్వానికి కొన్ని షరతులు పెట్టారు. స్వేచ్ఛాయుతమైన, న్యాయమైన ఎన్నికలను నిర్వహించినప్పుడే తాను తిరిగి బంగ్లాదేశ్‌కు వస్తానని ఆమె స్పష్టం చేశారు. అలాగే బంగ్లాలో అవామీ లీగ్ పార్టీ పై నిషేధం ఎత్తివేయాలని ఆమె డిమాండ్ చేశారు. స్వేచ్ఛాయుతమైన ఎన్నికలు నిర్వహించాలని అక్కడి ప్రజలు కూడా కోరుకుంటున్నారని ఆమె తాజాగా పీటీఐకి ఇచ్చిన ఈమెయిల్ ఇంటర్వ్యూలో చెప్పారు. ప్రస్తుతం బంగ్లాలో అధికారంలో ఉన్న యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం తీవ్రవాద శక్తులకు అధికారం ఇస్తూ.. భారత్‌తో ఆ దేశ సంబంధాలను ప్రమాదంలో పడేస్తోందని ఆమె ఆరోపించారు. తమ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో భారత్‌తో బలమైన సంబంధాలు కొనసాగించామని, యూనస్ తన మూర?త్వంతో వాటిని బలహీనపరుస్తున్నారన్నారని హసీనా విమర్శించారు. కష్ట సమయంలో ఆశ్రయం కల్పించినందుకు మోదీ ప్రభుత్వానికి, భారత ప్రజలకు ఈ సందర్భంగా ఆమె కృతజ్ఞతలు తెలిపారు. తాను అధికారంలో ఉన్న సమయంలో విద్యార్థులు చేపట్టిన ఆందోళనలను పరిష్కరించడంలో తమ ప్రభుత్వం విఫలమైందని, అలాంటి భయంకరమైన ఘటనల నుంచి పాఠాలు నేర్చుకున్నానని పేర్కొన్నారు. ఆ సమయంలో విద్యార్థి నాయకులు కూడా బాధ్యత తీసుకొని ఉండాల్సిందని అభిప్రాయపడ్డారు. తనపై నమోదైన కేసుల విషయంలో అంతర్జాతీయ క్రిమినల్ కోర్టులో విచారణకు హాజరవడానికి తాను సిద్ధంగా ఉన్నానని షేక్ హసీనా తెలిపారు. యూనస్ ప్రభుత్వం తనపై చేసిన ఆరోపణలను హసీనా ఖండించారు. అవన్నీ రాజకీయంగా తనను బలహీనపరచడానికి చేసిన కుట్రగా పేర్కొన్నారు. విద్యార్థుల ఆందోళనలతో అనూహ్యరీతిన ప్రధాని పీఠం నుంచి దిగిపోయిన షేక్ హసీనా గతేడాది ఆగస్టు 5న బంగ్లాదేశ్‌ను వీడి భారత్‌కు వచ్చారు. నాటి నుంచి ఆమె ఢిల్లీలోని ఓ రహస్య ప్రదేశంలో నివసిస్తున్నారు.

## రాజ్యాంగ బిల్లు పరిశీలనకు జేపీసీ ఏర్పాటు



న్యూఢిల్లీ: రాజ్యాంగ (130 సవరణ) బిల్లు, 2025 జమ్మూ కాశ్మీర్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు, 2025.. కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వం (సవరణ) బిల్లు 2025లను పరిశీలించడానికి పార్లమెంట్ జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)ని ఏర్పాటు చేసింది. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఈ కమిటీకి చైర్‌పర్సన్‌గా పార్లమెంటు సభ్యురాలు అపరాజిత సారంగిని నియమించారు. లోక్‌సభ బులెటిన్ ప్రకారం లోక్‌సభ, రాజ్యసభ రెండింటి నుంచి మొత్తం 31 మంది సభ్యులను కమిటీ నియమించింది. లోక్‌సభ నుంచి రవిశంకర్ ప్రసాద్, భర్తృహరి మహతాబ్, ప్రదాన్ బారు, బ్రిజ్మోహన్ అగర్వాల్, విష్ణు దయాళ్ రామ్, సుప్రియా సూలే , అసదుద్దీన్ ఓవైసీ సభ్యులుగా ఉన్నారు. హర్‌సిమ్రత్ కౌర్ బాదల్ కూడా ఉన్నారు. రాజ్యసభ నుంచి నామినేట్ చేయబడిన సభ్యులలో బ్రిజ్ లాల్, ఉజ్వల్ నికం, నబమ్ రెబియా, డాక్టర్ కె. లక్ష్మణ్, సుధా మూర్తి, బీరేంద్ర ప్రసాద్ బైశ్యా, ఎస్. నిరంజన్ రెడ్డి ఉన్నారు. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), సమాజ్ వాదీ పార్టీ (ఎస్పీ), ద్రవిడ మున్నేట్ర కజగం (డీఎంకే) సభ్యులు కమిటీలో చేరకపోవడం గమనార్హం. జాయింట్ కమిటీ మూడు బిల్లులను క్షుణ్ణంగా పరిశీలించి, సమగ్ర చర్చల తర్వాత పార్లమెంటుకు తన సిఫారసులను సమర్పిస్తుంది. ఇంతలో, కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు పార్లమెంటు శీతాకాల సమావేశాలు డిసెంబర్ 1 నుంచి 19 వరకు జరుగుతాయని ప్రకటించారు. పార్లమెంటు శీతాకాల సమావేశాలను ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ ప్రతిపాదనను అధ్యక్షుడు ముర్ము ఆమోదించారు. పార్లమెంటు సజావుగా జరిగేలా సహకరించాలని అన్ని రాజకీయ పార్టీలను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కోరారు.

## ప్రపంచవ్యాప్తంగా టీబీ కేసులు పైపైకి

గతేడాది ప్రపంచవ్యాప్తంగా క్షయ వ్యాధి కేసులు రికార్డు స్థాయిలో పెరిగినట్లు ప్రపంచ ఆరోగ్య ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) వెల్లడించింది. 2024లో 83 లక్షల మందిలో కొత్తగా టీబీ నిర్ధరణ అయ్యిందని, అంతకుముందు ఏడాదితో పోలిస్తే ఇది అధికమని తెలిపింది. అయితే, మరణాల సంఖ్య మాత్రం తగ్గినట్లు పేర్కొంది. కరోనా మహమ్మారి సమయంలో క్షయ నిర్ధరణ పరీక్షలు, చికిత్సకు అంతరాయం కలిగిన విషయం తెలిసిందే. ఆ తర్వాత స్క్రీనింగ్, చికిత్స మెరుగుపడుతుందని తాజా గణాంకాలు సూచిస్తున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. విశ్వవ్యాప్తంగా 2023లో టీబీ మరణాల సంఖ్య 12.5లక్షలుగా ఉండగా.. గతేడాది ఈ సంఖ్య 12.3లక్షలకు తగ్గినట్టు తెలిపింది. అమెరికాలో గతేడాది టీబీ కేసుల సంఖ్య పెరిగినట్లు డబ్ల్యూహెచ్ఓ వెల్లడించింది. దశాబ్దం కాలంలో ఇదే అత్యధికమని పేర్కొంది. అమెరికా టీబీ కేసుల్లో ఇతర దేశాల్లో జన్మించిన వారిలోనే ఇవి ఎక్కువ ఉన్నట్లు అంచనా. ప్రపంచంలోని పావు వంతు మందిలో టీబీ బ్యాక్టీరియా ఉన్నప్పటికీ.. కేవలం కొందరిలోనే లక్షణాలు బయటపడతాయి. సరైన సమయంలో చికిత్స అందించకుంటే ప్రాణాంతకంగా మారుతుంది. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక మరణాలకు కారణమైన వ్యాధుల్లో టీబీ ఒకటిగా ఉంటోంది. ఈ వ్యాధికి సంబంధించి ఏటా డబ్ల్యూహెచ్ఓ నివేదికలు విడుదల చేస్తుంది. 184 దేశాల నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా తాజా నివేదిక విడుదల చేసింది.

## జర్నలిజం కోసం పోరాటం తప్పదు

జర్నలిజం కోసం పోరాటం తప్పదని తన బాధ్యతల నుంచి తప్పుకుంటున్న బీబీసీ చీఫ్ టిమ్ డేవీ అన్నారు. బీబీసీపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వేసిన దావా బెదిరింపుల నేపథ్యంలో ఆయనపై విధంగా స్పందించారు. 'మన జర్నలిజం కోసం తప్పక పోరాడాలి' అని ఆయన పిలుపునిచ్చారు. బీబీసీ.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రసంగాన్ని తప్పుగా ఎడిట్ చేసినందుకు వ్యతిరేకంగా సుమారు రూ.8,300 కోట్లు పరిహారం డిమాండ్ చేస్తూ ట్రంప్ న్యాయవాదులు నోటీసులు పంపారు. "మన మీద ఒత్తిడి పెరుగుతోంది. జర్నలిజాన్ని ఆయుధంగా వాడుతున్నారు. ఈ పరిస్థితుల్లో మన విలువలను కాపాడుకోవాలి" అని టిమ్ డేవీ అన్నారు. ఇప్పటికే బీబీసీ న్యూస్ సీఈఓ డెబోరా టర్నెస్ కూడా ఈ వివాదం నడుమ రాజీనామా చేసిన విషయం విదితమే. ఇది జరిగిన రెండు రోజుల తర్వాత టిమ్ డేవీపై విధంగా స్పందించినట్టు తెలుస్తున్నది. బీబీసీ లాంటి ఒక అంతర్జాతీయ వార్తాసంస్థపై ట్రంప్ తాజా బెదిరింపులు ఇటు రాజకీయంగానూ చర్చనీయాంశంగా మారాయి. యూకేలోని స్టార్మర్ నేతృత్వంలోని లేబర్ ప్రభుత్వం బీబీసీ స్వతంత్రతను కాపాడాలనే ధోరణిలో ఉన్నది. అయితే ఇవి అమెరికాతో సంబంధాలపై ప్రభావాన్ని చూపుతాయని విశ్లేషకులు చెప్తున్నారు. కాగా యూకే సాంస్కృతిక మంత్రి లిసా నాండీ పార్లమెంట్‌లో ఈ వివాదంపై ప్రకటన చేయనున్నారని తెలుస్తోంది.

## ఢిల్లీ పేలుడుతో మళ్లీ తెరపైకి మసూద్ అజార్

న్యూఢిల్లీ: ఈ నెల 10వ తేదీన ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన భారీ కారు పేలుడు దేశ భద్రతా వ్యవస్థలో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఈ ఘటనకు సంబంధించి కేంద్ర నిఘా, దర్యాప్తు సంస్థలు ముమ్మర దర్యాప్తు చేస్తున్నాయి.ఇప్పటికే పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకుని.. విచారణ జరుపుతున్నాయి. ప్రమాద తీవ్రతను బట్టి.. ఈ దాడికి సంబంధించిన కారణాలను అన్వేషిస్తున్నాయి. ఈ క్రమంలోనే తాజాగా.. జైషే మహ్మద్ చీఫ్, మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్ట్ మసూద్ అజార్ పేరు తెరపైకి వచ్చింది. ఒకప్పుడు భారత్ అదుపులో ఉన్న మసూద్ అజార్‌ను.. అతని అనుచరులు విమానాన్ని హైజాక్ చేసి విడిపించుకుపోయారు. అప్పటినుంచి భారత్‌పై జరిగిన అనేక ఉగ్రదాడుల వెనుక మసూద్ అజార్ మాస్టర్‌మైండ్‌గా ఉన్నాడు. మసూజ్ అజార్‌ను ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించగా.. పాకిస్తాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ మద్దతుతో ఉగ్ర కార్యకలాపాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. 56 ఏళ్ల మసూద్ అజార్.. పాకిస్తాన్ కేంద్రంగా పనిచేస్తున్న జైషే మహ్మద్ ఉగ్ర సంస్థ వ్యవస్థాపకుడిగా ఉన్నారు. 1999లో ఎయిరిండియా ఐసీ-814 విమానం హైజాక్ తర్వాత.. అందులో ఉన్న ప్రయాణికులను విడుదల చేసేందుకు బదులుగా భారత్ వదిలిపెట్టిన ముగ్గురు ఉగ్రవాదుల్లో ఒకడు.

## మా అడవులు అమ్మకానికి లేవు

వాతావరణ సదస్సు కాప్ 30 జరుగుతున్న వేదిక వద్దకు వెళ్ళేందుకు ఆదివాసీలు, ఆదివాసీయేతరులు ప్రయత్నించిన నేపథ్యంలో మంగళవారం రాత్రి సెక్యూరిటీ గార్డులతో వారికి ఘర్షణలు జరిగాయి. డజన్ల సంఖ్యలో పురుషులు, మహిళలు ప్రవేశ ద్వారం నుండి లోపలకు తోసుకుపోవడానికి ప్రయత్నించారు. వీరిలో కొందరు ప్రకాశవంతమైన ఈకలు తలపై ధరించడం కనిపించింది. వారు ఒక తలుపును బలవంతంగా తోయడంతో విరిగిపోయింది. ఆతర్వాత మెటల్ డిటెక్టర్ల గుండా వెళ్ళిన వారందరూ బ్లూ జోన్‌లోకి ప్రవేశించారు. దాంతో ఐక్యరాజ్యసమితి సెక్యూరిటీగార్డులు హడావిడిగా వారిని నిలువరించేందుకు వచ్చారు. దాంతో అక్కడ తోపులాటలు,ఘర్షణలు, తిట్టుకోవడాలుచోటు చేసుకున్నాయి. "మా అడవులు అమ్మకానికి లేవు." అని రాసిన ప్లకార్డును వారు ప్రదర్శించారు. 'జుంటోస్' (కలిసి) అని రాసిన టీ షర్టలను ధరించారు.

# అమెరికా దాడి చేస్తే తిప్పికొడతాం



అమెరికా కనుక దురాక్రమణకు పాల్పడినా లేదా దాడి చేసినా దీటుగా ఎదుర్కోవడానికి వెనిజులా సమాయత్తమవుతోంది. దాడులను తిప్పికొట్టేందుకు సాయుధ దళాలను సన్నద్ధం చేస్తున్నామని వెనిజుల ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు వెనిజులా రక్షణ మంత్రి వ్లాదిమిర్ పాడ్రినో మంగళవారం ఓ ప్రకటన చేశారు. త్రివిధ దళాలను సంసిద్ధం చేస్తున్నామని, క్షిపణి దళాలను మోహరిస్తున్నామని ఆయన చెప్పారు. పోలీసులు, మిలిషియాలు, పౌర యూనిట్లు కూడా భాగస్వాములయ్యేలా చూస్తున్నామని అన్నారు. అమెరికా తన యుద్ధ విమాన వాహక నౌకను సరిహద్దున ఉన్న సముద్ర జలాలలో మోహరించడంతో వెనిజులా అప్రమత్తమైంది. దేశాధ్యక్షుడు నికొలస్ మదురో నేతృత్వంలోని వెనిజులా ప్రభుత్వాన్ని కూల్చివేయడానికి అమెరికా చాలా కాలంగా ప్రయత్నిస్తోంది. అమెరికా అధ్యక్షుడిగా డోనాల్డ్ ట్రంప్ రెండోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరిగాయి. గెరాల్డ్ ఆర్ ఫోర్డ్ క్యారియర్ స్ట్రైక్ గ్రూప్ కరేబియన్ సముద్రానికి చేరిందని అమెరికా రక్షణ కార్యాలయం పెంటగాన్ మంగళవారం ధృవీకరించింది. ఈ స్ట్రైక్ గ్రూపులో ప్రపంచంలోనే అతి పెద్ద యుద్ధ విమాన వాహక నౌక ఉంది. ఇందులో నాలుగు వేల మంది నావికులు, వ్యూహాత్మకమైన యుద్ధ విమానం కూడా ఉన్నాయి. కాగా వెనిజులాపై సైనిక దాడి జరపడ మంటే అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమే అవుతుందని న్యాయ నిపుణులు అభిప్రాయపడ్డారు. వెనిజులాపై భూతల దాడులను అమెరికాలోని 47 శాతం మంది వ్యతిరేకిస్తున్నారని యూగవ్ అనే పరిశోధక సంస్థ ఇటీవల నిర్వహించిన పోల్ తేల్చి చెప్పింది. వెనిజులాపై దాడులను కేవలం 19 శాతం మంది మాత్రమే సమర్థించారు.

# విదేశీ విద్యార్థులపై ట్రంప్ మరిన్ని ఆంక్షలు



అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చిన దగ్గరి నుంచి ఎవరిపై దుందుడుకుగా వ్యవహరిస్తున్నారో..ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నారో ఎవరికీ తెలియడం లేదు. తాజాగా విదేశీ విద్యార్థుల రాకను కఠినతరం చేస్తున్నారు. సోషల్ వెట్టింగ్ అంటూ పలు విధానాలతో అమెరికాకలను గందరగోళంలో పడేస్తున్నారు. ఈ క్రమంలో యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హౌమ్‌ల్యాండ్ సెక్యూరిటీ సరికొత్త ప్రతిపాదన చేసింది. ఆ నిబంధన వల్ల అంతర్జాతీయ విద్యార్థులకు ఉన్న ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్‌పై పరిమితులు విధించేలా లేక పూర్తిగా రద్దు చేసే అవకాశం ఉంది. ఆ రూల్ ఫెడరల్ రెగ్యులేటరీ ఎజెండాలో లిస్ట్ అయింది. 2025 చివర్లో లేక 2026 ప్రారంభంలో దానిని అమలు చేయొచ్చని తెలుస్తోంది. బీటెక్‌తోపాటు తత్సమాన విద్యార్హతల అండర్ గ్రాడ్యుయేషన్ ఇక్కడ పూర్తి చేసి, ఎఫ్-1 వీసా పొందినవారు స్టెమ్ కోర్సుల్లో (సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, గణితశాస్త్రం) ఎంఎస్ చదివేందుకు అమెరికా వెళ్తుంటారు. వీటిలో ఏదేనీ విభాగంలో పీజీ పూర్తి చేసిన తరువాత ఓపీటీకి దరఖాస్తు చేసుకోవాలి. ఓపీటీ వచ్చిన అనంతరం తొలి ఏడాది స్టెమ్‌కు సంబంధించిన సంస్థల్లోనే ఉద్యోగం చేయాల్సి వస్తుంది. అనంతరం రెండేండ్లపాటు (స్టెమ్‌కు సంబంధించిన సంస్థల్లోనే) అక్కడ పనిచేసే అవకాశం లభిస్తుంది. ఈ సమయంలోనే పలువురు ఉద్యోగావకాశాలు మెరుగుపర్చుకొని హెచ్-1 వీసా సైతం పొందుతున్నారు. ఓపీటీని భారత్‌తో సహా ఇతర దేశాల విద్యార్థులు దుర్వినియోగం చేస్తున్నారని అమెరికాలోని పలు సంస్థలు అభ్యంతరం తెలపటంతో సమస్య మొదలైంది. ఆ నేపథ్యంలో ఓపీటీ ప్రోగ్రామ్‌ను రద్దు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు గతంలో వార్తలు వచ్చాయి.

# అమెరికా హెచ్1బి వీసా షాక్.. విదేశీలు ట్రైనర్లుగా మాత్రమే..



అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ ఇటీవల హెచ్1బి వీసా విధానంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. విదేశీ ఉద్యోగులపై ఎక్కువ కాలం ఆధారపడకుండా, అమెరికన్ పౌరులను అధిక నైపుణ్యం కలిగిన ఉద్యోగాలకు సిద్ధం చేయాలని ఆయన సూచించారు. ఇందుకోసం తాత్కాలికంగా విదేశీ కార్మికులను ఆహ్వానించి, వారిని అమెరికన్లకు శిక్షణ ఇచ్చేలా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ఈ విధానం ద్వారా అమెరికా ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయవచ్చని, దీర్ఘకాలికంగా స్థానికులకు ప్రయోజనం చేకూరుతుందని బెసెంట్ వివరించారు. వీసా కొత్త విధానం ప్రకారం, విదేశాల నుంచి వచ్చే నిపుణులను కేవలం టెంపరరీగా మాత్రమే అనుమతించాలని స్కాట్ బెసెంట్ ఒప్పించారు. ఈ వీసా ద్వారా వచ్చినవారు అమెరికన్ కార్మికులకు అవసరమైన స్కిల్స్ నేర్పించాలి, ఆ తర్వాత తమ స్వదేశాలకు తిరిగి వెళ్లాలి అని ఆయన స్పష్టం చేశారు. ఇలాంటి విధానం అమెరికా ఉద్యోగ మార్కెట్‌ను మరింత సమతుల్యం చేస్తుందని, విదేశీ ప్రతిభను సమర్థవంతంగా వినియోగించుకోవచ్చని బెసెంట్ విశ్వాసం వ్యక్తం చేశారు. ముఖ్యంగా టెక్, ఇంజినీరింగ్ వంటి రంగాల్లో ఈ మార్పు పెద్ద ప్రభావం చూపుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. అమెరికన్లకు శిక్షణ ఇవ్వడమే ఈ విధానం ముఖ్య లక్ష్యమని స్కాట్ బెసెంట్ ఒప్పించారు. విదేశీలు వచ్చి స్థానికులకు అధునాతన టెక్నాలజీలు, నైపుణ్యాలు నేర్పించాలి, దాని ద్వారా అమెరికన్లు స్వతంత్రంగా ఉద్యోగాలు చేపట్టేలా చేయాలి అని ఆయన సూచించారు. ఈ ప్రక్రియలో విదేశీ కార్మికులు తాత్కాలిక భాగస్వాములుగా మాత్రమే ఉండాలి, శాశ్వతంగా కాదని బెసెంట్ హెచ్చరించారు. ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు అమెరికా యువతకు మరిన్ని అవకాశాలు కల్పిస్తాయని, దేశ ఆర్థిక పురోగతికి దోహదపడతాయని ఆయన వివరించారు.చివరగా, హెచ్1బి వీసా విధానం ద్వారా అమెరికన్లే అన్ని ఉద్యోగాలు తీసుకునేలా చేయాలని స్కాట్ బెసెంట్ పిలుపునిచ్చారు. విదేశీలు శిక్షణ ఇచ్చిన తర్వాత తిరిగి వెళ్లిపోవాలి, స్థానికులు ఆ స్థానాలు భర్తీ చేయాలి అని ఆయన ఒప్పించారు. ఈ మార్పు అమెరికా ఇమ్మిగ్రేషన్ వ్యవస్థను మరింత సమర్థవంతం చేస్తుందని, దీర్ఘకాలికంగా దేశ ప్రయోజనాలకు ఉపయోగపడుతుందని బెసెంట్ నమ్మకం వ్యక్తం చేశారు. మొత్తంగా, ఈ వ్యాఖ్యలు హెచ్1బి వీసా భవిష్యత్తును మార్చేవిగా చర్చకు దారి తీశాయి.

# బీహార్‌లో ఎన్నికల్లో ఎన్డీఏదే గెలుపు? వీరే గెలవడానికి కారణం



బీహార్: దేశ రాజకీయాల్లో పెను మార్పులకు కేంద్రంగా నిలిచిన బీహార్ అసెంబ్లీ ఎన్నికల పోరు మంగళవారం రికార్డు స్థాయి పోలింగ్‌తో ముగిసింది. ఎన్నికల తుది ఫలితాలు ఈ నెల 14వ తేదీనే వెల్లడి కానుండగా.. మంగళవారం సాయంత్రం వెలువడిన ఎగ్జిట్ పోల్స్ అంచనాలు దేశవ్యాప్తంగా రాజకీయ చర్చను రేకెత్తించాయి. ముఖ్యంగా ప్రతీ ఒక్కరూ బీహార్‌లో నితీశ్ కుమార్ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి మరోసారి అధికారాన్ని చేజిక్కించుకోబోతోందని ముక్తకంఠంతో తేల్చాయి. బీహార్ అసెంబ్లీలో మొత్తంగా 243 స్థానాలు ఉండగా.. 130 స్థానాలకంటే ఎన్డీఏ తక్కువ దక్కించుకోదని చెప్పాయి. ఇదంతా బాగానే ఉండగా.. ఎన్డీఏనే ఎక్కువగా గెలవడానికి గల కారణం ఏంటనే దానిపై విస్తృత చర్చ సాగుతోంది. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా జరిగిన తొలి విడత పోలింగ్‌లో 69.04 శాతం మంది మహిళలు ఓట్లు వేయగా, 61.56 శాతం పురుషులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇంకో రెండో విడతలో 73.03 శాతం మహిళలు, 64.1 శాతం పురుషులు ఓట్లు వేశారు. ఇలా రెండు విడతల్లో కలిసి మొత్తంగా 71.6 శాతం మంది మహిళలు ఓట్లు వేయగా.. 62.8 శాతం మంది పురుషులు మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇలా ఓటు వేసిన వాళ్లలో మహిళలే ఎక్కువగా ఉండడం.. వారందరి ఓట్లు ఎన్డీఏకే వెళ్లినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా నితీశ్ కుమార్ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వంపై వలసలు, ఉపాధి లేమి వంటి అంశాల కారణంగా తీవ్రమైన వ్యతిరేకత ఉన్నప్పటికీ.. మహిళా ఓటర్లు మాత్రం ఆయనకు గట్టిగా మద్దతు తెలుపుతున్నారు. చాలా మంది మహిళా ఓటర్లు నితీశ్‌ను ఇప్పటికీ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే నమ్మకమైన నాయకుడిగానే చూస్తున్నారు. గత రెండు దశాబ్దాలలో నితీశ్ కుమార్ ప్రభుత్వం అమలు చేసిన మహిళా సాధికారత పథకాలు ఈ నమ్మకానికి ప్రధాన కారణాలుగా తెలుస్తోంది. మద్యపాన నిషేధం, జీవికా కార్యక్రమం, మెరుగైన శాంతిభద్రతలు వంటి చర్యలు మహిళలకు సురక్షితమైన జీవనాన్ని అందించాయి.

## ఢిల్లీ బాంబ్ పేలుడు: పార్లమెంటరీ ప్యానల్ ప్రతికూల నిర్ణయం

న్యూఢిల్లీ: ఎర్రకోటసమీపంలోజరిగిన పేలుడుఘటనపై అంశం బుధవారం పార్లమెంటరీ స్థాయి హోం వ్యవహారాల కమిటీ సమావేశంలో చర్చకు వచ్చింది. అయితే, చైర్‌పర్సన్ దీనిపై చర్చ జరపకమని నిరాకరించారు.విశ్వసనీయ వర్గాల ప్రకారం, ఢిల్లీ పేలుడు ఘటనలో 12 మంది ప్రాణాలు కోల్పోయిన అంశాన్ని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ ఒకరు లేవనెత్తేందుకు ప్రయత్నించారు. ఇంటెలిజెన్స్ విఫలమయిన నేపథ్యంలో ఆందోళన వ్యక్తం చేశారు. అయినప్పటికీ, కమిటీ చైర్‌పర్సన్ రాధా మోహన్ దాస్ ఈ అంశంపై చర్చకు అనుమతించలేదు. సుమోటో ప్రకటనకు కూడా ఆమోదం ఇవ్వలేదు.విపత్తు నిర్వహణ ఎజెండా పై బుధవారం పార్లమెంటరీ కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో హోం మంత్రిత్వ శాఖ, నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్, నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, ఫైర్ సర్వీసెస్, సివిల్ డిఫెన్స్ మరియు హోం గార్డ్స్ డీజీలు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## భారత్‌పై యుఎస్ టారీఫ్‌ల ఎఫెక్ట్

భారత ఎగుమతులపై అమెరికా సుంకాల ప్రభావం క్రమంగా పెరుగుతున్నది. దేశ జీడీపీ మీద, ఉత్పత్తి, ఉపాధి అవకాశాల ప్రభావం దేశంలోని కొన్ని కేంద్రాల్లో తీవ్రంగా ఉంది. అమెరికా సుంకాలు పది శాతంతో ప్రారంభమై ఆగస్టు 7 నాటికి 25 శాతం, ఆగస్టు 25 నాటికి 50శాతానికి చేరుకున్నాయి. వీటివల్ల గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ రిపోర్ట్ ప్రకారం 2025 మే నుండి సెప్టెంబర్ నాటికి అమెరికాకు మన దేశం చేసే ఎగుమతులు 37.5శాతానికి పడిపోయాయి. అమెరికాకు భారతదేశం ప్రతి సంవత్సరం సగటున 86.51 బిలియన్ డాలర్లు విలువ గల సరుకులను ఎగుమతులు చేస్తున్నది. ఇందులో 43శాతం అంటే 49.6 బిలియన్ డాలర్ల విలువ గల సరుకుల ఎగుమతులు పడిపోయాయి. వీటివల్ల అనేక రకాలుగా నష్టం జరిగింది. 2025 మేలో 8.8 బిలియన్ డాలర్ల విలువ గల సరుకులు ఎగుమతి చేస్తే, సెప్టెంబర్‌లో 5.5 బిలియన్ డాలర్లకు పడిపోయింది. దేశ జీడీపీలో 0.9శాతం తగ్గుదలకు అవకాశం ఏర్పడింది. జీడీపీ 6.5శాతం నుండి 5.6శాతానికి తగ్గే పరిస్థితి ఏర్పడింది. అమెరికాకు ఎగుమతులు తగ్గడంతో ఉత్పత్తి చేసే కంపెనీలలో సరుకులు గోడౌన్‌లలో మూలుగుతున్నాయి. సరుకు ఉత్పత్తిదారులు ఉత్పత్తిని తగ్గిస్తున్నారు. ఫలితంగా కార్మికులకు ఉపాధి తగ్గి ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. అంతిమంగా దేశంలో నిరుద్యోగం పెరగడానికి ఆర్థిక మందగమనం పెరగడానికి సంక్షోభానికి దారి తీసే పరిస్థితులు ఏర్పడ్డాయి. వీటి నివారణకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అమెరికాను ఎదిరించే దమ్ము లేక దేశ ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నది. అమెరికా సుంకాల వల్ల కీలక రంగాలు తీవ్ర నష్టాలకు గురవుతున్నాయి. మే నుండి సెప్టెంబర్ వరకు ఫార్మాస్యుటికల్ ఎగుమతులు 15.7శాతం పడిపోయాయి. వాటి విలువ సుమారు 745.6 మిలియన్ డాలర్ల నుండి 628.3 మిలియన్ డాలర్లకు తగ్గింది. ఇండిస్టియల్ మెటల్స్ ఆటో పార్ట్స్ ఇతరాలు ప్రపంచవ్యాప్తంగానే 16.7శాతం ఎక్స్‌పోర్ట్ తగ్గాయి. మన దేశం నుండి ఎగుమతయ్యే అల్యూమినియం ఎక్స్‌పోర్ట్ 37శాతం, కాపర్ 25శాతం, ఆటో పార్ట్స్ 12శాతం, ఐరన్ మరియు స్టీల్ 8శాతం ఎగుమతులు తగ్గాయి. ఉత్పత్తి రంగంలోని కార్మికులు ఉపాధి పొందుతున్న రంగాలలో వస్త్రాలు, రసాయనాలు, వ్యవ సాయ, ఆహార పరిశ్రమలు, యంత్రాలు, రత్నాలు, ఆభరణాలు రంగాల యొక్క ఎగుమతులు 33శాతం పడిపోయాయి. ఇందులో మే నెలలో 4.8 బిలియన్ డాలర్ల నుండి సెప్టెంబర్ నాటికి 3.2 బిలియన్ డాలర్లకు తగ్గాయి. రత్నాల ఆభరణాల ఎగుమతులు 59.2 శాతం తగ్గి సుమారు 500.2 మిలియన్ డాలర్ల నుండి 202.8 మిలియన్ డాలర్ల విలువ గల సరుకులు తగ్గి పోయాయి. ఆ మేరకు వియత్నాం, థారులాండ్‌లు అమెరికా ఆర్డర్స్ పొంది లాభపడ్డాయి. సోలార్ ప్యానల్స్ ఎగుమతులు కూడా 60.8శాతం పడిపోయాయి. అంటే సుమారు 202.6 మిలియన్ డాలర్ల నుండి 79.4 మిలియన్ డాలర్ల విలువ నష్టపోవడం జరిగింది. ప్రధానంగా స్మార్ట్ ఫోన్ ఎగుమతులు కూడా భారీగా తగ్గాయి. గత సంవత్సరం ఇదే కాలంలో 197శాతం ఎగుమతులు పెరిగితే, ఈ మే నుండి 58 శాతం పడిపోయాయి. 2.2 బిలియన్ డాలర్ల నుండి 884.6 మిలియన్ డాలర్లకు పడిపోయాయి. వీటన్నింటిని బట్టి మనకు అర్థమయ్యేదేమంటే అమెరికా ట్రంప్ సుంకాల వల్ల మన దేశం ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడింది. ఆర్థికంగా నష్టం జరిగింది.మన దేశం అమెరికాకు సుమారు 86 బిలియన్ డాలర్ల విలువగల సరుకులు ఎగుమతి చేస్తున్నది. ఈ సంవత్సరం 50 బిలియన్ డాలర్లకు తగ్గే అవకాశం ఉందని అంచనా వేయబడింది. ఈ ఐదునెలల్లో 4.36 లక్షల కోట్ల విలువ గల సరుకులు ఎగుమతి ఆగిపోయి దేశంపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. దేశంలో తయారీ, సేవల రంగాలు వాటి కార్యకలాపాలు తీవ్రంగా మందగిస్తున్నాయి. దాదాపు మూడు లక్షల ఉద్యోగాలు ప్రమాదంలో పడ్డాయి. ఇదేవిధంగా సుంకాలు కొనసాగితే టెక్స్‌టైల్, గార్మెంట్స్ రంగాలలో దాదాపు లక్ష ఉద్యోగాలు ప్రమాదంలో పడతాయి. రత్నాలు ఆభరణాలు, సుమారు 80 నుంచి 90 వేల మంది ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. సూరత్ ముంబై వాణిజ్య కేంద్రాలలో డిమాండ్, ప్రొడక్షన్స్ తగ్గాయి. తోలు పరిశ్రమలో 20 నుండి 30 వేల ఉద్యోగాలు, ప్రాసెస్ చేసిన ఆహారం, రొయ్యలు వంటి రంగాల్లో 20 వేలు, రసాయనాలు, ఔషధాలు, ఆటో విడిభాగాల వంటి వాటిలో 40 నుంచి 50 వేల ఉద్యోగాలకు ప్రమాదం ఏర్పడింది. చిన్న, మధ్యతరహా పరిశ్రమలలో పదివేల ఉద్యోగాలు పోతాయి. ఈ సుంకాల ప్రభావం వల్ల గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లోని ప్రధానమైన నగరాలలో వీటి ప్రభావం ఉంటుంది. ఇంత నష్టం జరుగుతున్నా మోడీ ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉంది. సుంకాల విధింపులకు కొద్ది నెలల ముందు ఫిబ్రవరిలో మోడీ అమెరికా పర్యటనలో 'మిషన్ 500' అని ఒప్పందం చేసుకొని 2030 నాటికీ 500 బిలియన్ డాలర్లు ఎగుమతి లక్ష్యంగా ప్రకటించింది. ఇదంతా జరగాలంటే రష్యాతో ఆయిల్ కొనరాదని, చైనాతో వ్యాపార సంబంధాలు ఉండరాదని, ముఖ్యంగా బ్రిక్స్ దేశాలలో సఖ్యత వాణిజ్యం తగ్గించుకోవాలని, డాలర్‌కు పోటీగా స్థానిక కరెన్సీలో వాణిజ్యం చేయరాదని అమెరికా కోరుకుంటున్నది. ముఖ్యంగా రష్యా, ఉక్రెయిన్ యుద్ధంలో భారత్ పరోక్షంగా పాల్గొంటుందని, రష్యాతో ఆయిల్ కొనడం వల్లే రష్యా యుద్ధం చేస్తున్నదని ఆరోపించింది. మన దేశం వీటిని ఖండించినా ప్రతిఘటించడం లేదు. చైనాపై వేసిన సుంకాలకు అమెరికాకు ధీటుగా జవాబు చెప్పి ప్రత్యామ్నాయంగా వేరే దేశాల్లో తన సరుకులు ఎగుమతి చేసుకొని లాభపడుతున్నది. చివరికి వియత్నాం, థారులాండ్ లాంటివి కూడా లాభపడ్డాయి. భారత్ తీవ్రంగా నష్టపోయింది. మన వాణిజ్య సంబంధాలు అమెరికా కన్నా రష్యాతో ఉండడం వల్ల మనకు లాభం కలిగింది. ఈ కాలంలో రష్యాలో ఆయిల్ కొనడం వల్ల మన దేశం చాలా లాభపడింది. 2025 సంవత్సరంలో రోజుకు రెండు మిలియన్ బ్యారెల్స్ ఆయిల్ దిగుమతి చేసుకున్నాము. మొత్తం చమురులో 40 శాతం ఇది. ఒక బ్యారెల్ మీద 15 నుండి 20 డాలర్లు డిస్కౌంట్ లభిస్తున్నది. ఈ సంవత్సరం 3.8 బిలియన్ డాలర్లు అదా చేసుకున్నాం. మొత్తంగా 2022 నుండి ఇప్పటివరకు 10 బిలియన్ డాలర్లు ఆదా అయింది. అంటే మన రూపాయలలో రూ.88,732 కోట్లు. ఇది భారతదేశ స్కూల్ ఎడ్యుకేషన్ బడ్జెట్ కన్నా రూ.10 వేల కోట్లు ఎక్కువే. తెలంగాణ బడ్జెట్‌లో 40శాతం అని చెప్పవచ్చు. రష్యాలో చమురు కొనడం వల్ల మనకు కలిగిన లాభం ఇది. ఈ సొమ్ము కూడా దేశ ప్రజలకు ఉపయోగపడడం కన్నా దేశంలోని అంబానీ లాంటి బడా పెట్టుబడుదారులకు

# దేశభద్రత మాటలకే పరిమితమా!

ఢిల్లీ రెడ్ ఫోర్ట్ మెట్రో స్టేషన్ సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడు దేశ ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయిన ఈ ఘటన మరోసారి భారతదేశ భద్రతా వ్యవస్థల లోపాలను వెలుగులోకి తెచ్చింది. స్వాతంత్ర్యానంతర చరిత్రలో మతాధారిత విభజనల వలన, ఓటు బ్యాంకు రాజకీయాలు ప్రాబల్యం వల్ల ఉగ్రవాదం భారతదేశంలో పునరావృతం అవుతూనే ఉంది. దేశ సమైక్యత, సార్వభౌమాధికారం, భద్రత వంటి అంశాలు ఇప్పుడు పక్కకు పడిపోతున్నాయి. ఈ పరిస్థితి మారాలంటే ప్రజల్లో 'ఈ దేశం నాది' అనే భావన పునరుద్ధరించుకోవాలి. భారతదేశం చవిచూసినన్ని తీవ్రవాద దాడులను ప్రపంచంలో మరే దేశం ఎదుర్కోలేదంటే అతిశయోక్తి కాదేమో! స్వాతంత్రోద్యమ తర్వాతి చరిత్రను క్షుణ్ణంగా పరిశీలిస్తే.. దేశాన్ని మతం ఆధారంగా విభజన చేయాలని విభజన శక్తులు 1946లో 'డైరెక్ట్ యాక్షన్' పిలుపుతో సృష్టించిన నరమేధం ఈ దేశంలో సంభవించిన మొదటి మత ఉగ్రవాద దాడిగా పరిగణించాలి. అసలు భారత దేశంలో తీవ్రవాద దాడులు ఎందుకు జరుగుతున్నాయి? దేశంలోని ఓటు బ్యాంకు రాజకీయాలు, కులవాద రాజకీయాలు, కుల రిజర్వేషన్లు, ఉచిత హామీల పథకాలు, దోపిడీ తత్వం ప్రథమ ప్రాధాన్యతలో చేరిపోయాయి. దేశసమైక్యత, సమగ్రత, దేశ సార్వభౌమాధికారం, శాంతి భద్ర తలు అప్రధాన విషయాలుగా మారిపోయాయి. తీవ్ర వాద కార్యకలాపాలలో పాల్గొన్న వారిని కఠినంగా శిక్షిస్తే వారికి సంబంధించిన అనుయాయులు ఎక్కడ బాధపడతారో అనే మానసిక దౌర్బల్యం బీజేపేతర ప్రతిపక్ష నాయకులను పట్టి పీడిస్తోంది. జమ్మూ కశ్మీర్‌లో, కశ్మీర్ వేర్పాటువాద నాయకులు, పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు కలిసి ఆ లోయలో సృష్టించిన మారణ హోమం భారతదేశ చరిత్రలో చీకటి అధ్యాయం! ఆ లోయలో ఏర్పడిన భయంకరమైన పరిస్థితులను తట్టుకోలేక మూడు లక్షల మంది కశ్మీరీ హిందువులు అక్కడి నుంచి పారిపోయి వచ్చి కాందిశీ కులుగా బతుకుతున్నారు.

ప్రజాస్వామ్య దేశంలో మెజారిటీ సమాజానికి చెందిన ప్రజలు కాందిశీకులుగా బతకడం ఒక వైచిత్రి. ఇలాంటి పరిస్థితి ప్రపంచంలో ఏ దేశంలో కూడా సంభవించదు! మేధావులమని చెప్పుకునే వారికి పాలస్తీనా ముస్లింల కష్టాలు కనబడతాయి కానీ కశ్మీరీ కాందిశీకుల కడగండ్లు కనిపించవు.దేశంలో అనేక చోట్ల భారీ ఉగ్రదాడికి పాల్పడాలని ప్రయత్నించిన ఎనిమిది మందిని నిఘా వర్గాలు అరెస్టు చేయడం, వారి నుండి 2009 కేజీల పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకోవడం దేశ ప్రజలను భయకంపితులను చేసింది. అరెస్టయిన ఎనిమిది మందిలో నలుగురు డాక్టర్లు ఉండడం, ఆ నలుగురు డాక్టర్లలో ఒక మహిళ ఉండడం బట్టి చూస్తే, దేశం ఎంత ప్రమాదకర పరిస్థితుల్లో ఉందో అర్థమవుతుంది. ఈ దేశంలో తీవ్రవాద కార్యకలాపాలకు ఈ దేశంలోని రాజకీయ నాయకులు, కొన్ని జాతి వ్యతిరేక సంస్థల ప్రతినిధులు ప్రత్యక్ష, పరోక్ష సహకారం ఎలా అందిస్తున్నారో కొన్ని సంఘటనలు పరిశీలిస్తే అర్థమవుతుంది. ఢిల్లీ బాట్లా ఎన్కౌంటర్‌లో హతమైన ఉగ్రవాదికి కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ సంఘీభావం తెలపడం, పార్లమెంటుపై దాడి కేసులో నిందితులైన దోషులకు శిక్షను ఆపించడానికి భారత సుప్రీంకోర్టును అర్థరాత్రి తెరవడం, ముంబై వరుస బాంబు పేలుళ్ల నిందితు లను కాపాడడానికి రిటైర్ అయిన ఒరిస్సా రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి మురళీధరన్‌ని అడ్వకేట్‌గా నియమించి, దోషులను విడిపించడం, తాజ్ హోటల్ దాడి జరుగుతున్న సమయంలో స్పెషల్ కమాండోలను సరైన సమయంలో దించకుండా కేంద్ర హోం శాఖ ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడడం ఇందుకు కొన్ని తార్కాణాలు. తీవ్రవాద కార్యకలాపాల వల్ల దేశానికి ఎలాంటి నష్టం జరుగుతుందో దేశ ప్రజలకు వివరించడంలో జాతీయ వాదులమని చెప్పుకునే వారిలో ఒక నిర్దిష్టమైన ప్రణాళిక, వ్యూహం లేదని ఒప్పుకోవాలి. ప్రతీ తీవ్రవాద సంఘటనకు పాకిస్తాన్ కారణమని చెప్పడం వీరికి పరిపాటి అయింది. ఇందుకు వాస్తవమైన కారణాలను వెదికి దేశ ప్రజలకు వివరించాలి. దేశ ప్రజలను తమ వైపుకు తిప్పుకునే ప్రయ త్నాలు చేయాలి. ఇక చివరగా దేశ భద్రతకు, దేశ సమగ్రతకు, శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా ఎవరు ప్రవర్తించినా కఠిన చర్యలు తీసుకునే పాలన వ్యవస్థ, అందుకు సహకరించే న్యాయవ్యవస్థ ఈ దేశంలో ఏర్పడనంత వరకు ఢిల్లీ పేలుళ్ల లాంటి సంఘటనలు ఈ దేశంలో జరుగుతూనే ఉంటాయి. ఇలాంటి వ్యవస్థలు ఏర్పడాలంటే ఈ దేశ ప్రజలలో 'ఈ దేశం నాది' అనే భావన నిర్మాణం కావలసిన అవసరం ఎంతైన ఉంది!

# మెదడుకు వ్యాయామం గ్రంథ పఠనం

పుస్తకం విజ్ఞాన భాండాగారం. పుస్తకం హస్తభూషనమే కాదు మస్తిష్క వికాస సాధనం. సరస్వతి కొలువైన దేవాలయం గ్రంథాలయమే. విజ్ఞాన సమపార్జనకు మూల సూత్రం పుస్తక పఠనం. జ్ఞాన వితరణ మాద్యమం గ్రంథం. పుస్తకాన్ని నమ్మిన వాడు మహాజ్ఞాని అవుతాడు. పుస్తకాన్ని, గ్రంథాలయాన్ని వ్యతిరేకించిన వాడు అపర అజ్ఞాని. ఒక పుస్తకం వేల మెదళ్లను వెలిగించే జ్ఞానదీపం. గ్రంథాలయ దర్శనంతో మనో విస్తృతి విస్తరిస్తుంది. గ్రంథాలయ ప్రాధాన్యాన్ని గుర్తించిన అయ్యంకి వెంకట రమణయ్య (1890–1979) ప్రేరణతో 1968 నుంచి ప్రతి ఏట 14–20 నవంబర్ తేదీల్లో దేశవ్యాప్తంగా "జాతీయ గ్రంధాలయ వారోత్సవాల"ను నిర్వహించుట ఆనవాయితీగా మారింది. భారత్ గ్రంధాలయ పితామహుడు ఎస్ ఆర్ రంగనాథన్ పేరు కూడా ప్రస్తావించడం సముచితంగా ఉంటుంది. స్వతంత్ర భారత తొలి ప్రధాని చాచా నెహ్రూ జన్మదినం 14 నవంబర్ రోజున ప్రారంభమై 20 నవంబర్ వరకు "జాతీయ గ్రంధాలయ వారోత్సవాల"ను నిర్వహిస్తున్నారు. భారత దేశవ్యాప్తంగా ప్రముఖ గ్రంధాలయాల జాబితాలో కలకత్తా జాతీయ లైబ్రరీ, ఢిల్లీ పబ్లిక్ లైబ్రరీ, సరస్వతీ మహల్, చెన్నై అన్నా సెంటిమరీ లైబ్రరీ, గోవా కృష్ణదాస్ షమా కేంద్రీయ లైబ్రరీ, అలహాబాదు పబ్లిక్ లైబ్రరీ, తిరువనంతపురం స్టేట్ సెంట్రల్ లైబ్రరీ, హైదరాబాదు స్టేట్ సెంట్రల్ లైబ్రరీ లాంటివి చోటు దక్కించుకున్నాయి. డిజిటల్ అంతర్జాల వలలో విశ్వమే కుగ్రామం అయ్యింది. అరచేతిలో స్మార్ట్ వైకుంఠం తిష్ట వేసింది. గూగులమ్మ ఒడిలో పుస్తకాలు దాక్కుంటున్నాయి. బుక్ కల్చర్ మాయమై లుక్ కల్చర్ ప్రత్యక్షం అవుతున్నది. గ్రంథాలయాలు అనాథలు అయిపోతున్నాయి. పుస్తకాలు నిరాదరణతో చిన్నబోతున్నాయి. చందమామ కథలు, బాలమిత్ర చతురతలు అంతరించాయి. బామ్మ ఒడికి దూరమై గూగులమ్మ పంచన చేరుతున్నారు యువత. పిల్లలతో పాటు పెద్దలు సహితం పుస్తకపఠనాన్ని త్యాగం చేసి చరవాణి/ల్యాప్‌టాప్/ట్యాబ్‌లతో స్నేహం చేస్తున్న విచిత్ర ఏఐ యుగం నడుస్తున్నది.

విశ్వ మానవాళిని పుస్చక పఠనం వైపు ఆకర్షించడానికి, గ్రంథాలయాల ప్రాధాన్యాలను ఏకరువు పెట్టడానికి గ్రంథాలయ వారోత్సవాలను వైభవంగా నిర్వహించడం సముచితంగా ఉన్నది. ఈ వారోత్సవాల్లో భాగంగా పుస్తక పఠన ప్రయోజనాలు, రచయితలను గుర్తించడం, పుస్తక పఠనాన్ని నమ్మి ఉన్నత స్థితులకు ఎదిగిన మేధావులను సన్మానించుకోవడం, పుస్తక పఠనమే ప్రధాన అంశంగా విద్యాలయాల్లో పోటీలను నిర్వహించడం, పుస్తకాల విక్రయశాలల సందర్శన, పుస్తక ప్రదర్శనల నిర్వహణ, పుస్తకాలు కొని వ్యక్తిగత లైబ్రరీలను నెలకొల్పడం, పిల్లలచేత నీతి కథల పుస్తకాలను చదివించడం, పఠనాసక్తి కలిగిన యువతకు ప్రోత్సాహకాలు బహిష్కరించడం లాంటి పలు కార్యక్రమాలను ఈ వారోత్సవాల్లో నిర్వహించవచ్చు. ఒకసారి పుస్తక పఠన సాగర ఈతను ప్రారంభిస్తే, విషయ పరిజ్ఞాన తీరాలకు చేరుతూ విజేతలుగా నిలవడానికి ప్రయత్నించాలి. పాఠ్యాంశాలతో పాటు జనరల్ నాలెడ్జ్ పెంచగల ఇతర పుస్తకాలు, మ్యాగజీన్సు, పత్రికలు నిత్యం చదవడం అలవాటు చేసుకోవాలి. పుస్తకాన్ని చదివిన వారిని జ్ఞాన సరస్వతి దీవిస్తూ, ఉజ్వల భవిష్యత్తు, సమాజ గుర్తింపులను అందజేస్తుంది. పుస్క పఠన అభిరుచితో ఓపిక, జ్ఞాన సంపన్నత, ఏకాగ్రత, విద్యావంతులుగా ఎదగడం, మేధో వికాసం ఫలించడం సహజంగానే జరుగుతుంది. పుస్తక పఠనం మెదడుకు వ్యాయామంగా పని చేసి చురుకుగా మార్చుతుంది. పుస్తక ఫలవంతమైన ఓ ఉత్సవంగా వర్ధిల్లుతుంది. పఠనం భారం కాదు, పరమానంద భరితం. పుస్తకాలను ప్రేమించిన వారిని ప్రపంచం అక్కున చేర్చుకుంటుంది. పుస్తక పఠనాన్ని బాల్యం నుంచే అలవాటు చేయాలని తల్లితండ్రులు, ఉపాధ్యాయులు గుర్తించాలి. కత్తిని పదును చేయడానికి ఆకురాయి కావాలి. మెదడు చురుకుదనం పెంచడానికి పుస్తక పఠనం తోడవ్వాలి. పుస్తక పఠనంతో విషయ పరిజ్ఞానం, పారిభాషిక పదకోశం, ఆత్మవిశ్వాసం, లోకజ్ఞానం, సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్య వికాసం, జనరల్ నాలెడ్జ్, ఆకర్షణీయ వేతనం, సమాజంలో ఉన్నత స్థానం, కుటుంబ సంక్షేమం/అభివృద్ధి, పేరు ప్రఖ్యాతులు పెరుగుతాయి. నేటి ఆధునిక యువత గ్రంధాలయ సందర్శనం చేస్తూ, గ్రంథ పఠన ప్రపంచంలో మునిగి, జ్ఞాన సాగరం ఈది, ఎవరెస్టు శిఖరమంత ఎదిగి, రేపటి విజ్ఞాన వివేకవంతుల సమాజ స్థాపనకు బాటలు వేసి భవిష్యత్తుకు బాధ్యత కలిగిన విజ్ఞానవంతులను దేశానికి అందజేద్దాం, పుస్తకాన్ని నిత్య నేస్తంగా అక్కున చేర్చుకుందాం.

# బాల లందరికీ విద్య ఉత్త మాటేనా?
# చిన్నారుల భవిష్యత్తు అంధకారమేనా!

నిరక్షరాస్యత నిర్మూలనే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా- దేశంలో బాలలందరికీ విద్య గగన కుసుమమే అవుతోంది. సార్వత్రిక విద్యా వ్యాప్తికి ప్రభు త్వాలు పలు పథకాలు చేపట్టినా ఇంకా అధిక శాతం పిల్లలు విద్యాగంధం లేక బాలకార్మికులు గానే ఉండి పోతున్నారు. బాలల శ్రేయస్సుకు కృషి జరుగుతున్నా ఆచరణలో ఫలితాలు కానరావడం లేదు. పాఠశాల సౌకర్యాలు లేక కొందరు, అవి ఉన్నా వివిధ కారణాల రీత్యా బడికి వెళ్లలేక మరికొందరు బాలలు తమ ఉజ్వల భవిష్య త్తును అంధకారమయం చేసుకుంటున్నారు.ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాలతో ముడివడి సంక్షేమ పథకాలకు నోచుకోక, చదువు చెప్పించే స్థోమత లేక ఎందరో పేద తల్లిదండ్రులు గత్యంతరం లేని స్థితిలో చిన్నారులపై భారాన్ని మోపుతున్నారు. హోటళ్లు, కిరాణా దుకాణాలు, ఫ్యాక్టరీలు, మిల్లులు, క్వారీలు, గనులకు తమ పిల్లలను పనికి పంపుతున్నారు. వ్యవసాయ పను లకు కొందరు బాలలు వెళుతున్నారు. చివరికి కొందరు పిల్లలను భిక్షాటన వృత్తిలోకి బలవంతంగా నెడుతున్నారు. వివిధ రంగాలలో బాలకార్మికులు అవస్థలు పడుతూ అనుక్షణం శ్రమిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో పెద్దలు చేయాల్సిన పనులను సైతం వీరే చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు నీళ్లు వదిలి బాలల చేత వెట్టిచాకిరీ చేయించు కుంటున్నా, వారికి విముక్తి కలిగించాలన్న ధ్యాస సంబంధిత అధికారుల్లో లేకపోవడం బాధాకరం.యజమానులు చెప్పిందే చట్టంగా, వారు చేసేదే సంక్షేమంగా పరిస్థితులున్నా కార్మికశాఖ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. అప్పుడప్పుడు తూతూ మంత్రంగా దాడులు చేస్తున్నా దోషులకు ఎలాంటి శిక్షలు పడడం లేదు. 14 సంవత్సరాల లోపు పిల్లలందరికీ – ఉచిత నిర్బంధ విద్యను అమలు చేయాలని భారత రాజ్యాంగం లోని 24వ నిబంధన స్పష్టం చేస్తున్నా అది కాగితాలకే పరిమితమవడం శోచనీయం. పేదరికం కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో పసి పిల్లల బంగారు కలలు చెదిరి పోతున్నాయి. పాలబుగ్గల లేత వయసులో




వారు కార్మికులుగా మారడం బాధాకరం. కార్మిక చట్టాలకు విరుద్ధంగా పిల్లల చేత పని చేయించు కునే యాజమాన్యాలు తగిన వేతనాలు ఇవ్వడం లేదు. పిల్లలు పనిచేసే చోట తగిన రీతిలో భద్రతా సౌకర్యాలను కల్పించక పోవడం ఆక్షేపణీయం.ప్రాథమిక హక్కులను పేర్కొన్న రాజాంగంలోని 3వ ప్రకరణంలోని 15(8)వ అంశం బాలల కోసం ప్రత్యేక శాసనాలు చేసే అధికారం ప్రభుత్వానికి కలుగజేస్తున్నది. 28వ అధికరణం ప్రకారం బాలలను వ్యాపార వస్తువుగా మార్చడం, నిర్బంధ సేవలను చేయించు కోవడం అపరా ధంగానే పరిగణించాలి. 14 సంవత్సరాల లోపు పిల్లలను కర్మాగారాలలో, గనులలో, ఇతర ప్రమాదకరమైన పనులలో నియమించడాన్ని 24వ ఆర్టికల్ నిషేధిం చింది. 39(ఇ) ప్రకారం బాలలను వారి వయసుకు తగని, శక్తికి మించిన పనులలో నియమించ రాదు. పేదరికాన్ని సాకుగా చేసుకుని బాలలను పనుల్లో నియ మించడం నిషేధించాలని రాజ్యాంగం ఆదేశిం చింది. కఠిన చట్టాలు ఎన్ని ఉన్నా చాలామంది పిల్లలు బాల కార్మికులు గానే మిగిలి పోతున్నారు. రాజ్యాంగంలో పేర్కొన్న నిర్బంధ ప్రాథమిక విద్య ఈనాటికీ ఫలించని కలగానే మిగిలి పోతున్నది. ప్రపంచ బాలకార్మి కుల్లో మూడవ వంతు మంది మన దేశంలోనే ఉన్నారని ఒక అంచనా. దీంతో బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నాయి. 5 నుండి 15 సంవత్సరాల లోపు వయసు గల పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించేందుకు పలు కార్యక్రమాలను చేపట్టారు. పాఠశాలలో నమోదు కాని, మధ్యలో మాని వేసిన, అర్హతగల పిల్లల సమగ్ర వివరాలను సేకరించి వారిని తిరిగి తరగతులకు పంపేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, ఆచరణాత్మక చర్యలను చేపట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చదువుల పండగ పేరుతో 2002 ఆగస్టు 1 నుండి 10వరకూ, 2003 సంవ త్సరం నవంబర్ 24 నుండి 29వరకూ బడి బయట ఉన్న పిల్లలనందరినీ పాఠశాలలలో చేర్పించే బృహత్ కార్యక్రమాన్ని అమలు చేశారు. ఆ తర్వాత ఏటా ఆ కార్యక్ర మాన్ని అమలు చేస్తునే ఉన్నారు. అయినా ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదన్నది వాస్తవం. అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు చెబుతున్నా బాల కార్మికులు వివిధ పనుల్లో కొనసాగుతూనే ఉన్నారు. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించ డానికి, నిర్బంధ ప్రాథ మిక విద్య అమలుకు మరింతగా చర్యలు చేపట్టవలసి ఉంది. ముందుగా వారి తల్లిదండ్రులకు చదువు పట్ల అవ గాహన కలిగించాలి. బాలకార్మికులకు వసతి సైతం కల్పించేలా ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటు చేయాలి. నిరుపేద కుటుంబాల్లో ఆర్థిక సమస్యలను తొలగించేలా వారికి సంక్షేమ పథకాలను అమలు చేయాలి. పిల్లల సంపాద నపై ఆధార పడకుండా తల్లిదండ్రులకు సాధికారత కల్పించాలి.

# నవభారత నిర్మాత పండిత నెహ్రూ

హిందూ స్త్రీల దాస్య విముక్తికి, సమానత్వ సాధనకు కృషిచేసి సంఘ సంస్కరణ కర్తగా, స్వతంత్ర భారతావని సాంప్రదాయాలు, విధానాల రూపశిల్పిగా, నవభారత నిర్మాతగా, పేరెన్నిక గన్నారు చాచా నెహ్రూ. వివాహం కనీస వయస్సును, 12 నుండి 15 కి పెంచడం, సతులు... పతుల నుండి విడాకులు తీసుకుని ఆస్తి వారసత్వ హక్కు పొందడం, వరకట్న పద్ధతిని చట్టవిరుద్ధం చేయడం, దేశ తొలి ప్రభుత్వాధినేతగా, సమాజ సంస్కరణలలో సఫలీకృతులయ్యారు, జవహర్ లాల్. న్యాయవాదిగా పరిపూర్ణ రాజకీయవేత్తగా, రచయితగా, దేశ స్వాతంత్ర్యానంతరం తొలి ప్రధానిగా, భారత రాజకీయాలను అత్యంత ప్రభావితం చేసిన నెహ్రూ – గాంధీ కుటుంబ అ మూలపురుషుడిగా సుపరిచితుడు అయిన నెహ్రూ, నేటి ఉత్తర ప్రదేశ్ లోని అలహాబాద్ నగరంలో కాశ్మీరీ బ్రాహ్మణ వంశంలో, ధనిక కుటుంబంలో, ప్రముఖ న్యాయవాది మోతిలాల్ నెహ్రూ, స్వరూప రాణిల తొలి సంతానంగా నవంబర్ 14, 1989లో జన్మించారు. సోదరీమణులైన కృష్ణ విజయలక్ష్మి పండిట్ లతో పాటు, "ఆనంద భవన్" లో ఆంగ్ల సాంప్రదాయ శిష్ట పద్ధతులలో పెరిగారు. బాల్యంలోనే హిందీ, సంస్కృతాలు, భారత సారస్వత గ్రంథాల పఠనా సక్తులు అయినారు. ఇండియన్ సివిల్ సర్వీసులో అర్హత పొందాలని తండ్రి కోరికను అనుసరించి, ఇంగ్లాండ్ నందలి హారో వెళ్ళాడు. పాఠశాల విద్య అక్కడ పూర్తిచేసి, 1907లో, కేంబ్రిడ్జ్ లో ప్రవేశ పరీక్ష రాసి, జీవశాస్త్ర అధ్యయనానికి కళాశాలకు వెళ్లి, 1910లో పట్టా పొందారు. అనంతరం న్యాయశాస్త్ర అ అధ్యయనానికి ఇన్నెర్ టెంపుల్ వెళ్ళి, 1912లో ఉత్తీర్ణుడై అక్కడే న్యాయవాద వృత్తి చేపట్టాడు. వెనువెంటనే భారతదేశానికి తిరిగి రావడం జరిగింది. 1919లో జలియన్వాలా బాగ్ దుర్ఘటనకు ప్రభావితుడై,



కాంగ్రెస్ ఆధ్వర్యంలో, దేశ స్వాతంత్ర్య సంగ్రామానికి ఆకర్షితుడై, సంగ్రామంలో తన శక్తులు లోడ్డుటకు ఉద్యుక్తుడయ్యాడు.

# కోదండాపూర్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ





అలంపూర్ నవంబర్ 13 (వుదయం ప్రతినిధి): జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గంలో వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం రోజు కోదండాపూర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు, స్టేషన్ ఆవరణ రికార్డులు సిబ్బంది క్రమశిక్షణ యూనిఫార్మ్ టర్న్ ఔట్ తదితర అంశాలను పరిశీలించారు ఈ స్టేషన్ పరిధిలో ఉన్న ఎన్ హెచ్ -44 రోడ్డు లో ప్రమాదాలు నివారించేందుకు బ్లాక్ స్పాట్స్ గుర్తించి రాత్రి సమయంలో రోడ్డు పక్కన వాహనాలు నిలిపి నిద్రించే డ్రైవర్లకు ముందస్తు హెచ్చరికలు ఇవ్వాలని సూచించారు. రోడ్ సేఫ్టీ కోసం ఏర్పాటు చేసిన విలేజ్ రోడ్ సేఫ్టీ కమిటీలు చురుకుగా పనిచేయాలని ఆదేశించారు. ఫిర్యాదు దారులతో మర్యాదగా ప్రవర్తించి, ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు జరపాలని సైబర్ నేరాల నివారణకు కమ్యూనిటీ పోలిసింగ్ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సీసీ కెమెరాల ప్రాధాన్యతపై ప్రజల్లో అవగాహన కల్పించాలని పేర్కొన్నారు విధరగా స్టేషన్ నిర్వహణ రికార్డుల మెయింటెనెన్స్‌పై సంతృప్తి వ్యక్తం చేసిన ఎస్పీ పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పిలుపునిచ్చారు ఈ తనిఖీలో అదనపు ఎస్పీ కె.శంకర్, డీఎస్పీ మొగిలయ్య, సీఐ రవిబాబు పాల్గొన్నారు

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పనిచేస్తున్న నోడల్ ఆఫీసర్లకు సమీక్ష సమావేశం

-జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ సంధ్యా కిరణ్మయి.



గద్వాల నవంబర్ 13 (వుదయం ప్రతినిధి): జోగులాంబ గద్వాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డిపిహెచ్ఎన్ఓ వరలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం రోజు ఉదయం 11 గంటలకు వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పనిచేస్తున్న నోడల్ ఆఫీసర్లకు సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు ఇట్టి సమావేశంలో డిఎంహెచ్ఓ డాక్టర్ జె సంధ్యా కిరణ్మయి మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో నోడల్ పర్సన్స్ చాలా కీలకమైనటువంటి అంశామని.. అన్ని హెల్త్ ప్రోగ్రాంల యందు టార్గెట్లను పూర్తి చేసి జిల్లాను ముందుకు తీసుకుపోయే విధంగా పనిచేయాలని సందర్భంగా తెలిపారు.. ముఖ్యంగా ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సాధారణ డెలివరీలు పందకు మించి జరగాలని సమావేశంలో తెలిపారు అనంతరం ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ ప్రసన్న రాణి, డాక్టర్ రిజ్వానా తన్వీర్ హెల్త్ ప్రోగ్రాంలపై మాట్లాడడం జరిగింది ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు డివిఎల్ఎం నరేంద్రబాబు హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు

# రెండవ రోజు జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు

♦ విజేతలకు బహుమతులు అందజేత..



మధిర,నవంబర్ 15, (వుదయం ప్రతినిధి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అండర్ 17 వాలీబాల్ బాల బాలికల పోటీలు గురువారం మధిర టీ వీయం పాఠశాలలో నిర్వహించారు. జిల్లాలో మొత్తం 22 మండలాలకు సంబంధించిన క్రీడాకారులు,480 హాజరవ్వగా,వ్యాయామ ఉపాధ్యాయులు 90 మంది హాజరయ్యారు .గెలుపొందిన విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు విజేతలకు అందించారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ క్రీడల్లో 1000 మంది క్రీడాకారులు, 200 మంది అధికారులు పాల్గొన్నారు. బాలికల మొదటి బహుమతి ఖమ్మం రూరల్ మండలం గెలుపొందిగా రెండవ బహుమతి కల్లూరు మండలం విజేతగా నిలిచింది. మూడో బహుమతి ఖమ్మం సౌత్ గెలుపొందారు. కార్యక్రమంలో కమిషనర్ సంపత్ కుమార్, తాసిల్దారు రాంబాబు, ఎస్ జి ఎఫ్ జిల్లా జాయింట్ సెక్రెటరీ యాస రామారావు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ వై. చిన్ని,ఆదర్శ్ కుమార్, వీర రాఘవయ్య, సిఐ, రమేష్, ఎంఈఓ ప్రభాకర్, సత్తిబాబు, జిల్లా ఎక్సైజ్ అధికారి నాగేందర్ రెడ్డి, ఎక్సైజ్ సీఐ, రామ్మూర్తి, ప్రధానోపాధ్యాయులు సిహెచ్ శ్రీహరి, జి.శ్యాంబాబు, పవన్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు షేక్ రంజాన్, ఫిజికల్ డైరెక్టర్స్ మారాబత్తుల జమలయ్య, శ్రీనివాస్ రెడ్డి, చైతన్య, వేణుగోపాల్, మాధవరావు, నరసింహారావు, సునీల్, అపర్ణ, జి. సత్యనారాయణరెడ్డి, ఎం. నాగేశ్వరరావు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తున్న బిస్లరీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

- పాశమైలారం పారిశ్రామిక క్లస్టర్ (సిఐటియు) కన్వీనర్ అతిమేల మాణిక్
- తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి
- కండ్లకు నల్ల రిబ్బను కట్టుకొని వినూత్న నిరసన



సంగారెడ్డి జిల్లా,పటాన్ చెరు ,నవంబర్ 13 (వుదయం ప్రతినిధి): కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తున్న బిస్లరీ వాటర్ పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని పాశమైలారం పారిశ్రామిక క్లస్టర్ (సిఐటియు) కన్వీనర్ అతిమేల మాణిక్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని పాశమైలారం పారిశ్రామిక వాడ లో గల బిస్లరీ వాటర్ పరిశ్రమ ముందు కార్మికులు కళ్లకు గంతలు కట్టుకొని వినూత్నంగా నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా అతిమేల మాణిక్ మాట్లాడుతూ కార్మికులు యూనియన్ పెట్టుకుంటే తొలగించడం చట్టానికి వ్యతిరేకమన్నారు. తొలగించిన కార్మికులను వెంటనే విధులకు తీసుకోవాలని శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న కార్మికులను సైతం యాజమాన్యం భయభ్రాంతులకు గురిచేస్తుందని ఆరోపించారు. కోట్ల రూపాయలు లాభాలు గడిస్తున్న యాజమాన్యం కు కార్మికులు యూనియన్ పెట్టుకుంటే ఏం ఇబ్బంది ఉందని ఆయన ప్రశ్నించారు. కార్మికుల శ్రమతో యాజమాన్యం కోట్లు గడిస్తు, కార్మికుల భద్రత సంక్షేమం గాలికి వదిలేయడం దారుణమన్నారు. కార్మికులు హక్కులు రక్షణ కోసం కార్మికులు ఏకం కావడంలో తప్పేముందని ప్రశ్నించారు. ఇప్పటికైనా యజమాన్యం దిగివచ్చి తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవడంతోపాటు సమస్యల పరిష్కారానికి ముందుకు రావాలని లేని పక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా యజమాన్యాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిస్లరీ ఎంప్లాయిస్ యూనియన్ జనరల్ సెక్రెటరీ శేఖర్ రెడ్డి,గౌరవ అధ్యక్షులు నాగరాజు, కోశాధికారి నవీన్, సిఐటియు నాయకులు రాజు,వెంకటేష్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# రాయపట్నం లో మంటలతో చిల్లర కొట్టు దగ్ధం

మధిర,నవంబర్13(వుదయం ప్రతినిధి): మధిర మండల పరిధిలోని రాయపట్నం గ్రామంలో ప్రభుత్వ పాఠశాల దగ్గర్లో ఉన్న చిల్లర కొట్టు మంటల్లో దగ్ధమైంది. రాయపట్నానికి చెందిన సాధులూరి ఇశ్రాయేలు అనే వ్యక్తి ఆరోగ్యం సరిగా లేనందున చిల్లర కొట్టు పెట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. ఈ తరుణంలో గత రాత్రి బడ్డీ కొట్టు బంద్ చేసి ఇంటికెళ్లిన సమయంలో కొట్టు లో మంటలు చెలరేగి పూర్తిగా కాలిపోయినట్లు బాధితుడు తెలియజేస్తున్నారు.జీవనోపాధి కోసం చిల్లర వ్యాపారం నిర్వహిస్తుండగా ఇలా మంటలు వడ్డీ కొట్టి తగలబడటంతో చేసేదేమీ లేక ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.తనకు జరిగిన నష్టానికి ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని



ఎంతోకొంత అందించాలనిప్రాధేయపడుతున్నాడు బాధితులు ఇశ్రాయేలు.ఈ అగ్ని ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

# విద్యార్థులు మహనీయులను ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్లాలి

♦ స్ఫూర్తి కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన.

♦ మండల విద్యాశాఖ అధికారిని శ్రీదేవి.



ఖానాపురం, నవంబర్ 13 (వుదయం ప్రతినిధి): చదువుకునే విద్యార్థినీ విద్యార్థులు ప్రతి ఒక్కరూ రాష్ట్రం కోసం దేశం కోసం పాటుపడె మహనీయులను ఆదర్శంగా తీసుకొని వారి అడుగుజాడలో ముందుకు వెళ్లాలని మండల విద్యాశాఖ అధికారిని డి శ్రీదేవి విద్యార్థులకు తెలిపారు. మండలంలోని బుధరావుపేట హైస్కూల్లోని స్ఫూర్తి కార్యక్రమంపై విద్యార్థులకు మండల విద్యాశాఖ అధికారిని అవగాహన కల్పిస్తూ, విద్యార్థులు అబ్దుల్ కలాంను, మహాత్మాగాంధీని ఆదర్శంగా తీసుకుని చదువులో ముందుండాలని విద్యార్థులకు ఎంఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సయ్యద్ ఆరిష్ హుస్సేన్, ఉపాధ్యాయులు భద్రయ్య, సారంగపాణి, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, సిఆర్పిలు భాస్కర్, సునీత, మదర్ హుస్సేన్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ



మరికల్ నవంబర్ 13 ( వుదయం ప్రతినిధి): మరికల్ మండల కేంద్ర పరిధిలోని ఏలిగండ్ల గ్రామంలో బుధవారం ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ నిర్వహించారు ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ జిల్లా నాయకులు సూర్య మోహన్ రెడ్డి హాజరయ్యారు ఆయన ఈ సమావేశంలో మాట్లాడుతూ ఇండ్లు వచ్చినవారు కచ్చితంగా ఇండ్లు నిర్మించుకోవాలని రానివాళ్లు మళ్లీ రెండో విడుదల వస్తావని ఆయన అన్నారు ఎవరు నిరాశ పడే అవసరం లేదని కచ్చితంగా ఇల్లు లేని వారికి ప్లాటు ఉన్నవారికి కచ్చితంగా ఇందిరమ్మ ఇల్లు వస్తుందని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు హనుమంతు గ్రామ కమిటీ అధ్యక్షులు నబీ సాబ్ చిన్న బాలు సాకలి చిన్న రాయుడు నరసింహులు సురేందర్ గౌడ్ మాజికల్ పట్టిన కాంగ్రెస్ అధ్యక్షుడు హరీష్ కుమార్ రామకృష్ణారెడ్డి టైసన్ రఘు జింగిడి రవి రమేష్ శ్రీను ఎవరన్నా హనుమంతు ఫయాజ్ తో పాటు కాంగ్రెస్ కార్యకర్తలు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# అంతక్రియలో పాల్గొని పాడే మోసిన కాంగ్రెస్ నాయకులు ఈర్ల రాంబాబు



భూపాలపల్లి, నవంబర్ 13 (వుదయం ప్రతినిధి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా గోరుకొత్తపల్లి మండల కేంద్రంలో టిఆర్ఎస్ యూత్ మండల నాయకులు బొమ్మ కంటి అరవింద్ తండ్రి బొమ్మ కంటి రవి గుండెపోటుతో మరణించారనే విషయం తెలుసుకొని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఈర్ల రాంబాబు వారి యొక్క కుటుంబాన్ని పరామర్శించి అతని ఆత్మకు శాంతి చేకూరాలనీ కోరుకుంటూ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మరియు అతని అంతక్రియలో పాల్గొని పాడెను మోశారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఈర్ల రాంబాబు కాంగ్రెస్ పార్టీ టౌన్ ఉపాధ్యక్షులు శ్యామ్ మండల్ నాయకులు యాకు బాబు పవన్ కళ్యాణ్ రాజు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# పేటలో ఘనంగా అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకలు



నారాయణపేట టౌన్ నవంబర్ 12(వుదయం ప్రతినిధి): అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం పురస్కరించుకొని వయోవృద్ధుల వారోత్సవాలలో భాగంగా తేది13 న బిసి కాలనీ నారాయణపేట నందు అంగన్వాడి సెంటర్లో వయోవృద్ధుల తో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.తల్లిదండ్రుల, వయోవృద్ధుల చట్టం,ఓల్డ్ ఏజ్ హోమ్ గురించి అవగాహన కల్పించారు. అదేవిధంగా ఆటపాటలు ఆడించడం గెలిచిన వారికి తేదీ 19న బహుమతులు అందిస్తున్నట్లు ఎఫ్ఆర్ఓ సాయి తెలిపారు. ఈ కార్యక్రమంలో నష్టముక్తభారత్ వాలంటీర్ లక్ష్మీకాంత్, అంగన్వాడి టీచర్ అరుణ జ్యోతి వయోవృద్ధులు పాల్గొన్నారు.

# మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలి



గద్వాల నవంబర్ 13 (వుదయం ప్రతినిధి): జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల నియోజకవర్గం మత్స్యకారులు చేపలను విక్రయించి ఆర్థికంగా ఎదగాలని కేటిదొడ్డి బీజేపీ మండలాధ్యక్షుడు శ్రీపాదరెడ్డి అన్నారు. గురువారం గువ్వలదిన్నె గ్రామంలో ఎర్రదొడ్డి చెరువులో మత్స్యశాఖ ఆధ్వర్యంలో 30 వేల చేప పిల్లలను వదలడం జరిగినది. ఈ సందర్భంగా జి. శ్రీపాదరెడ్డి మాట్లాడుతూ చేప పిల్లలను వదలడం ద్వారా మత్స్యకారులకు జీవనోపాధి కలుతోందని, దీంతో వారు ఆర్థికంగా ఎదిగే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జంగిలప్ప, తెలుగు జిందప్ప, తెలుగు వీరేష్, తదితరులు పాల్గొన్నారు.

# నెట్టెంపాడులో మొసళ్ల కలకలం

♦ భయాందోళనలో కాలనీవాసులు



గద్వాల నవంబర్ 13 (వుదయం ప్రతినిధి): ధరూర్ మండలం నెట్టెంపాడు గ్రామంలో మొసళ్ల కలకలం రేపింది. నిత్యం రోడ్లపైకి రావడంతో అటుగా వెళ్ళే ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఎస్సీ కాలనీ అంచున ఉన్న కుంటలో గత సంవత్సర క్రితం ఒక మొసలి చొరబడగా ఇప్పుడు దానితోపాటు మరో రెండు మొసళ్లు తీవ్రంగా సంచరిస్తూ ఒడ్డుకు వస్తుండడంతో అటుగా వెళ్ళే ప్రజలు, కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా మహిళలు, పురుషులు బహిర్భూమికి వెళ్ళే దారిలో మొసళ్లు సంచరిస్తుండడంతో తీవ్ర కలకలం రేపింది. సోమవారం రోజున 6 అడుగులకు పైగా ఉన్న మొసలి చేపను పట్టిన దృశ్యాలు అందరినీ తీవ్ర భయాందోళనకు గురి చేసింది. వెంటనే అటవీ శాఖ అధికారులు స్పందించాలని కాలనీ కోరుతున్నారు. వాసులు

# క్రీడాభివృద్దే ప్రభుత్వ లక్ష్యం

♦ రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి



మక్తల్ నవంబర్ 12(వుదయం ప్రతినిధి): రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంతో తోడ్పాటు అందిస్తున్నారని, గ్రామీణ క్రీడాకారులకు అవసరమైన సౌకర్యాలు కల్పించి వారిని రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చాటేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని రాష్ట్ర పశుసంవర్ధక, డైరీ డెవలప్మెంట్, మత్స్య, యువజన క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. మక్తల్ నియోజక వర్గంలోని ఊట్కూరు మండల కేంద్రంలో నిర్మించ తలపెట్టిన మినీ స్టేడియం కోసం గురువారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తో కలిసి స్థానిక పోలీసు క్వాటర్స్ దగ్గర ఉన్న మూడెకరాల స్థలాన్ని మంత్రి పరిశీలించారు. అక్కడే ఇంకా ఏదైనా అదనంగా స్థలం ఉంటే చూడాలని అధికారులకు ఆయన సూచించారు. ఈ ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కాగా అక్కడి స్థలం అన్యాక్రాంతం అవుతోందని బీజేపీ, బీజేవైఎం,ఏబీవీపీ కార్యకర్తలు మంత్రి దృష్టికి తీసుకురాగా అన్యాక్రాంతం కాకుండా అధికారులకు ఆదేశాలు జారీ చేస్తానని ఈ సందర్భంగా మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ రామచంద్రనాయక్, తహాసిల్దార్ చింత రవి, ఎంపీడీవో కిషోర్ కుమార్, సర్వేయర్ జయ శంకర్, ఎంపీ ఓ శ్రీనివాసరావు, పిఆర్ ఏ. ఈ. అజయ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మహాకవి కాలోజీకి ఘనమైన నివాళులర్పించిన కమల్ రాజు



మధిర,నవంబర్13 (వుదయం ప్రతినిధి): మహాకవి కాలోజి నారాయణరావు వర్ధంతి సందర్భంగా మధిర బిఆర్ఎస్ పార్టీ ఆఫీసులో మాజీ జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ మరియు మధిర నియోజకవర్గం ఇంచార్జ్ లింగాల కమల్ రాజు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో కాలోజి గారి పాత్ర ఎంతో ఉందని అందుకే కాలేజీ గారి జయంతి సందర్భంగా రాష్ట్ర భాషా దినోత్సవం గా ప్రకటించి కాళోజిని గౌరవించుకున్నాం తెలంగాణ రాష్ట్రం కోసం తెలంగాణ ప్రజల కోసం ఆయన కవితలు స్ఫూర్తిని పొందినయని ఆయన కొనియాడారు.ఈ కార్యక్రమంలో మధిర మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, పట్టణ కార్యదర్శి అరిగే శ్రీనివాసరావు, మండల కార్యదర్శి బొగ్గుల భాస్కర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ వైవిఅప్పారావు ముత్తవరపు ప్యారి ఎస్టీ ఇక్బాల్ ఆళ్ల నాగబాబు మాజీ సర్పంచ్ బొగ్గుల వీరారెడ్డి బోనకల్ మండల నాయకులు గంగవరపు రామకృష్ణ కపిలవాయి జగన్, వేల్పుల శివ రమేషు,చీదిరాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడాప్రాంగణంలో ప్రథమ చికిత్స కేంద్రం

♦ విద్యార్థినిలకు ఆరోగ్య సూత్రాల బోధన



నవంబర్,13,(వుదయం ప్రతినిధి): గురువారం ఉదయం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి రామారావు ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ అధికారిణి (జిల్లా అడిషనల్ కలెక్టర్ )డాక్టర్ శ్రీజ సూచనల మేరకు జిల్లా స్థాయి ఆటల పోటీలు జరిగే మధిర టీవీఎం స్కూల్ నందు పీహెచ్ సీ వైద్యులు డాక్టర్ పృథ్వీరాజ్ నాయక్ ఆధ్వర్యంలో పారా మెడికల్ సిబ్బంది ద్వారా ప్రథమ చికిత్స కేంద్రం ఏర్పాటు చేసి విద్యార్థులకు చిరువ్యాదులకు చికిత్స చేసి ఆరోగ్య సూత్రాలు బోధిస్తున్నారు.స్థానిక బాలికల ఉన్నత పాఠశాల బాలికలకు పలు ఆరోగ్య రక్షణ కార్యక్రమాలపై సంపూర్ణముగా అవగాహన పరచినారు. ఈ కార్యక్రమంలో మండల విద్య శాఖ అధికారి వై ప్రభాకర్,మధిర 1పల్లె దవఖాన వైద్యురాలు డాక్టర్ హేమలత, క్రీడల కన్వీనర్ పి డి చిన్ని విజయ్ రాజు, పి ఇ టి లు పి డి లు పాల్గొన్నారు. గర్ల్స్ హైస్కూల్ కార్యక్రమంలో హెచ్ ఎమ్ హైమావతి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వి వెంకటేశ్వర్లు హెచ్ఎస్ లు సుబ్బలక్ష్మి కొండయ్య, ఎఎన్ఎమ్ లు వై లక్ష్మి జె విజయ్ లక్ష్మి ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ధర్మపురి శ్రీలక్ష్మి నృసింహుని సేవలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్



ధర్మపురి నవంబర్ 13(వుదయం విలేకరి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ కుమార్ యాదవ్ గెలుపు కోసం జూబ్లీహిల్స్ నియోజక వర్గంలోని సోమాజిగూడ డివిజన్ బాధ్యతలను మంత్రి శ్రీధర్ బాబుతో కలసి చేపట్టినట్లు ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. గురువారం ముందుగా శ్రీలక్ష్మి నరసింహా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నేను నా నియోజకవర్గ ప్రజలకు ప్రత్యక్షంగా అందుబాటులో ఉండలేదన్నారు. నా ప్రజా జీవితంలో,నా నియోజ కవర్గాన్ని 12 రోజుల పాటు వదిలి ఉండడం ఇదే మొదటిసారి. నా మనసంతా నా ప్రజల దగ్గరే ఉందనీ తన మనసులో మాటను ఆయన వెలిబుచ్చారు. జూబ్లీహి ల్స్ ఎన్నికలు పూర్తికాగానే నా నియోజకవర్గ ప్రజలను కలవడం నాకు ఎంతో ఆనందంగా ఉంది, అని మంత్రి భావోద్వేగంతో వెల్ల డించారు.ధర్మపురి దేవాలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామ ని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో మా బహుజన బీసీ బిడ్డ నవీన్ యాదవ్ విజయం ఖాయ మని విశ్వాసం వ్యక్తం చేశారు. పోలింగ్‌కు రెండు రోజుల ముందే బీఆర్ఎస్ పార్టీ చేతులు ఎత్తేసిం ది,అని ఎద్దేవా చేశారు.రేవంత్ రెడ్డి నాయకత్వంలో జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ జెండా ఎగురబోతోంద న్నారు. గత పది ఏళ్ల దొరల పాలనలో ప్రజలు ఎన్నో కష్టాలు, నష్టాలు అనుభవించారు. మార్పు కోరుకున్న ప్రజలు ఇందిరమ్మ రాజ్యాన్ని మళ్లీ చూడాలని ఆశిస్తూ కాంగ్రెస్ పార్టీని విశ్వసిం చారు,అని చెప్పారు.మా నాయ కుడు,రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి చెప్పినట్టుగా 2034 వరకు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వమే కొనసాగు తుందనీ,ఇది శ్రీ లక్ష్మీన రసింహ స్వామి ఆశీర్వాదం,అని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.గత ప్రభుత్వంలో చేసిన భారీ అప్పుల వల్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కఠినంగా ఉన్నా, ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ఏ విధంగానైనా అమలు చేస్తామని పునరుద్ఘాటిం చారు.పేదల సంక్షేమం,బహుజ నుల అభ్యున్నతే మా ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు.ప్రస్తుతం జిల్లాలో కొనసాగుతున్న గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు,విద్యుత్ సదుపాయాల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించడం జరిగిందని తెలిపారు.త్వరలోనే ధర్మపురి డిగ్రీ కాలేజీకి శాశ్వత భవనం నిర్మాణం ప్రారంభమవు తుంది,అని తెలిపారు.దళిత, బీసీ, ఎస్టీ విద్యార్థుల కోసం ప్రత్యేక నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ఏర్పాటు చేయడం మా ప్రాధాన్యత లో భాగమని మంత్రి వెల్లడించారు.ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు,ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

# రిజర్వేషన్లపై ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమం ఉధృతమే

- బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ దాసరి ఉష
- ధర్మ పోరాట దీక్షకు మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ సంఘీభావం



పెద్దపల్లి,నవంబర్ 13:(వుదయం ప్రతినిధి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని,ప్రభుత్వం వెంటనే ఈ రిజర్వేషన్లను ఆమోదించాలని బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ దాసరి ఉష డిమాండ్ చేశారు.తెలంగాణ రాష్ట్ర బీసీ జేఏసీ పిలుపుమేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ప్రకటించాలనే ముఖ్య డిమాండ్‌తో గురువారం జిల్లా కేంద్రంలోని బస్టాండ్ కూడలి వద్ద బీసీ జేఏసీ నాయకులు ధర్మ పోరాట దీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ధర్మ పోరాట దీక్ష శిబిరాన్ని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ సందర్శించి సంఘీభావం తెలిపారు.కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ దాసరి ఉష మాట్లాడుతూ 42 శాతం బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే,ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ పోరాటం కోసం గ్రామ స్థాయి వరకు అన్ని కమిటీలు వేసుకుని ముందుకు వెళ్తామని తెలిపారు.ఈ ఉద్యమం తెలంగాణ పోరాటం,స్వాతంత్ర్య పోరాటం తరహాలో ఉంటుందని,ప్రతి ఇంటి నుంచి ఒక నాయకుడు తయారయ్యే విధంగా ఉద్యమిస్తామని స్పష్టం చేశారు.ఈ ధర్మ పోరాట దీక్షను విజయవంతం చేయడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు.ఈ ధర్మ పోరాట దీక్షలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లవెల్లి శంకర్,జిల్లా వైస్ చైర్మన్ కొండ సతీష్,జిల్లా మహిళా కన్వీనర్ సిరవేన స్వప్న,జిల్లా కన్వీనర్ సలేంద్ర కొమరయ్య యాదవ్, మీడియా ఇన్చార్జిగా అబ్దుల్ మాలిక్,బీసీ నాయకులు శిలారపు పర్వతాలు యాదవ్, ఆకుల వివేక్ పటేల్, ఏ.రాజేందర్,కే.నవీన్ యాదవ్,డి.రామస్వామి తోపాటు తదితర బీసీ నాయకులు పాల్గొన్నారు.

# రెవెన్యూ శాఖ అధికారుల తీరుపై జిల్లా కలెక్టర్ అసంతృప్తి



జయశంకర్ భూపాలపల్లి నవంబర్ 13(వుదయం ప్రతినిధి): రెవెన్యూ శాఖ అధికారుల తీరుపై జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అసంతృప్తి వ్యక్తం చేశారు భూ భారతి, రెవెన్యూ సదస్సులు, సాదా బైనామా దరఖాస్తులు పరిష్కారంలో ప్రగతి రాకుంటే చార్జెస్ ఫ్రేమ్ చేస్తామని జిల్లా కలెక్టర్ తహసీల్దార్లను హెచ్చరించారు గురువారం ఐడిఓసి కార్యాలయంలో భూ భారతి, రెవెన్యూ సదస్సులు, సాదా బైనామా దరఖాస్తులు పరిష్కారంపై అన్ని మండలాల తహసిల్దార్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం వరకు రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు పరిష్కరించి పోర్టల్ లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు.లక్ష్యాన్ని పూర్తి చేయని తహసిల్దారులకు చార్జెస్ ఫ్రేమ్ చేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు.రెవెన్యూ సదస్సులు నిర్వహించి ఆరు నెలలు గడిచినా దరఖాస్తుల పరిష్కారంలో ఆశించిన స్థాయిలో ప్రగతి కనబడకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు.దరఖాస్తుల పరిష్కారంలో అలసత్వం వహించిన అధికారులపై చర్యలు తప్పవని, అవసరమైతే చార్జీలు ఫ్రేమ్ చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను శనివారం నాటికి రేయింబవళ్లు పనిచేసి పూర్తి చేయాలని సూచించారు.ప్రజల సమస్యల పరిష్కారం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.దరఖాస్తులు పరిష్కారంపై ప్రభుత్వం చాలా ఫోకస్ చేస్తున్నదని, ప్రతి వారం సిసిఎల్ఏ సమీక్ష నిర్వహిస్తున్నారని జాప్యం చేయొద్దని ఆయన స్పష్టం చేశారు.

ప్రతి సమావేశంలో పూర్తి చేస్తామని చెపుతున్నారు కానీ ఇంకా పెండింగ్ ఉన్నాయని కారణాలు చెప్పొద్దని అన్నారు.దరఖాస్తు తిరస్కరించిన సందర్భంగా కారణాలను పోర్టల్ లో అప్ లోడ్ చేయాలని స్పష్టం చేశారు.ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఆర్డీఓ రవి, అన్ని మండలాల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# పత్తి కొనుగోళ్ల ప్రక్రియపై కలెక్టర్ ఆగ్రహం

- పత్తి కొనుగోలు కేంద్రాల్లో అన్ని జాగ్రత్త చర్యలు
- రైతులను ఇబ్బందులు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం
- జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



నాగర్ కర్నూల్ నవంబర్ 13(వుదయం ప్రతినిధి): జిల్లాలో పత్తి కొనుగోళ్లలో జాప్యం జరుగుతున్నదన్న అంశంపై జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నాగర్ కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలం చిన్న ముద్దునూరు గ్రామం వినాయక కాటన్ మిల్ వద్ద సిసిఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆయన గురువారం పరిశీలించారు. సీసీఐ కేంద్రాన్ని సందర్శించి పత్తి కొనుగోలు ప్రక్రియ, ట్యాబ్ ఎంట్రీ, గేట్ ఎంట్రీ పాస్, పంట నమోదు ప్రక్రియను స్లాట్ బుకింగ్ తదితర అంశాలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సమస్యలను సానకూలంగా స్పందించేలా రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి సాధ్యమైనంత త్వరగా సమస్య పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. చలిమంచు దృష్టా తేమశాతంలో కొంతమేర వెసులుబాటు ఇవ్వాలని, ఆకాల వర్షాల కారణంగా కొంత పత్తి పంట దెబ్బతిన్నందున గిట్టుబాటు ధ కల్పించాలని, సెంటర్లో కొనుగోళ్ల సమయం పెంచాలని, తెచ్చుకున్న పంటను ఆదేరోజు కొనుగోలు చేయాలని రైతులు కలెక్టర్ను కోరారు. దీని కలెక్టర్ సానుకూలంగా స్పందించి సీసీఐ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈరోజు స్లాట్ బుకింగ్ జరిగిందో అదే రోజు కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పత్తి కొనుగోలను పారదర్శకంగా నిర్వహించాలని అవసరమైతే అదనంగా సిబ్బందిని లాప్టాప్ లను వినియోగించి సాయంత్రం 6 గంటల్లోగా కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత సీసీఐ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, %ొ%.. పత్తి రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ అధైర్యపడాల్సిన అవసరం లేదు. జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో రైతులకు అండగా ఉంటుంది, అని అన్నారు. పత్తి కొనుగోళ్లలో ఎవరైనా రైతులను ఇబ్బంది పెట్టినా, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పత్తి కొనుగోలు ప్రక్రియలో జాప్యం ఎందుకు జరుగుతోందో అధికారులు వివరించగా, వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సిసిఐ అధికారులు మరియు మార్కెట్ కమిటీ సిబ్బందికి సమయానికి కొనుగోళు జరగాలన్నది జిల్లా యంత్రాంగం ప్రధాన లక్ష్యం అని స్పష్టం చేశారు. రైతులు తమ పత్తిని కచ్చితంగా సిసిఐ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర (ఎం ఎస్ పి) పొందాలని సూచించారు. 2025-26 సంవత్సరానికి గాను కేంద్ర ప్రభుత్వం పత్తి పంటకు కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ. 8,110/-గా నిర్ణయించిందని కలెక్టర్ తెలిపారు. పత్తిలో తేమ శాతం 8 నుండి 12% మధ్య ఉండాలి. ప్రతి 1% తేమ పెరిగినప్పుడు, ధర కూడా 1% తగ్గుతుందని ఆయన వివరించారు. 12% కంటే ఎక్కువ తేమ శాతం ఉన్న పత్తిని సిసిఐ వారు కొనుగోలు చేయరని రైతులు గుర్తుంచుకోవాలని సూచించారు. అందుకే రైతులు తమ పత్తిని ఇంటి దగ్గరే బాగా ఆరబెట్టి, సరైన తేమ శాతం కలిగిన పత్తిని విక్రయించాలని సూచించారు. రైతుల సౌకర్యార్థం ఈసారి "కపాస్ కిసాన్ యాప్" ద్వారా స్లాట్ బుకింగ్ విధానం అమలు చేస్తున్నారని తెలిపారు. రైతులు ముందుగానే యాప్‌లో జిన్నింగ్ మిల్లును ఎంపిక చేసుకుని, తగిన తేదీకి స్లాట్ బుక్ చేసుకోవాలి. బుకింగ్ చేసిన తేదీకి సరైన తేమ శాతం కలిగిన పత్తిని తీసుకువచ్చి విక్రయిస్తే, ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రతి క్వింటాలుకు రూ. 8,110/- కనీస మద్దతు ధర పొందవచ్చని తెలిపారు. స్లాట్ బుకింగ్ విధానం వల్ల రైతులు జిన్నింగ్ మిల్లుల వద్ద రోజుల తరబడి వేచి ఉండాల్సిన అవసరం లేకుండా సులభంగా పత్తిని విక్రయించగలరని ఆయన అన్నారు. జిల్లా కలెక్టర్ వెంట తెలకపల్లి తహసిల్దార్ జాకీర్ అలీ, సీసీఐ అధికారి దీపక్, పవన్, తదితరులు ఉన్నారు.

## వానాకాలం ధాన్యం కొనుగోలు సజావుగా సాగేందుకు చర్యలు



జయశంకర్ భూపాలపల్లి నవంబర్ 13(వుదయం ప్రతినిధి): వానాకాలం వరి ధాన్యం కొనుగోలు సజావుగా సాగేందుకు చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ ఆదేశించారు గురువారం ఐడిఓసి కార్యాలయంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ అధ్యక్షతన అన్ని రైస్ మిల్లర్లతో సమావేశం జరిగింది.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వానాకాలం ధాన్యం కొనుగోలు కార్యక్రమం సజావుగా సాగేందుకు మిల్లర్లు తక్షణమే బ్యాంకు హామీలు సమర్పించాలని సూచించారు. ధాన్యం రవాణా, ఎండబెట్టడం, తూకం ప్రక్రియల్లో ఎటువంటి ఆటంకం రాకుండా మిల్ పాయింట్ల వద్ద తగిన కార్మికులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ధాన్యాన్ని మిల్లర్లు సమయానికి అన్‌లోడింగ్ చేసి కొనుగోలు కార్యకలాపాలు వేగవంతం చేయాలని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పనిచేసి రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. సమావేశంలో సివిల్ సప్లైస్ అధికారి కిరణ్ కుమార్, డిఎం రాములు, జిల్లా మిల్లర్స్ తదితరులు పాల్గొన్నారు.

## 15వ తేదీన జగిత్యాల జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ సెలక్షన్స్...



జగిత్యాల నవంబర్ 13 (వుదయం ప్రతినిధి) జగిత్యాల జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేది శనివారం ఉదయం 10 గంటల నుండి జిల్లా క్లబ్ లో టేబుల్ టెన్నిస్ సెలక్షన్స్ నిర్వహించడం జరుగుతుందని జగిత్యాల జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ పోడేటి శ్రీకాంత్ తెలిపారు ఇట్టి సెలక్షన్స్ లో అండర్ 11 అండర్ 13 అండర్ 15 అండర్ 17 అండర్ 19 బాయ్స్ అండ్ గర్ల్స్ మేన్ అండ్ ఉమెన్ విభాగాలలో టేబుల్ టెన్నిస్ పోటీలను నిర్వహించడం జరుగుతుందని జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ సెలక్షన్స్ లో ఎక్కువ సంఖ్యలో క్రీడాకారులు పాల్గొని వారి ప్రతిభను నిరూపించుకోవాల్సిందిగా కోరారు జిల్లా స్థాయిలో సెలెక్ట్ అయిన క్రీడాకారులను ఈ నెల 28,29, 30 తేదీలలో హైదరాబాదులో మొయినాబాద్ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయటం జరుగుతుందని తెలిపారు పోటీలో పాల్గొనే క్రీడాకారులు పూర్తి వివరాలకై ఈ నెంబర్ 7674949259 లో సంప్రదించగలరని కోరారు.

## ఊర్కొండ మండలంలో ఇంద్రమ్మ ఇండ్ల పరిశీలన ఎంపీడీఓ

ఊర్కొండ న్యూస్ 13(వుదయం ప్రతినిధి): నాగర్ కర్నూల్ జిల్లా ఊరుకొండ మండలం ఈరోజు ఇందిరమ్మ ఇండ్ల ప్రగతి పరిశీలన నిమిత్తం గుండ్లగుంటపల్లి, నర్సంపల్లి గ్రామాలను సందర్శించడం జరిగింది. మంజూరు అయిన ప్రతి లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పరిశీలించగా, గుండ్లగుంటపల్లి గ్రామంలో మొత్తం 8 ఇండ్లు మంజూరు కాగా ఈరోజు వరకు 1. బేస్మెంట్ పూర్తి అయినవి 2 ఇండ్లు, 2. గోడలపని నడుస్తున్నవి 2 ఇండ్లు, ,3. స్లాబ్ వేయబడినవి 1 ఇల్లు , 4. పిల్లర్స్ పూర్తి అయినవి 2 ఇండ్లు , 5. సాంకేతిక కారణాల చేత ఇంకా ప్రారంభించని వారు ఒకరు. ఈ గుండ్లగుంటపల్లి గ్రామానికి వివిధ దశల్లో పూర్తి అయిన ఇండ్లకు మొత్తం రూ.7.00 లక్షలు విడుదల కాబడినవి. అలాగే పైలట్ ప్రాజెక్ట్ గ్రామమైన నర్సంపల్లిలో మొత్తం 21 ఇండ్లకు గాను 1. బిలో బేస్మెంట్ లెవెల్ 1 ఇల్లు ,2. బేస్మెంట్ పూర్తి అయినవి 4 ఇండ్లు , 3. గోడలపని పూర్తి అయినవి 2 ఇండ్లు , 4. స్లాబ్ పూర్తి అయినవి 4 ఇండ్లు , 5. ఆర్థిక పరమైన కారణాలతో ప్రారంభించనివి 3 ఇండ్లు , 6. ఇళ్ళు కట్టుకోవాడానికి ఇష్టం లేనివారు 7 మంది నర్సంపల్లి గ్రామానికి ఈరోజు వరకు మొత్తం రూ.14.20 లక్షలు విడుదల కాబడినవి. వివిధ దశల్లో



ప్రగతిలో ఉన్న లబ్ధిదారులు త్వరగా పనులు పూర్తి చేసుకొనుటకు సూచనలు చేయడం జరిగింది.

ఈ సందర్శనలో శ్రీ లక్ష్మణ్ నాయక్, ఎంపీఓ, కుమారి సాయిరూప, శ్రీమతి నస్రీన్, పంచాయతీ కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామస్థాయి సిబ్బంది పాల్గొనడం జరిగింది.

# ఈనెల 15న వడ్డెమాన్ లో శనీశ్వర స్వామి వ్రతాలు..



నాగర్ కర్నూల్ నవంబర్ 13(వుదయం ప్రతినిధి): శ్రీ విశ్వవాసు సంవత్సరం కార్తీక మాసం చివరి శనివారము పురస్కరించుకుని భక్తుల మేషరాశి నుండి మీన రాశి వరకు శని గ్రహ బాధల నుండి జన్మరిత్యా ,గోచార రీత్యా శనీశ్వర స్వామిని శాంతింపజేయుటకు ఈ నెల 15న వడ్డేమాన్ లోని నందీశ్వర శనేశ్వర దేవాలయంలో సామూహిక శనేశ్వర వ్రతాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ వెల్దండ గోపాలరావు, ఆలయ ప్రధాన అర్చకులు డాక్టర్ గవ్వమటం విశ్వనాథ శాస్త్రి లు గురువారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. బిజినపల్లి మండల పరిధిలోని నంది వడ్డేమాన్ గ్రామంలో గల శ్రీ సార్థసప్త జేష్ట మాత సమేత శనేశ్వర స్వామి కొలువై ఉన్నందున ఆలయంలో పురుషులు మరియు మహిళా భక్తులు కూడా పాల్గొని శనేశ్వర స్వామి వ్రతాలు చేయవచ్చునని ఆయన తెలిపారు.శనివారం రోజు ఉదయం 9 గంటలకు వ్రతాలు ప్రారంభమవుతాన్ని భక్తులు తమ వెంట రెండు టెంకాయలు పూలు మరియు పండ్లు పూజకు తెచ్చుకోవాలని అన్నారు. వ్రతం చేయుటకు రుసుము 257 రూపాయల 50పైసలు చెల్లించాలన్నారు. వ్రతంలో దంపతులు లేదా ఒక్కరు కూడా పాల్గొనవచ్చునని ఆయన తెలిపారు. రుసుము చెల్లించిన వారికి వ్రత పూజా సామాగ్రి ఇవ్వనన్నట్టు తెలిపారు. వ్రత అనంతరం భక్తులకు ఆలయ ఆవరణలో కార్తీక వన భోజనం వసతి ఏర్పాటు ఉందని అన్నారు. శని గ్రహదోష నివారణ చేసుకొనుటకు కార్తీకమాసంలో శనీశ్వర వ్రతంలో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని కోరారు. మరిన్ని వివరాలకు 94402 31325, 8186821212 లలో సంప్రదించాలని వారు కోరారు.

# నేడు నారాయణపేట జిల్లాలో సమాచార కమిషనర్ల పర్యటన

- జిల్లా కలెక్టర్ శిక్త పట్నాయక్



నారాయణపేట టౌన్ నవంబర్ 12(వుదయం ప్రతినిధి): నారాయణ పేట జిల్లాకు ఈ నెల 14న (శుక్రవారం) జిల్లాకు ముగ్గురు రాష్ట్ర సమాచార కమిషనర్లు విచ్చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఒక్క ప్రకటనలో తెలిపారు.గత కొన్ని సంవత్సరాలుగా సమాచార కమిషనర్ కార్యాలయంలో కమిషనర్ల పోస్టులు ఖాళీ ఉండటంతో సమాచార హక్కు చట్టం - 2005 ద్వారా దరఖాస్తులు చేసుకున్న అప్పీళ్లు అనేకం పెండింగ్ లో ఉండిపోయాయి.రాష్ట్ర ప్రభుత్వం వచ్చాక సమాచార కమిషనర్లను నియమించడంతో పెండింగ్ లో ఉన్న అప్పీళ్లను పరిష్కరించేందుకు మార్గం సుగమం అయింది. ఇందులో భాగంగానే స్టేట్ చీఫ్ సమాచార కమిషనర్ డాక్టర్ జి. చంద్రశేఖర్ రెడ్డి, సమాచార కమిషనర్ - 1 పి.వీ. శ్రీనివాసరావు, సమాచార కమిషనర్ - 2 మొసినా పర్వీన్ ఈ నెల 14 న నారాయణ పేట జిల్లాలో పర్యటించి సమాచార హక్కు చట్టం 2005 ద్వారా పెండింగ్ లో ఉన్న అప్పీళ్లను పరిష్కరించనున్నారు.

సమాచార కమిషనర్లు నారాయణపేట జిల్లాకు చేరుకొని ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లాలోని పౌర సమాచార అధికారులు, అప్పీలేట్ అధికారులకు సమాచార హక్కు చట్టం పై అవగాహన కల్పిస్తారు. అనంతరం పెండింగ్ అప్పీళ్లపై సమీక్ష నిర్వహిస్తారు. నారాయణ పేట జిల్లాకు సంబంధించిన పెండింగ్ అప్పీళ్లను పరిశీలించి పరిష్కరిస్తారని తెలియజేశారు.జిల్లాలోని ప్రజలు సమాచార హక్కు చట్టం కు సంబంధించిన తమ ఫిర్యాదులు ఉంటే కమిషనర్ల ముందు హాజరై తమ ఫిర్యాదులు పరిష్కరించుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.

## భక్తి మార్గంలో నడవాలి: శ్రీ సంత్ నిస్తే ద్రవే సింగ్ మహారాజ్



ఖానాపూర్, నవంబర్ 13(వుదయం విలేఖరి): ఖానాపూర్ నియోజకవర్గం, ఉట్నూరు మండలం,అందరూ భక్తి మార్గంలో నడవాలని సంత్ నిస్తే ద్రావే సింగ్ మహారాజ్ అన్నారు.గురువారం రోజున ఆంధోలి గ్రామంలో సంత్ నిస్తే ద్రావే సింగ్ మా రాజు పర్యటించి గ్రామస్తులకు సనాతన ధర్మం గురించి వివరణ ఇచ్చి భక్తి మార్గంతో నడవాలని కోరారు.సనాతన ధర్మంలో అత్యంత శ్రేష్ఠమైన మార్గాలలో ఇది ఒకటని, భగవంతునిపై ప్రేమ, విశ్వాసం కలిగి ఉండాలని, ఆత్మనివేదనతో కూడిన ఆధ్యాత్మిక జీవన విధానం సనాతన ధర్మం అని అన్నారు.హిందూ సనాతన పరంపర భక్తిని మానవ జీవితంలోని పరమ లక్ష్యమైన మోక్షానికి దారి తీసే మార్గంగా భావిస్తుందాని తెలిపారు. భగవంతుని ఏ రూపంలోనైనా ఆరాధించడం భక్తి మార్గంలో భాగమని బోధించారు.భక్తి మార్గంతో ప్రతి ఒక్కరు నడుచుకోవాలని సూచించారు.అనంతరం పులిమడుగు మాజీ ఉపసర్పంచ్ బాలాజీ గ్రామస్తులతో కలిసి మహారాజును ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఇందిరా మహిళా డెయిరీ ని ఆదర్శంగా తీర్చిదిద్దాలి...

## రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక, ప్రణాళిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు



**ఖమ్మం వుదయం ప్రతినిధి ముదిగొండ, నవంబర్-13**

ఇందిరా మహిళా డెయిరీ ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక, ప్రణాళిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు అన్నారు. గురువారం ముదిగొండ మండలం గంధసిరిలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమిషనర్ సునీల్ దత్ లతో కలిసి ఇందిరా మహిళా డెయిరీ, విద్యా శాఖ, వైద్య శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ ఇందిరమ్మ మహిళా డెయిరీ లో మొదటి విడతగా గేదెల సేకరణ చేసినట్లు, రెండో విడత క్రింద ఓసి ల నుండి 125 మంది లబ్ధిదారుల ఎంపిక చేసి గేదెల సేకరణ చేపట్టాలన్నారు. లబ్ధిదారుల ఎంపిక అర్హులైన వారిని, పాడి పోషణ పట్ల ఆసక్తి ఉన్న వారిని చేయాలన్నారు. పశుగ్రాసం కోసం పటిష్ట కార్యాచరణ చేయాలన్నారు. క్లస్టర్ల వారిగా ఉన్న పశువులు, రాబోయే పశువులను దృష్టిలో పెట్టుకొని రోజుకు, నెలకు ఎంత పచ్చి గ్రాసం, ఎంత ఎండు గ్రాసం అవసరమో అంచనా వేసి, వాటి సరఫరాకు నిరుద్యోగ యువత నుండి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ఎండుగ్రాసం కు సంబంధించి ప్యాకేజి కవర్లపై ఇందిరా మహిళా డెయిరీ లోగో ముద్రించాలన్నారు. ప్రతి గేదెకు షెడ్డు ఉండేలా, షెడ్డుపై సోలార్ ప్యానల్ ఉండేలా కార్యాచరణ చేయాలన్నారు. కావాల్సిన షెడ్లను ఉపాధిహామీ క్రింద మంజూరుచేసి, పనులు వెంటనే ప్రారంభించి, పూర్తి చేయాలన్నారు. షెడ్లకు అంతటా ఒకే డిజైన్ ఉండేలా మోడల్ డిజైన్ చేపట్టాలన్నారు. పశు సంపద సంరక్షణకు పశు వైద్యశాలలను బలోపేతానికి, కావాల్సిన వైద్యులు, సిబ్బందికి ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. గేదెలను పశు వైద్యులు క్రమం తప్పకుండా పరీక్షలు చేయాలని, ప్రతి గేదెకు ఒక నెంబర్ కేటాయించి, వాటి హెల్త్ కార్డు తయారుచేయాలని అన్నారు. ఇప్పటికే గేదెలు అందించిన లబ్ధిదారులు పాలను విజయ డెయిరీ కి అందిస్తున్నారని, బ్యాంకు కిస్తీ పోనూ, మిగులు మొత్తము ఆదా చేయడానికి బ్యాంకర్లతో సంప్రదించి సేవింగ్స్ ఖాతాలు తెరవాలని అన్నారు. ఖర్చులు పోనూ మిగిలిన సొమ్మును దుబారా చేయకుండా ఆదా చేసుకొనెలా అవగాహన కల్పించాలని, ఈ దిశగా సమావేశాలు పెట్టి, ఆదా డబ్బును ప్రకటించి, ఎక్కువ మొత్తంలో ఆదా చేసిన 1, 2, 3 స్థానాల్లో ఉన్న వారికి బహుమతులు ఇచ్చి, ప్రోత్సహించాలని అన్నారు. మధిర నియోజకవర్గంలో పాఠశాలల సమగ్రాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని అన్నారు. మండలానికి 3 పాఠశాలలు ఎంపిక చేసి 800 మంది విద్యార్థులకు సరిపోను సకల వసతుల కల్పన చేసి, ప్రయివేటు పాఠశాలలకు మించి వసతుల కల్పన చేయాలని అన్నారు.

విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రవాణాకు కార్యాచరణ చేసి ఒక సెమీ రెసిడెన్షియల్ స్కూల్ లుగా తీర్చిదిద్దాలన్నారు. నిర్మాణం లో ఉన్న కళాశాల భవనాల నిర్మాణాలు నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సిరిపురం జూనియర్ కళాశాల, ఐటిఐ, మధిర కళాశాల నిర్మాణాల్లో వేగం పెంచాలన్నారు. బోనకల్ మండలం లక్ష్మీపురం లో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరానికి నిర్మాణాలు పూర్తిచేసి, అందుబాటులోకి తేవాలన్నారు. ఈ దిశగా వచ్చే మే మాసానికి లక్ష్యంగా పెట్టుకొని కార్యాచరణ చేయాలన్నారు. మధిర ఆసుపత్రి నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. పరికరాల కొనుగోలు ప్రక్రియ పూర్తిచేసి, ఆసుపత్రిలో పూర్తి స్థాయిలో ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలన్నారు. వైద్యుల భర్తీకి చర్యలు తీసుకోవాలని అన్నారు. చింతకాని నర్సింగ్ కళాశాల కు ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. వైరా ఆసుపత్రికి సెంబంధించి నిధులు మంజూరుకు చర్యలు చేపట్టనున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ, ఇందిరమ్మ మహిళా డెయిరీ సక్సెస్ గా నడవడానికి అన్ని చర్యలు చేపడతామన్నారు. పశుగ్రాసం సరిపోను పకడ్బందీగా కార్యాచరణ చేపట్టనున్నట్లు తెలిపారు. క్లస్టర్ల వారిగా పశుగ్రాసం సరఫరాకు నిరుద్యోగ యువతకు గుర్తించి, వారికి ఉపాధికల్పనకు చర్యలు చేపడతామన్నారు. పాఠశాలల సమగ్ర అభివృద్ధికి ఆదేశాల ప్రకారం చర్యలు తీడుకుంటామన్నారు. ఈ సమీక్ష లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, డిఆర్డీవో సన్యాసయ్య, డిఇఓ చైతన్య జైనీ, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, జిల్లా పశుసంవర్ధక అధికారి డా. శ్రీనివాసరావు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు, డిసిహెచ్ఎస్ డా. రాజశేఖర్, ఎస్సి కార్పొరేషన్ ఇడి నవీన్ బాబు, మధిర నియోజకవర్గ తహశీల్దార్లు, ఎంపీడీఓ లు, ఏపీఎం లు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## చదరంగం గొప్ప ఆలోచనా శక్తిని ఇస్తుంది ఎంఈవో మల్లేశం



**బెల్లంపల్లి, నవంబర్13 (వుదయం ప్రతినిధి)** తాండూర్ మండలం విద్యా భారతి హై స్కూల్ ప్రాంగణంలో గురువారం అండర్ 14/17 బాల బాలికల ఉమ్మడి జిల్లా స్థాయి చదరంగం పోటీలు నిర్వహించడం జరిగిందని పాఠశాల కరస్పాండెంట్, డైరెక్టర్ సురభి శరత్ కుమార్ తెలిపారు. మంచిర్యాల జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ ఎండి యాకూబ్ ఆధ్వర్యంలో నిర్వహించగా ముఖ్య అతిథులుగా మండల విద్యాధికారి మల్లేశం హాజరయ్యారు. సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. చదరంగం గొప్ప ఆలోచనా శక్తిని ఇస్తుందన్నారు. విద్యార్థుల్లో ఏకాగ్రత, పట్టుదల, జ్ఞాపకశక్తి పెరుగుతుందని చెప్పారు. మేధో సంపత్తికి చెందిన క్రీడ కావడంతో తన పిల్లలను సైతం చదరంగంలో ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. క్రీడాకారులు గెలుపోటములు సమానంగా తీసుకోవాలని, ఓడిపోతే కసి పెంచుకొని మళ్లీ గెలవడానికి ప్రయత్నించాలే గానీ, కుంగిపోవద్దని సూచించారు. ఈ పోటీల్లో 80 మంది విద్యార్థులు పాల్గొనగా20 మంది ఈ నెల 15,16,17 తేదీల్లో జగిత్యాల లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైయ్యారు.ఈ కార్యక్రమంలో పాఠశాల అకాడమిక డైరెక్టర్ సురభి సౌమ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సరోజిని, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, పిడి లు బాలకృష్ణ, రాజలింగం, తారకేశ్వరి ఆయా జిల్లాల పిడి లు తల్లిదండ్రులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు మానసిక స్థితి పై అవగాహన సదస్సు



**వరంగల్, నవంబర్ 13 (వుదయం జిల్లా ప్రతినిధి):** కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ వరంగల్ ఆదేశాల అనుసార ప్రకారము జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు వరంగల్ గారు నేడు జిల్లా పరిషత్ హై స్కూల్, నర్సంపేట నందు స్ఫూర్తి కార్యక్రమమునకు ముఖ్యఅతిథిగా విచ్చేసి స్ఫూర్తి కార్యక్రమం గురించి ఈ విధము గా మాట్లాడినారు. పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు భారతదేశానికి భావిపౌరులు, వారికి తెలువవలసిన కొన్ని మెళుకువలు అందులో ప్రధానంగా శారీరక, మానసిక స్థితి, శాస్త్రీయ దృక్పథం, ఆర్థిక సమస్యలపై అవగాహన ఆరోగ్యము పౌష్టికాహారము అలవర్చుకున్నట్లయితే మంచి పౌరులుగా తయారవుతారని తెలిపినారు. విద్యార్థులు స్వీయ అవగాహన, నైపుణ్యాలు, తోటి వారిపై సానుభూతి, సమస్యల పరిష్కార దిశగా నిర్ణయాలు తీసుకునే విధంగా ప్రవర్తించాలని తెలిపినారు. భావవ్యక్తీకరణ సరళంగా, సృజనాత్మకమైన ఆలోచనలు, తర్కబద్ధమైన ఆలోచనలు ఉండాలని తెలిపినారు. డాక్టర్ భరత్ సైక్రియాటిస్ట్ గారు మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు సమస్యలను సాధారణంగా పరిష్కరించుకోవాలికానీ,మానసిక ఒత్తిడికి గురికాకుండా, వారు ఎలాంటి ఉద్వేగం చెందకుండా, సూసైడ్ అటెంప్ట్ చేయకుండా, ప్రతి సమస్యను తెలుసుకొని పరిష్కారం మార్గాన్ని తేలుసుకోవాలని కోరినారు. విద్యార్థినీ విద్యార్థులు వారి పరీక్షల పైన ,వ్యక్తిగత సమస్యల పైన, సంక్షిప్తమైన ఆలోచనతో, ఆరోగ్యము పౌష్టిక ఆహారంపై అవగాహన కలిగి పాటించాలని సూచించినారు. సమయస్ఫూర్తితో, విశ్లేషించకుండా సంఘర్షణకు లోనవుతున్నారు. అట్టి విద్యార్థినీ విద్యార్థులు తల్లిదండ్రుల , ఉపాధ్యాయుల, తోటి స్నేహితుల సలహాలు తీసుకొని సంఘములో గౌరవంగా జీవించడానికి ప్రయత్నం చేయాలి. వైద్య ఆరోగ్యశాఖ నిరంతరం టెలిమానస్ అనే ప్రోగ్రామ్ ద్వారా విద్యార్థినీ విద్యార్థులకు మానసికంగా కౌన్సిలింగ్ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నది. ఎవరైనా సమస్యలు ఉన్నట్లయితే వెంటనే వారు 14416 నెంబర్ను సంప్రదించి తగిన సలహాలు తీసుకోవాలని కోరినారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మేడ పెల్లిలో సందర్శించి ఉద్యోగుల హాజరు పట్టిక మెడికల్ స్టోర్ ఐ ఎల్ ఆర్ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల రిజిస్టర్లు కార్యక్రమల పరిశీలించినారు. అందించే సేవల గురించి తగిన సూచనలు చేస్తూ రికార్డులను తనిఖీ చేసినారు. ఎవరైనా ఉద్యోగ ధర్మమును సక్రమంగా నిర్వహించకుంటే వారి పైన సీసీఏ రూల్స్ ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించినారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి సాంబశివ రావు, సైకియాట్రిస్ట్ డాక్టర్ బి భరత్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు,ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి డాక్టర్ జ్యోతి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సిసి నాగరాజ్ వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## పాఠశాలలను ఆకస్మితిక తనిఖీ.. డి ఈ ఓ రంగయ్య నాయుడు



**రాయపర్తి నవంబర్ 14(వుదయం ప్రతినిధి):** స్ఫూర్తి ప్రోగ్రాంలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జడ్పిహెచ్ఎస్ రాయపర్తి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, మైలారం పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ వరంగల్ జిల్లా విద్యాధికారి రంగయ్య నాయుడు గురువారం చేశారు. పాఠశాలల్లో ఆయన 10వ తరగతి విద్యార్థులను, పాఠశాలలో గల విద్యార్థులు అందరితో మమేకమై విద్యార్థులు నేర్చుకుంటున్నటువంటి అంశాల పట్ల అవగాహన కలిగి ఉండాలని, చిన్నతనం నుండే క్రమశిక్షణ విధానాన్ని పాటిస్తూ ఉండాలని ,విద్యార్థులు ప్రతి క్షణాన్ని కూడా వృధా చేయకుండా సమయం యొక్క విలువను తెలుసుకోవాలని,తల్లిదండ్రులను పెద్దలను గౌరవిస్తూ జీవితంలో ఎదిగిన తర్వాత వారు కూడా సమాజం చేత గౌరవ గౌరవించబడే విధంగా ఉండాలనీ విద్యార్థులకు స్ఫూర్తినిచ్చారు. చిన్నతనం నుండే ఎలాంటి కష్టం వచ్చినప్పటికీ కూడా నిరాశ పడకుండా ధైర్యంతో ముందుకు సాగాలనిఉదాహరణకు భవితా సెంటర్ కు వెళ్ళినట్లయితే అక్కడ ఉన్నటువంటి అనేక రకాలైనటువంటి శారీరక,మానసిక వికలాంగత కలిగినటువంటి పిల్లలను చూసి ఎంతో ధైర్యంతో ముందు ఉండొచ్చని వారు విద్యార్థులకు సూచించారు.అదేవిధంగా ప్రాథమిక పాఠశాలలోని ఒకటవ తరగతి బోధనను పరిశీలించారు. అప్రతి ఉపాధ్యాయుడు కూడా తరగతి గదిలో నో కాస్ట్ మరియులో కాస్ట్ బోధనోపకరణాలు ఉపయోగించి విద్యార్థులకు విద్యాబోధన చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలోరాయపర్తి మండల స్ఫూర్తి ప్రోగ్రాం ఇన్చార్జ్ అయినటువంటి రిటైర్డ్ గెజిటెడ్ హెడ్మాస్టర్ రావుల భాస్కర రావు విద్యార్థులను ఉద్దేశించి బాగా చదివి జీవితంలో మంచి ప్రయోజకులు కావాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గారే కృష్ణమూర్తి , ఉమారాణి, ఎస్ వి బి శర్మ, పెద్దగోని సురేందర్, స్వాతి, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు సిఆర్పిలు ఎంఆర్సి సిబ్బంది బోధ నేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎంజీఎం లో విజిలెన్స్ అధికారుల తనిఖీలు



**వరంగల్, నవంబర్ 13 (వుదయం జిల్లా ప్రతినిధి):** వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ నిధుల వ్యవహారంపై విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. విజిలెన్స్ డీఎస్పీ ఆధ్వర్యంలో ప్రత్యేక టీమ్ ఎంజీఎం చేరుకొని రికార్డులను పరిశీలించారు. ఎంజీఎం ఆసుపత్రిలో 2021 నుంచి 2024 వరకు ఆరోగ్యశ్రీ ద్వారా చేసిన ఆపరేషన్లు వచ్చిన నిధుల వివరాలను రికార్డుల ఆధారంగా పరిశీలించారు. ఈ నిధులు అవసరమైన పనులకు కాకుండా అనవసరమైన పనులకు వెచ్చించినట్లు ఫిర్యాదులు రావడంతో ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా తనిఖీలను చేపట్టారు. ఈ నాలుగేళ్ల కాలంలో ఎంజీఎం ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ కి సంబంధించి 30 కోట్లకు పైగా నిధులు ఆసుపత్రికి వచ్చాయి. ప్రతిరోజు ఈ పథకం కింద ఆసుపత్రిలో ఆపరేషన్లు చేస్తున్నారు. వీరికి సంబంధించిన నిధులు ఆసుపత్రి అభివృద్ధి కోసమే చేస్తారు. ఆపరేషన్ చేసిన వైద్యులకు ఫీజు కింద కొంత మొత్తం చెల్లిస్తారు. నిధుల ఖర్చు విషయంలో అవకతవకలు జరిగినట్లు ఫిర్యాదు రావడంతో విజిలెన్స్ డిఎస్పి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఈ తనిఖీలను చేశారు. సుమారు రెండు గంటల పాటు తమ తనిఖీలను నిర్వహించి అవసరమైన వివరాలు, రికార్డులను పరిశీలించి సంబంధించిన పత్రాలను తీసుకువెళ్లారు. మిగతా వివరాలను అడిగినప్పుడు పంపించాలని వైద్యులను కోరినట్లు తెలిసింది. ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ కి సంబంధించిన నిధుల వ్యవహారంపై విజిలెన్స్ టీమ్ వచ్చి పరిశీలించి వెళ్లారని ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ హరిచంద్రారెడ్డి తెలిపారు.

## లోక్ అదాలత్లను సద్వినియోగం చేసుకోవాలి


- జిన్నారం ఎస్సై హనుమంతు

**జిన్నారం నవంబర్ 13(వుదయం ప్రతినిధి)**



15న జాతీయ లోక్అదాలత్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిన్నారం ఎస్సై హనుమంతు అన్నారు. గురువారం ఆయన పోలీస్ స్టేషన్లో ఈ మేరకు విలేకరులతో మాట్లాడారు. జిన్నారం మున్సిపల్ పరిధిలో జరగ బోయే జాతీయ లోక్ అదాలత్లో వివిధ కేసులు, వివాదాలు రాజీ ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. “రాజీమార్గమే రాజమార్గం” అని అంటే సమస్యలను కోర్టుల్లో సంవత్సరాల పాటు లాగకుండా పరస్పర అంగీకారంతో పరిష్కరించుకోవడం ఉత్తమమని ఆయన సూచించారు. త్వరలో జరిగే లోక్ అదాలత్లను మున్సిపల్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


## బీసీల ధర్మపోరాట దీక్షకు మాజీ ఎమ్మెల్యే మద్దతు...



**మంథని నవంబర్ 13 (వుదయం ప్రతినిధి)** బీసీలకు విద్యఉద్యోగ రాజకీయ రంగాల్లో 42శాతం రిజర్వేషన్లు పెంచడానికి పార్లమెంట్లో రాజ్యాంగ సవరణచేసి తొమ్మిదవషెడ్యూల్ చేర్చాలనే డిమాండ్ తో పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్లో బీసీ జాయింట్ యాక్షన్ కమిటి ఆధ్వర్యంలో చేపట్టిన బీసీలధర్మ పోరాట దీక్షకు మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ మద్దతు తెలిపారు. గురువారం దీక్షా శిభిరాన్ని సందర్శించి సంఘీబావం ప్రకటించారు. 42శాతం బీసీ రిజర్వేషన్ల అమలులో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దోబూచులాట ఆడుతున్నాయని, బీసీల విద్యా ఉద్యోగ రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు కల్పించే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

## ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటాం

### రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్



**మహబూబ్ నగర్ నవంబర్ 12(వుదయం ప్రతినిధి)** ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ స్పష్టం చేశారు.ఖరీఫ్ 2025%-%26 వరి ధాన్యం కొనుగోళ్లపై గురువారం కలెక్టర్ కార్యాలయం అదనపు కలెక్టర్ ఛాంబర్ నుండి డి.ఆర్.డి. ఏ ఏ.పి. ఎం లు ,సి.సి.లు,పౌర సరఫరాల శాఖ అధికారులతో వెబెక్స్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన జిల్లాలో మొత్తం 190 పిపిసి ల ద్వారా ధాన్యం కొనుగోలు నిర్వహించడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. పిపిసి ల ప్రధాన ఉద్దేశ్యం రైతులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా, వారికి అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని తెలిపారు.ఎక్కడైనా కొనుగోలు ప్రక్రియలో ఆలస్యం కనిపిస్తే, సంబంధిత కొనుగోలు కేంద్రాల ఇన్చార్జ్లు, మానిటరింగ్ అధికారులు పై తీవ్ర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు తీసుకురాగానే, వారి వివరాలు వెంటనే ఓ.పి.ఎం.ఎస్ వ్యవస్థలో నమోదు చేయాలన సమాచారం ముఖ్యమంత్రి డ్యాష్బోర్డ్లో ప్రత్యక్షంగా కనిపిస్తుందని తెలిపారు. తేమ శాతం 17 శాతం లోపు ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి, ట్యాగ్ చేసిన మిల్లులకు, పంపించాలని, అలాగే దానికి సంబంధించిన కొనుగోలు పత్రాన్ని సంబంధిత రైతుకు ఇవ్వాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులు స్వయంగా మిల్లులకు వెళ్లరాదని స్పష్టం చేశారు. అదేవిధంగా, ఆ రోజున కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన వివరాలను అదే రోజున ఓ.పి.లో నమోదు చేసి, బిల్లులను పౌర సరఫరాల సంస్థ డి. ఎం కార్యాలయానికి పంపితే, రైతుల కు మద్దతు ధర చెల్లింపులు వారి బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయని తెలిపారు.కొనుగోలు కేంద్రాల ఇన్చార్జ్లు అన్ని రకాల రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని మానిటరింగ్ అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రం ఇన్చార్జ్ లు ఎవరైనా మోసం లేదా అవకతవకలకు పాల్పడితే, వారిని సస్పెండ్ చేయడమే కాకుండా ఆ కేంద్రాలను బ్లాక్లిస్ట్లో చేర్చుతామని ఆయన స్పష్టం చేశారు.

బుధవారం నుండి జిల్లాలో ఇప్పటివరకు 347.680 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 32 మంది రైతుల నుండి కొనుగోలు చేసినట్లు ఆయన తెలిపారు. మిగతా కేంద్రాలలో వచ్చే 2,3 రోజుల్లో కొనుగోళ్ళు ప్రారంభం కానున్నట్లు తెలిపారు.క్షేత్ర స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండి, ధాన్యం కొనుగోలు సమయంలో తలెత్తే అవరోధాలు, ఇబ్బందులను అధిగమిస్తూ, ధాన్యం కొనుగోలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలు సంబంధిత ఇతర సమస్యలు ఉంటే పౌర సరఫరాల అధికారులను సంప్రదించాలని సూచించారు.సమావేశంలో డి.ఆర్.డి. ఓ నర్సింహులు,జిల్లా పౌర సరఫరాల అధికారి గంప శ్రీనివాస్, జిల్లా పౌర సరఫరాల సంస్థ డి.ఎం.రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రం మేడలు వంచైనా బీసీ రిజర్వేషన్ సాధిస్తాం.. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**హనుమకొండ, నవంబర్ 13 (వుదయం జిల్లా ప్రతినిధి)** రాష్ట్ర బీసీ జేఏసీ పిలుపు మేరకు అష్టాంగ కార్యక్రమాలలో భాగంగా విద్యా ఉద్యోగ స్థానిక సంస్థల్లో 42% రిజర్వేషన్ సాధన కోసం... హన్మకొండలోని ఏకశిలా పార్క్ వద్ద బీసీ జేఏసీ వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వద్దకొండ వేణుగోపాల్ గౌడ్ అధ్యక్షతన “బీసీల ధర్మ పోరాట దీక్ష” కార్యక్రమాన్ని జరిగింది. ఈ దీక్షను సామాజిక ఉద్యమ నాయకులు కూరపాటి వెంకటనారాయణ మహాత్మా జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే దంపతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి బీసీల ధర్మపోరాట దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా వద్దకొండ వేణు గోపాల్ గౌడ్ మాట్లాడారు. దేశంలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలతో పాటు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో అగ్రవర్ణాలు కూడా వారి జనాభా ప్రకారం వారికి రిజర్వేషన్లు అనుభవిస్తుంటే, జనాభాలో సగభాగానికి పైగా ఉన్న బీసీలకు మాత్రం బీసీల జనాభా ప్రకారం రిజర్వేషన్లను కల్పించడంలో అగ్రవర్ణాల పార్టీలు కుట్రలు చేస్తున్నాయని, బీసీలకు రిజర్వేషన్లను కల్పిస్తే, ఆధిపత్య కులాల పెత్తనం నడవదని భావించి బీసీల రిజర్వేషన్లను అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. ఇక నుండి బీసీలు చేసే ఉద్యమాలతో ఢిల్లీ పెద్దల దిమ్మ తిరగాలేనని ఆయన బీసీలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంనికి మద్దత్తు తెలపడానికి వచ్చిన వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను తగ్గించి, బీసీలకు తీవ్రమైన అన్యాయం చేసి, భూగర్భంలో కలిసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదింపజేసిన బీసీ బిల్లును కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అడ్డుకుంటుంది.. ఆలా ఐయ్యేతే బీజేపీ కాల గర్భంలో కలవడం ఖాయమన్నారు. బీసీలకు విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థల కోటాతో పాటు చట్టసభలలో రిజర్వేషన్లకు కాంగ్రెస్ పార్టీ అనుకూలమన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే జనాభా దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లను కల్పించేందుకు సిద్ధంగా ఉందని, కామారెడ్డి డిక్లరేషన్ లో భాగంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నామని తెలిపారు.బీసీ ధర్మ పోరాట దీక్ష కు మద్దతూగా వచ్చిన, మాజీ స్పీకర్ శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూనాచారి, వరంగల్ పశ్చిమ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ గార్లు మాట్లాడుతూ...కామారెడ్డి డిక్లరేషన్ అంటూ, బీసీలకు రిజర్వేషన్లను కల్పిస్తామంటూ, ఎన్నికల ముందు వాగ్దానాలను ఇచ్చి బీసీల ఓట్లను దండుకొని రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ తూతూ మంత్రంగా కులగణన చేసి, బీసీలను మభ్య పెట్టేందుకు అసెంబ్లీలో బీసీ బిల్లును ప్రవేశపెడితే తాము మద్దతు ఇచ్చామని, అయినప్పటికీ రాజ్యాంగ సవరణ ద్వారా బీసీ బిల్లును 9వ షెడ్యూల్లో చేర్పించి, బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాల్సిన కేంద్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటుందని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట ప్రకారం బీసీలకు రిజర్వేషన్లను కల్పించాలంటే,అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టి ఏకగ్రీవ తీర్మానం చేయడం ద్వారా చట్టబద్ధత కలుగదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అఖిలపక్ష నేతలతో ఢిల్లీకి వెళ్లి ప్రధానిని ఒప్పించాలని, లేకుంటే ఇండియా కూటమి పార్లమెంట్ సభ్యులతో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పార్లమెంట్ ను స్తంభింపజేయాలని శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, వరంగల్ పశ్చిమ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ లు డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లను కల్పించాల్సిన కేంద్రం అడ్డుకుంటుందని, రిజర్వేషన్లను కల్పిస్తామని చెప్పి ఏ పోరాటం చేయకుండా కాంగ్రెస్ పార్టీ బీసీలను మభ్యపెడుతుందని వారు ధ్వజమెత్తారు. బీసీలంతా ఏకమై ప్రత్యేక తెలంగాణ ఉద్యమ తరహాలో ఏర్పడ్డ జేఏసీ మాదిరిగానే ప్రస్తుతం బీసీ జేఏసీ ఏర్పడిందని, అదే తెలంగాణ ఉద్యమ తరహాలో బీసీ జేఏసీని ముందుకు తీసుకెళుతున్న నాయకులకు తమవంతు పూర్తి సహకారం ఉంటుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ సాంబారి సమ్మారావు, బీసీ జేఏసీ నాయకులు కూరపాటి వెంకట్ నారాయణ, డా. కూరపాటి రమేష్, వీరస్వామి, గడ్డం భాస్కర్, దాడి మల్లయ్య యాదవ్, బోనగాని యాదగిరి గౌడ్, దొడ్డేపల్లి రఘుపతి, ఎల్లయ్య, సాయిని నరేందర్, తాడిశెట్టి క్రాంతి కుమార్, వల్లాల జగన్, చాపార్తి కుమార్ గాడ్గే, జాగృతి శ్రీశైలం, డాక్టర్ జగదీష్ ప్రసాద్, ఎర్రజు బిక్షపతి, చోళ్ళేటి కృష్ణమాచారి, గిరిబోయిన రాజయ్య యాదవ్, చంద మల్లయ్య, అరె కటిక సురేష్, వేముల మహేందర్ గౌడ్, కాసగాని అశోక్ గౌడ్, భీమగాని యాదగిరి గౌడ్, గొట్టే మహేందర్, తేల్లా సుగుణ, కిషోర్, చాగంటి రమేష్, మౌనిక తదితరులు ఈ దీక్ష లో పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన నర్సంపేట గౌరవ మాజీ శాసనసభ్యులు శ్రీ పెద్ది సుదర్శన్ రెడ్డి



**చెన్నరావుపేట నవంబర్ 13 (వుదయం ప్రతినిధి)** చెన్నారావుపేట్ మండల కేంద్రంలోని చెరువుకొమ్ము తండా గ్రామం బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త భూక్యా కొమ్మాలు లలిత గార్ల దంపతుల కుమారుడు గణేష్ గీత ల వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన నర్సంపేట గౌరవ మాజీ శాసనసభ్యులు శ్రీ పెద్ది సుదర్శన్ రెడ్డి ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బాల్నె వెంకన్న మండల ఎన్నికల కన్వీనర్ జక్క అశోక్ యాదవ్ సొసైటీ చైర్మన్ మురహరి రవి.మండల నాయకులు బోడ బద్ధు నాయక్ మండల ఉపాధ్యక్షులు బానోత్ గణేష్. భూక్య కీమా నాయక్ మండల యూత్ ప్రెసిడెంట్ మంచోజు మనోజ్. మండల సోషల్ మీడియా ఇన్చార్జ్ బోడ మురళి నాయక్, కందికొండ విజయ్, భాషబోయిన సాంబయ్య. రామలింగం, భూక్య ఉమ్మ.స్వామి, కీర్య నాయక్. లచ్చిరాం. రమేష్, గుగులోతు వీరన్న, బోడ సాగర్, కర్రీ శ్రీను మాజీ వార్డ్ మెంబర్లు, గ్రామ నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు





# బిజినెస్



## రూ. 60 వేలకే టాటా మోటార్స్ నుంచి బైక్స్ వస్తున్నాయా..

దేశంలోనే అత్యంత విలువైన, విశ్వసనీయ సంస్థల్లో టాటా గ్రూప్ అన్నింటికంటే ముందు వరుసలో ఉంటుంది. చాలా మంది ఇదే చెబుతుంటారు. నాణ్యతకు మారుపేరుగా ఈ సంస్థ ఉంటుందని అంతా నమ్ముతుంటారు. ఆ గ్రూప్ నుంచి వచ్చే ప్రొడక్ట్‌పై ప్రజలకు నమ్మకం ఎక్కువే ఉంటుంది. దాదాపు అన్ని రంగాల్లో కార్యకలాపాలు నిర్వర్తిస్తున్న టాటా గ్రూప్ గురించి ఇటీవల కొన్ని నకిలీ వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. అదే దిగ్గజ కార్ల తయారీ సంస్థ టాటా మోటార్స్.. ద్విచక్ర వాహన రంగంలోకి ప్రవేశిస్తుందని వార్తలు రావడం. కొద్ది రోజులుగా దీనికి సంబంధించి.. సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరిగింది. టాటా గ్రూప్ లోగోతో.. బైక్స్ ఉన్నట్లు సోషల్ మీడియాలో ఫొటోలు కూడా దర్శనం ఇచ్చాయి. దీంతో ఇది నిజమనే చాలా మంది అనుకున్నారు. ముఖ్యంగా టాటా బైక్స్.. ప్రముఖ రాయల్ ఎన్‌ఫీల్డ్ లుక్‌లో తీసుకొస్తోందని.. దేశంలోనే అత్యంత చౌకగా రూ. 60 వేల లోపు ధరకే 125సీసీ మోటార్ సైకిల్‌ను ఆవిష్కరించిందని ప్రచారం జరిగింది. ఈ బైక్ మైలేజీ ఏకంగా 90 కిలో మీటర్లుగా ఉంటుందని కొన్ని మోసపూరిత వెబ్‌సైట్స్, సోషల్ మీడియాల్లో కనిపిం చడంతో నిజమని నమ్మారు చాలా మంది. అయితే చాలా రోజులకు.. తమ బ్రాండ్ పై పెరుగుతున్న తప్పుడు ప్రచారా నికి అడ్డుకట్ట వేసేందుకు టాటా మోటార్స్ దీని పై కీలక ప్రకటన చేసింది. టాటా మోటార్స్ ద్విచక్ర వాహన రంగంలోకి ప్రవేశించడం లేదని సంస్థ అధికారింగా ఖండించింది. దీని గురించి టాటా మోటార్స్ ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో పోస్ట్ చేసింది. తమకు ద్విచక్ర వాహన రంగం లోకి ప్రవేశం చాలనే ప్రణాళికలు ఏమీ లేవని క్లారిటీ ఇచ్చింది. టాటా మోటార్స్‌కు సంబంధించి.. ఏమైనా ఎలక్ట్రిక్, ప్యాసింజర్ వెహికిల్స్‌కు సంబంధించిన సమాచారం తమ అధికారిక వెబ్‌సైట్లలో మాత్రమే చూడాలని పేర్కొంది. దీంతో టాటాల నుంచి బైక్స్ రావట్లేదని జనానికి ఒక క్లారిటీ వచ్చింది. ఇప్పటికే టాటాల నుంచి బైక్స్ అంటూ సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టిన ఫొటోలు నకిలీవి అని.. పలు ఫ్యాక్ట్ చెక్ టూల్స్ స్పష్టం చేశాయి. దీనిని పలు మీడియాలు కూడా పేర్కొన్నాయి. ప్రస్తుతానికి టాటా మోటార్స్ ప్యాసింజర్, కమర్షియల్, ఎలక్ట్రిక్ వాహనాల్లో 4- వీలర్‌పైనే దృష్టిసారించింది. ఇటీవల టాటామోటార్స్ రెండు సంస్థలుగా విడిపోయింది. ప్యాసింజర్ వెహికిల్స్, ఎలక్ట్రిక్ వెహికిల్స్, జాగ్వార్ ల్యాండ్ రోవర్ కలిసి టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికిల్స్ లిమిటెడ్‌గా.. ఇదే సమయంలో టాటా మోటార్స్ కమర్షియల్ వెహికిల్స్ లిమిటెడ్ అనే మరో కంపెనీగా వేరైంది.



## త్వరలో వెండిపైనా రుణాలు..



ఇప్పటి వరకు బంగారంపై రుణాలను అందిస్తున్న బ్యాంక్‌లు, ఇతర విత్త సంస్థలు త్వరలోనే వెండి తనఖా రుణాలను ఇవ్వనున్నాయి. ఇందుకోసం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) కీలక మార్గదర్శకాలను ప్రకటించింది. వచ్చే 2026 ఏప్రిల్ 1 నుంచి వాణిజ్య బ్యాంక్‌లు, బ్యాంకింగేతర విత్త సంస్థలు (ఎన్‌బీఎఫ్‌సీ)లు వెండి ఆభరణాలు, నాణేలపై రుణాలు ఇవ్వడానికి అనుమతిని మంజూరు చేసింది. ఈ కొత్త నిబంధనలు గ్రామీణ, చిన్న పట్టణ ప్రాంతాల్లో ఆర్థిక మద్దతును పెంచుతాయని ఆర్బీఐ భావిస్తోంది. ఒక వ్యక్తి గరిష్టంగా 10 కిలోల వెండి ఆభరణాలు లేదా 500 గ్రాముల వెండి నాణేలను తాకట్టు పెట్టి రుణం పొందడానికి వీలుంటుంది. వెండి విలువలో గరిష్టంగా 85 శాతం వరకు రుణంగా ఇవ్వవచ్చు. అయితే స్పెక్యులేటివ్ ట్రేడింగ్‌ను నిరోధించడానికి ప్రాథమిక వెండి బిస్కెట్లు, కడ్డీలపై మాత్రం రుణాలు అనుమతించడం లేదు. గతంలో కేవలం బంగారు రుణాలకు మాత్రమే పరిమితమైన బ్యాంకులు త్వరలో వెండిని కూడా తాకట్టుగా స్వీకరించడం ద్వారా తమ పోర్ట్‌ఫోలియోను విస్తరించుకోవడానికి, కొత్త ఖాతాదారులను పెంచుకోవడంతో పాటు వాటి వ్యాపారం పెరగనుందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.


## సైబార్ బీమాలో రెండు రెట్ల వృద్ధి లక్ష్యం

దేశంలోని పలు సంస్థలు, స్టార్టప్‌లు, ఎంఎస్‌ఎంఇలను పెరుగుతున్న సైబర్ దాడులు, డేటా ఉల్లంఘనల ముప్పు నుంచి రక్షించడానికి ప్రత్యేకంగా సమగ్ర సైబర్ బీమా పరిష్కారమైన 'సైబర్ ఎడ్జ్'ను ప్రారంభించినట్లు ప్రముఖ సాధారణ బీమా సంస్థలలో ఒకటైన టాటా ఎఐజి జనరల్ ఇన్సూరెన్స్ తెలిపింది. హైదరాబాద్‌లో ఆ సంస్థ ఫైనాన్సీయల్ లైన్స్ నేషనల్ హెడ్ నజ్మ్ బిల్గ్రామి మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో రాబోయే మూడు సంవత్సరాలలో రెండు రెట్ల వ్యాపార వృద్ధిని అంచనా వేస్తున్నామన్నారు. తమ మొత్తం సైబర్ బీమా పోర్ట్‌ఫోలియోలో రెండు రాష్ట్రాల నుంచి దాదాపు 25 శాతం వాటాను చేరొచ్చని అన్నారు. హైదరాబాద్, వైజాగ్, విజయవాడలోని ఐటి పారిశ్రామిక క్లస్టర్‌లలో పెరుగుతున్న సైబర్ సంసిద్ధత తమ వ్యాపారానికి మద్దతును ఇవ్వనుందన్నారు. సైబర్ నేరాలలో ఆంధ్రప్రదేశ్. తెలంగాణ కలిపి భారత దేశంలో రెండవ స్థానం లో ఉన్నాయన్నారు. గత 2024లో రెండు రాష్ట్రాలు 62 లక్షలకు పైగా మాల్వేర్ గుర్తింపులు, 17,500 రాన్సమ్ వేర్ సంఘటనలను చవి చూశాయన్నారు. ముఖ్యంగా ఫార్మా, ఐటి, ఫైనాన్సీయల్, తయారీ రంగాలు ఎక్కువగా సైబర్‌దాడులకు గురైతున్నాయన్నారు. గతేడాది దేశవ్యాప్తంగా 400 పైగా సైబర్ పాలసీలను విక్రయించామన్నారు. ఈ పరిశ్రమ మార్కెట్ సైజ్ రూ.900 కోట్లుగా ఉందని.. అందులో తమకు 18 శాతం మార్కెట్ వాటా ఉందని.. దీన్ని 25 శాతానికి పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.



## ఎగుమతుల ప్రోత్సాహానికి రూ.45,000 కోట్ల పథకాలు

అమెరికా విధించిన అధిక టారిఫ్‌ల ప్రభావాన్ని భారతీయ ఎగుమతిదార్లు తట్టుకునే నిమిత్తం రూ.45,000 కోట్ల విలువైన రెండు పథకాలకు కేంద్ర మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది. ఎమ్ఎస్ఎమ్ఈలు, తొలిసారి ఎగుమతి చేసేవారు, కార్మికులు అధికంగా ఉండే రంగాల కోసం రూ.25,060 కోట్లతో ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ మిషన్‌కు అనుమతినిచ్చింది. ఇందులో నిర్యత్ ప్రోత్సాహన్(రూ.10,401 కోట్లు), నిర్యత్ దిశ(రూ.14,659 కోట్లు) అనే 2 ఉప పథకాలుంటాయి. రెండో పథకమైన క్రెడిట్ గ్యారెంటీ స్కీమ్ ఫర్ ఎక్స్‌పోర్టర్స్ (సీజీఎస్‌ఈ) కింద రూ.20,000 కోట్ల వరకు తాకట్టు అవసరం లేని రుణాలు ఇస్తారు. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న ఈ నిర్ణయాలను మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు. అమెరికా టారిఫ్ ప్రభావం ఎక్కువగా పడుతున్న జౌళి, తోలు, రత్నాభరణాలు, ఇంజినీరింగ్ వస్తువులు, సముద్ర ఉత్పత్తుల రంగాలకు ప్రాధాన్య మద్దతు ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. గ్రాఫైట్, సీసియం, రుబిడియం, జిర్కోనియం వంటి కీలక ఖనిజాల ఉత్పత్తిని దేశీయంగా పెంచేందుకు వాటి రాయల్టీ ధరలను హేతుబద్ధీకరిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఈ ఖనిజాల గనులను వేలం వేసేందుకుబీ లిథియం, టంగ్‌స్టన్, అరుదైన భూఅయస్కాంత ఎలిమెంట్స్, నియోబియం వంటి వాటినీ వెలికి తీసేందుకు ఉపకరించనుంది. సీసియం, గ్రాఫైట్, రుబిడియం, జిర్కోనియంపై రాయల్టీ తగ్గించడం వల్ల వీటి ఉత్పత్తి పెరిగే వీలుంది. గ్రాఫైట్‌ను విద్యుత్తు వాహనాల బ్యాటరీల్లో వినియోగిస్తున్నారు. జిర్కోనియంను అణు ఇంధనం, ఏరోస్పేస్, ఆరోగ్య సంరక్షణ, తయారీ రంగాల్లో వాడతారు. సీసియంను హైటెక్ ఎలక్ట్రానిక్స్, అటామిక్ క్లాక్స్, జీపీఎస్ వ్యవస్థలు, క్యాన్సర్ థెరపీ పరికరాల్లో వినియోగిస్తారు. రుబిడియంను ఫైబర్ ఆప్టిక్స్, టెలికాం, చీకటిలో చూసేందుకు వాడే పరికరాల్లో వినియోగిస్తారు.



## ముంబై ఇండియన్స్ నుంచి అర్జున్ ఔట్...



అర్జున్ టెండూల్కర్‌కు ముంబై ఇండియన్స్ యాజమా న్యం షాక్ ఇచ్చేందుకు సిద్ధమై నట్టు తెలుస్తోంది. ట్రేడ్ టాక్స్ ద్వారా అర్జున్ టెండూల్కర్‌ను వదిలించుకోవాలని స్కెచ్ వేసింది. లక్నోకు అర్జున్ ను అప్పగించి, ఆ జట్టుకు చెందిన శార్దుల్ ఠాకూర్ ను ముంబైలోకి తీసుకురావాలని నీతా అంబానీ ప్లాన్ వేసినట్లు కథనాలు వస్తున్నాయి. ఈ మేరకు రెండు జట్ల మధ్య చర్చలు కూడా జరుగుతున్నట్లు సమాచారం.అటు ఇప్పటికే ముంబై ఇండియన్స్‌తో శార్దుల్ ఠాకూర్‌కు డీల్ కుదిరి నట్లు రవిచంద్రన్ అశ్విన్ ఓ ఇంటర్వ్యూలో కూడా వెల్లడించారు. ఇదే నిజమైతే వచ్చే సీజన్ లో ముంబై నుంచి శార్దుల్ ఠాకూర్, లక్నో తరఫున బరిలోకి అర్జున్ టెండూల్కర్ దిగుతాడు. ముంబై ఇండియన్స్‌లోనే అర్జున్ టెండూల్కర్ తుది జట్టులో ఛాన్స్ సరిగ్గా రాలేదు. అలాంటిది లక్నో జట్టులోకి వెళితే, అతనికి ఛాన్స్ రావడం కష్టమే అని క్రీడా విశ్లేషకులు అంటున్నారు. దానికితోడు లక్నో యాజమాన్యం ప్లేయర్ల పట్ల కఠినంగా వ్యవహ రిస్తూ ఉంటుంది. సరైన ప్రదర్శన కనబరచకపోతే, అర్జున్ టెండూల్కర్ ఆ జట్టులో కొనసాగడం కష్టమే అంటున్నారు. ఆ జట్టులో ఉంటే అతని కెరీర్ కూడా ప్రమాదంలో పడుతుందని అంచనా వేస్తున్నారు.

## జడేజాకు రాజస్థాన్ రాయల్స్ బంపర్ ఆఫర్



ఐపీఎల్ 2026 టోర్నమెంట్ కోసం చెన్నై, రాజస్థాన్ రాయల్స్ చాలా వ్యూహాత్మక అడుగులు వేస్తున్నాయి. మహేంద్ర సింగ్ ధోని రిటైర్మెంట్ ప్రకటిస్తే, అతని స్థానం భర్తీ చేసేందుకు ఈ ఏడాదే సంజుపై కన్నేసింది చెన్నై. ఇక అటు గత ఏడాది స్పిన్నర్లు లేక రాజస్థాన్ రాయల్స్ దారుణంగా విఫలమైంది. దింతో జడేజాను తీసుకోవాలని ప్లాన్ చేసింది రాజస్థాన్. ఈ తరుణంలోనే ఈ రెండు జట్ల మధ్య ట్రేడ్ ట్రాక్ కొనసాగుతోంది. రవీంద్ర జడేజాతో పాటు సామ్ కరణ్ ను ఇచ్చి సంజును జట్టులోకి తీసుకునేందుకు చెన్నై సూపర్ కింగ్స్ స్కెచ్ వేసింది. రాజస్థాన్ రాయల్స్ కూడా దీనికి ఓకే చెప్పింది. దీనిపై మరో రెండు రోజుల్లో అధికారిక ప్రకటన రానుంది. అయితే రాజస్థాన్ రాయల్స్ జట్టులోకి వెళ్తున్న రవీంద్ర జడేజాకు అదిరిపోయే దక్కినట్లు తెలుస్తోంది. ఐపీఎల్ 2026 టోర్నమెంట్ లో రవీంద్ర జడేజాకు కెప్టెన్సీ ఇవ్వాలని రాజస్థాన్ రాయల్స్ యాజమాన్యం నిర్ణయం తీసుకుందట. ఈ మేరకు జడేజాకు కూడా సమాచారం అందించారట. సంజు స్థానంలో కెప్టెన్సీ చేసేందుకు జడేజా కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు టాక్. కాగా, నవంబర్ 15వ తేదీలోపు రిటెన్షన్ లిస్టు పంపించాలని బీసీసీఐ ఆదేశాలు ఇచ్చింది. డిసెంబర్ 15వ తేదీన మినీ వేలం జరగనుందని సమాచారం.

# ఆట


## పాకిస్తాన్‌లో బాంబు పేలుడు.. స్వదేశానికి వెళ్లిపోతున్న శ్రీలంక క్రికెటర్లు !

పాకిస్తాన్ దేశంలో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితులు ఉన్నాయి. వరుసగా బాంబు పేలుళ్లు జరుగుతున్న నేపథ్యంలో అక్కడి ప్రజలు, కంటిమీద కునుకు లేకుండా జీవిస్తున్నారు. ఇప్పుడు అలాంటి పరిస్థితే శ్రీలంక ప్లేయర్లకు కూడా వచ్చింది. పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్ లో ఇటీవల కాలంలో భారీ బాంబు పేలుడు సంభవించింది. ఈ ఘటన నేపథ్యంలో పాకిస్తాన్ లో పర్యటిస్తున్న శ్రీలంక ప్లేయర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాకిస్తాన్ వర్సెస్ శ్రీలంక మధ్య ఇవాళ మధ్యాహ్నం 3 గంటలకు రెండు వన్డే మ్యాచ్ ఉంది.రావాల్పిండి స్టేడియం వేదికగా జరుగుతున్న ఈ వన్డే మ్యాచ్ లో తాము ఆడబోమని, పాకిస్తాన్ ను వదిలేసి తమ దేశానికి వెళ్లిపోయేందుకు 8 మంది శ్రీలంక క్రికెటర్లు సిద్ధం అయినట్లు కథనాలు వస్తున్నాయి. రావాల్పిండి స్టేడియం, పేలుడు జరిగిన ప్రదేశానికి దాదాపు 12 కిలో మీటర్ల దూరం ఉంటుందట. దీంతో వణికిపోతున్న 8 మంది శ్రీలంక ప్లేయర్లు తమ దేశానికి వెళ్లిపోవాలని అనుకుంటున్నారట. ఈ మేరకు శ్రీలంక బోర్డుకు కూడా సమాచారం అందించారట. దీంతో పాకిస్తాన్, శ్రీలంక బోర్డుల మధ్య ప్రస్తుతం చర్చలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ ఆ 8 మంది పాకిస్తాన్ ను వదిలి వస్తే, కొత్తగా మరో 8 మందిని పాకిస్తాన్ కు పంపించేందుకు శ్రీలంక బోర్డు ప్లాన్ చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. మొత్తానికి ఈ టోర్నమెంట్ ఫినిష్ చేసి రావాలని తమ ప్లేయర్లకు శ్రీలంక బోర్డు ఆదేశాలు ఇచ్చిందట. అయితే ఆ 8 ప్లేయర్లు నిజంగానే శ్రీలంకకు వెళ్ళిపోతే, మిగిలిన ప్లేయర్లు కూడా ఆడడం కష్టమేనని చర్చ జరుగుతోంది. మరి కొన్ని గంటలు ఆగితే దీనిపై క్లారిటీ రానుంది.



## తెలుగు కుర్రాడు నితీశ్‌కు షాక్.. తుది జట్టులో పంత్, జురెల్‌కు చాన్స్

ఇటీవల ఆస్ట్రేలియా టూరు ముగించుకున్న టీమిండియా మళ్లీ టెస్టులు ఆడేందుకు సిద్ధమైంది. సొంతగడ్డపై సౌతాఫ్రికాతో రెండు టెస్టుల సిరీస్ ఆడనుంది. కోల్‌కతా వేదికగా రేపటి నుంచి తొలి టెస్టు ప్రారంభకానుంది. ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగే భారత తుది జట్టుపై చర్చ జరుగుతుంది. ముఖ్యంగా రిషబ్ పంత్ రాకతో ధ్రువ్ జురెల్‌కు తుది జట్టులో స్థానంపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. దీనిపై భారత అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్ డోస్చేట్ క్లారిటీ ఇచ్చాడు. తొలి టెస్టులో ఇద్దరూ ఆడనున్నట్టు హింట్ ఇచ్చాడు. 'పంత్, ధ్రువ్ ఆడకపోతే నేను ఆశ్చర్య పోతాను. గత ఆరు నెలలుగా ధ్రువ్ అద్భుతంగా ఆడుతున్నాడు. గత వారంలో బెంగళూరులో రెండు సెంచరీలు బాదాడు. తొలి టెస్టులో అతను ఆడతాడు.'అని టెన్ డోస్చేట్ తెలిపాడు. ఇంగ్లాండ్ టూరులో గాయపడిన పంత్ ఈ సిరీస్‌కు అందుబాటులోకి వచ్చాడు. ఇంతకుముందు సౌతాఫ్రికా 'ఏ'తో సిరీస్‌లో ఫామ్ నిరూపించుకున్నాడు. అంతేకాకుండా పంత్ భారత జట్టుకు వైస్ కెప్టెన్. కాబట్టి, తుది జట్టు నుంచి అతన్ని తప్పించడం కుదరుదు. ఇక, గాయం కారణంగా పంత్ దూరమైన వేళ జురెల్ అతని స్థానాన్ని భర్తీ చేశాడు. వెస్టిండీస్‌తో సిరీస్‌లో శతకం బాదాడు. ఇటీవల సౌతాఫ్రికా 'ఏ'తో రెండో టెస్టులో రెండు సెంచరీలతో సత్తాచాటాడు. కాబట్టి, అతన్ని కూడా తప్పించలేని పరిస్థితి. పంత్, జురెల్ ఇద్దరిని తొలిటెస్టు ఆడించాలని టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తుంది. మంచి ఫామ్‌లో ఉన్న జురెల్‌ను ఆడించడం వల్ల భారత లోయర్ ఆర్డర్ కూడా బలంగా మారుతుంది. తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్ రెడ్డికి తుది జట్టులో స్థానం కరువైంది. తొలి టెస్టుకు అతను దూరంగా ఉండనున్నట్టు కోచ్ టెన్ డోస్చేట్ తెలిపాడు. 'నితీశ్‌పై మా ఆలోచనలో ఎలాంటి మార్పు లేదు. ఆస్ట్రేలియాలో అతనికి ఎక్కువగా ఆడే చాన్స్ రాలేదు. ఈ సిరీస్ ప్రాముఖ్యత, పరిస్థితుల కారణంగా తొలి టెస్టులో అతను ఆడకపోవచ్చు.'అని చెప్పాడు. జట్టు వ్యూహంలో భాగంగానే తుది జట్టు ఎంపిక ఉంటుందని తెలిపాడు. తొలి టెస్టు జట్టు నుంచి కూడా నితీశ్‌ను రిలీజ్ చేసినట్టు తెలుస్తోంది. మొదటి టెస్టులో బెంచ్‌కే పరిమితం కానున్న నేపథ్యంలో అతని సేవలను భారత్ 'ఏ' జట్టుకు వినియోగించుకోవాలని చూస్తోంది.



## పాండ్యా వచ్చేస్తున్నాడు



ఆసియా కప్‌లో గాయపడి జట్టుకు దూరమైన భారత స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా త్వరలోనే జాతీయ జట్టులోకి పునరాగమనం చేయనున్నారు. గాయం నుంచి కోలుకున్న అతను ఫిట్‌నెస్ సాధించే పనిలో ఉన్నాడు. సౌతాఫ్రికాతో జరిగే వన్డే సిరీస్‌లో అతను ఆడే అవకాశాలు ఎక్కువగానే ఉన్నాయి. అయితే, అంతకుముందు అతను ఫిట్‌నెస్ నిరూపించుకోవాల్సి ఉంది. ప్రస్తుతం అతను బెంగళూరులోని సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్స్‌లో ట్రైనింగ్ అవుతున్నాడు. జాతీయ జట్టులోకి ఎంట్రీ ఇవ్వడానికి ముందు పాండ్యా ఈ నెలలో జరగబోయే సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ఆడబోతున్నట్టు సమాచారం. బరోడా తరపున తొలి మ్యాచ్ లేదా రెండో మ్యాచ్ ఆడనున్నాడు. అనంతరం తిరిగి భారత్ తరపున ఆడటానికి సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ అతనికి క్లియర్స్ ఇస్తుంది. ఆసియా కప్‌లో పాండ్యా ఎడమ తొడకు గాయమైంది. దీంతో పాకిస్తాన్‌తో ఫైనల్‌కు దూరమైన విషయం తెలిసిందే. అలాగే, ఇటీవల ఆస్ట్రేలియా టూరు కూడా మిస్ అయ్యాడు. ఈ నెల 30 నుంచి దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్ ప్రారంభంకానుంది.

# చక్కని ఆరోగ్యం

## మంచిదని పసుపు నీరు తాగుతున్నారా..?





ఉదయం పూట పసుపు నీళ్లు తాగడం అనేది ఇటీవల కాలంలో బాగా పాపులర్‌గా మారింది. పసుపులో ఉండే కర్కుమిన్ అనే పదార్థం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని చెబుతుంటారు. ఇందులో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ ఆక్సిడెంట్, రోగనిరోధక శక్తిని పెంచే గుణాలు పుష్కలంగా ఉంటాయి. అయితే దీని వల్ల కలిగే ప్రయోజనాలతో పాటు కొన్ని దుష్ప్రభావాలు కూడా ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తు న్నారు.జీర్ణ సమస్యలు: పసుపు నీరు జీర్ణక్రియకు సహాయపడుతుందని చెప్పినప్పటికీ ఎక్కువ మోతాదులో తీసుకుంటే జీర్ణ సంబంధిత సమస్యలు వస్తాయి. వికారం, కడుపు నొప్పి, యాసిడ్ రిఫ్లక్స్ లేదా విరేచనాలు వంటి సమస్యలు రావచ్చని పరిశోధనలు చెబుతు న్నాయి. రక్తం పలచబడటం: పసుపుకు రక్తాన్ని పలచబరిచే గుణం ఉంది. ఇది రక్తం గడ్డకట్ట కుండా నిరోధిస్తుంది. దీంతో గాయాలైనప్పుడు రక్తం ఎక్కువగా పోయే ప్రమాదం ఉంది. ముఖ్యంగా రక్తం పలచబడటానికి మందులు వాడేవారు. లేదా రక్తస్రావ వ్యాధులు ఉన్నవారు పసుపు నీరు తాగే ముందు వైద్యుడి సలహా తీసుకోవాలి. ఐరన్ శోషణ తగ్గడం: పసుపును ఎక్కువగా తీసుకుంటే శరీరంలో ఐరన్ శోషణ 20శాతం నుండి 90శాతం వరకు తగ్గుతుంది. ఇది కాలక్రమేణా ఐరన్ లోపం, రక్తహీనతకు దారితీస్తుంది. అధిక మోతాదులో పసుపు సప్లిమెంట్లను వాడిన ఒక వ్యక్తికి రక్తహీనత వచ్చినట్లు ఒక నివేదిక వెల్లడించింది. కాలేయ సమస్యలు: అధిక మోతాదులో పసుపు సప్లిమెంట్లను వాడితే కాలేయానికి హాని కలుగుతుంది. ఇప్పటికే కాలేయ సమస్యలు ఉన్నవారు దీనిని అధికంగా తీసుకునేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. కొన్ని సందర్భాల్లో ఇది తీవ్రమైన కాలేయ వైఫల్యానికి కూడా దారితీస్తుంది.

## బెల్లం, బ్రౌన్ షుగర్..



బెస్ట్ ఆప్షన్ ఏది మధుమేహం, ఊబకాయం వంటి జీవనశైలి వ్యాధులు పెరుగుతున్న నేటి కాలంలో, ప్రజలు తమ ఆహారపు అలవాట్ల పట్ల మరింత శ్రద్ధ చూపుతున్నారు. శుద్ధి చేసిన తెల్ల చక్కెరను తగ్గించి, ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయాలను ఎంచుకోవాలనే ధోరణి పెరుగుతోంది. ఈ ప్రత్యామ్నాయాలలో బెల్లం పొడి, బ్రౌన్ షుగర్ ప్రముఖమైనవి.రెండూ ఒకే విధంగా కనిపించినా, తీపిని అందించినా, వాటి తయారీ విధానం, పోషక విలువలు, ఆరోగ్యంపై వాటి ప్రభావం వేర్వేరుగా ఉంటాయి. ఈ తేడాలను అర్థం చేసుకోవడం ద్వారా సరైన ఎంపిక చేసుకోవచ్చు. బెల్లం పొడి.. చెరకు రసం లేదా తాటి రసం నుండి తయారుచేసిన సహజ స్వీటెనర్. దీనిని రసాయనికంగా శుద్ధి చేయరు. కాబట్టి ఐరన్, మెగ్నీషియం, పొటాషియం వంటి అనేక పోషకాలు అలాగే ఉంటాయి. దీనికి కొద్దిగా మట్టి రుచి ఉంటుంది. ఇది సాధారణంగా మన వంటకాలు, స్వీట్లు, టీలలో ఉపయోగిస్తారు. బ్రౌన్ షుగర్ అనేది తెల్ల చక్కెర, బెల్లం పాకంతో (మొలాసిస్) కలిపిన మిశ్రమం. మొలాసిస్ వల్ల దీనికి తేలిక పాటి క్యారమెల్ రుచి వస్తుంది. ఇది తెల్ల చక్కెర కంటే తక్కువ శుద్ధి చేసినప్పటికీ.. బెల్లం పొడిలా ఎక్కువ పోషకాలు ఇందులో ఉండవు. బెల్లం పొడిలో తక్కువ మొత్తంలో ఐ ర న్, కాల్షియం, ఫాస్ఫరస్, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. బ్రౌన్ షుగర్ ఎక్కువగా ఖాళీ కేలరీలను అందిస్తుంది. మొలాసిస్ నుండి చాలా తక్కువ ఖనిజాలు మాత్రమే లభిస్తాయి. తీపితో పాటు అదనపు పోషణ కావాలంటే బెల్లం పొడి మంచి ఎంపిక. బెల్లం పొడి గానీ, బ్రౌన్ షుగర్ గానీ బరువు తగ్గడానికి మ్యాజిక్ సొల్యూషన్ కాదు. రెండింటిలోనూ కేలరీలు అధికంగా ఉంటాయి. కాబట్టి మితంగా తీసుకోవాలి. బ్రౌన్ షుగర్ తో పోల్చితే– బరువు తగ్గాలనుకునే వారికి ఇది కొద్దిగా బెటర్ ఆప్షన్ అన్నమాట. మీరు పోషకాలు ఎక్కువగా ఉండే సహజ స్వీటెనర్ కావాలంటే బెల్లం పొడిని ఎంచుకోండి. బేకింగ్ లేదా డెజర్ట్‌ల కోసం రుచిని ఇష్టపడితే బ్రౌన్ షుగర్‌ను ఎంచుకోవచ్చు. శుద్ధి చేసిన తెల్ల చక్కెర కంటే బెల్లం పొడి, బ్రౌన్ షుగర్ రెండూ మెరుగైనవే. బెల్లం పొడిలో ఎక్కువ పోషకాలు ఉంటాయి. ఆరోగ్యకరమైన జీవనశైలిని కోరుకునే వారు జగ్గేరి పౌడర్ ను ఎంచుకోవడం ఉత్తమం.






## చపాతీ తినడం మానేస్తున్నారా..?

గోధుమ పిండితో చేసే వంటకాలు చాలా మందికి సాధారణ ఆహారం, కానీ గోధుమ పిండి ఆరోగ్యానికి హానికరం అని కొందరు అంటుంటారు. కానీ ఇది ఎంతవరకు నిజం..? రోజూ చపాతీలు తింటే ఆరోగ్య సమస్యలు వస్తాయా..? భారతీయ వంటకాల్లో చపాతీ చాలా ముఖ్యమైనది. చాలా మంది రోజులో ఒక్కసారైనా చపాతీ తింటారు. కానీ ఇటీవల కాలంలో ఫిట్‌నెస్ విషయంలో శ్రద్ధ పెరిగిన చాలామంది ప్రజలు చపాతీ తినడం మానేస్తున్నారు. గోధుమల్లో గ్లూటెన్ అనే పదార్థం ఉంటుందని, ఇది ఆరోగ్యానికి హానికరమని కొందరు భావిస్తున్నారు. చపాతీ తినడం వల్ల బరువు పెరుగుతుందని, షుగర్ లెవెల్స్ పెరుగుతాయని కూడా నమ్ముతున్నారు. అయితే నిజంగా చపాతీ తినడం హానికరమా? హొలిస్టిక్ డైటీషియన్ డాక్టర్ గీతికా చోప్రా ప్రకారం.. గోధుమ అనేది ఒక సంక్లిష్ట కార్బోహైడ్రేట్. ఇది రోజంతా మీ శక్తి స్థాయిలను నిలకడగా ఉంచడంలో సహాయ పడుతుంది. శుద్ధి చేసిన పిండి లాంటి సాధారణ కార్బోహైడ్రేట్లు శక్తిని త్వరగా పెంచి, త్వరగా తగ్గిస్తాయి. కానీ గోధుమ రోటీలో ఉండే ఫైబర్ జీర్ణక్రియకు ఎంతో మేలు చేస్తుంది. మలబద్ధకం సమస్య ఉన్నవారికి ఇది చాలా ఉపయోగపడు తుంది. బరువు నియంత్రణ: చపాతీ త్వరగా కడుపు నిండిన భావన కలిగిస్తుంది. దీనివల్ల అతిగా తినడాన్ని తగ్గించుకోవచ్చు, తద్వారా బరువును నియంత్రించుకోవచ్చు. కండరాల పెరుగుదల: గోధుమల్లో కండరాల నిర్మాణానికి అవసరమైన ప్రోటీన్ ఉంటుంది. విటమిన్లు, ఖనిజాలు: ఇందులో విటమిన్ బి, ఐరన్, మెగ్నీషియం వంటి ముఖ్యమైన పోషకాలు ఉన్నాయి. ఇవి జీవక్రియ, రోగనిరోధక శక్తిని పెంచడానికి తోడ్పడతాయి. కొంతమందికి గ్లూటెన్ పడదు. అలాంటి వారికి చపాతీ తిన్న తర్వాత కడుపు ఉబ్బరం, అసిడిటీ, మలబద్ధకం వంటి సమస్యలు వస్తాయి. ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించి, గోధుమలకు బదులుగా రాగి, జొన్న వంటి గ్లూటెన్ రహిత పిండితో చేసిన రోటీలను తీసుకోవడం మంచిది. ఒకవేళ మీకు గ్లూటెన్ పడకపోతేనే గోధుమ రోటీని మానేయండి. మిగిలిన వారందరికీ గోధుమ రోటీ ఆరోగ్యానికి చాలా మంచిది. ఇందులో ఉన్న పోషకాలు మీ మొత్తం ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడతాయి.

## ఉదయం లేవగానే టీ తాగుతున్నారా?



మీలో చాలామందికి ఉదయం నిద్ర లేవగానే ఒక వేడి వేడి కప్పు టీ తాగే అలవాటు ఉంటుంది కదా? కానీ, ఈ అలవాటు మన ఆరోగ్యానికి చాలా నష్టం కలిగిస్తుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా ఖాళీ కడుపుతో నేరుగా టీ తాగడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. ఇది మీ జీర్ణవ్యవస్థను, జీవక్రియను దెబ్బతీస్తుంది, అసిడిటీ సమస్యలను పెంచుతుంది.అయితే, ఈ సమస్యకు ఒక సులభమైన పరిష్కారం ఉంది. అదేంటంటే... టీ తాగే ముందు ఒక గ్లాసు గోరువెచ్చని నీరు తాగడం. ఇలా చేయడం వల్ల టీలో ఉండే కెఫిన్ ప్రభావం శరీరంలో తగ్గుతుంది. అంతేకాకుండా, ఇది కడుపులోని ఆమ్లాన్ని పలుచబరిచి, టీ వల్ల వచ్చే కడుపు మంట, అసిడిటీ వంటి సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తుంది. కాబట్టి, రోజూ ఉదయం టీ తాగే అలవాటు ఉన్నవారు ఖచ్చితంగా ఈ చిట్కా పాటించడం మంచిది.టీ అనేది మంచి శక్తిని ఇచ్చే పానీయం. అయితే, దానిని సరైన పద్ధతిలో తీసుకోవడం చాలా ముఖ్యం. టీ తాగే ముందు నీరు తాగడం వల్ల కలిగే మరో ముఖ్యమైన ప్రయోజనం ఏమిటంటే, ఇది మన శరీరంలో అసిడిటీని నియంత్రిస్తుంది. ఇది ముఖ్యంగా అసిడిటీ సమస్యలతో బాధపడేవారికి ఎంతో మేలు చేస్తుంది. ఇలా చేయడం వల్ల టీలోని కొన్ని పదార్థాలు కడుపులో ప్రతికూల ప్రభావాన్ని చూపకుండా సహాయపడతాయి. కాబట్టి, ఇకపై మీరు టీ తాగడానికి ముందు ఒక గ్లాసు నీరు తాగడాన్ని ఒక అలవాటుగా చేసుకోండి. ఈ చిన్న మార్పు మీ జీర్ణక్రియను మెరుగుపరచడమే కాకుండా, మీ శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. ఉదయాన్నే ఆరోగ్యకరమైన అలవాటుతో మీ రోజును మొదలు పెట్టండి.!

## కిడ్నీలు పాడైపోయినప్పుడు కనిపించే లక్షణాలు




శరీరంలో పేరుకున్న వ్యర్థాలను సరైన విధంగా బయటకు పంపించడంలో లివర్ తరవాత కిడ్నీలదే కీలక పాత్ర. యూరిన్ ద్వారా మురికిని బయటకు పంపేస్తాయి మూత్ర పిండాలు.అంతే కాదు. రక్తాన్ని శుద్ధి చేయడంలోనూ, నీటి నిల్వను నియంత్రించడంలోనూ కిడ్నీలు ఎంతో బాగా పని చేస్తాయి. అయితే..కొన్ని సార్లు ఈ పని తీరులో మార్పులు చూస్తారు. అందుకు ముఖ్య కారణం ఇవి దెబ్బ తినడం. ఎప్పుడైతే కిడ్నీలు దెబ్బ తింటాయో అప్పటి నుంచి టాక్సిన్స్ బాడీలో పేరుకుపోతాయి. సరైన విధంగా మురికి బయటకు వెళ్లిపోదు. ఫలితంగా రకరకాల సమస్యలు వస్తాయి. కిడ్నీలు దెబ్బ తిన్నప్పుడు ప్రాథమికంగా కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. వాటిని సరైన విధంగా గమనించకపోతే సమస్య తీవ్రమవుతుంది. మరి ప్రాథమికంగా కనిపించే ఆ లక్షణాలేంటి. ఎలా వాటిని గుర్తించాలో తెలుసుకోండి.ఇందాకే చెప్పుకున్నట్టుగా కిడ్నీలు రక్తాన్ని ఫిల్టర్ చేసి, టాక్సిన్స్ ని బయటకు పంపుతాయి. వీటి పనే అది. ఎప్పుడైతే ఇందుకు అంతరాయం కలుగుతుందో అప్పుడే కిడ్నీలు ఫెయిల్ అయ్యాయని మెడికల్ పరిభాషలో చెబుతుంటారు. నిజానికి కిడ్నీలు ఉన్నట్టుండి పాడైపోవు. అనారోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, లైఫ్ స్టైల్ సరిగా లేకపోవడం, మసాలా ఫుడ్స్ అతిగా తినడం లాంటి కారణాల వల్ల మూత్రపిండాల పని తీరుపై ప్రభావం పడుతుంది. అధికంగా సాల్ట్, ప్రొటీన్ తీసుకున్నా ఇవే ఇబ్బందులు వస్తాయి. అయితే ఇంకొంత మంది విపరీతంగా స్మోకింగ్, డ్రింకింగ్ చేస్తుంటారు. వీటి వల్ల కిడ్నీలు చాలా త్వరగా డ్యామేజ్ అవుతాయి. ఇక నిద్రలేమి సమస్య కూడా కిడ్నీ డ్యామేజ్ కి దారి తీస్తుంది. సింపుల్ గా చెప్పాలంటే..ఇదో సైలెంట్ కిల్లర్. ఇక బీపీ, షుగర్ లాంటి వాటి కోసం మెడిసిన్ ఎక్కువ కాలం పాటు తీసుకోవడం వల్ల కూడా కిడ్నీలు దెబ్బ తినే ముప్పు ఉంటుంది. కిడ్నీలో రాళ్లు వస్తాయి. కిడ్నీలు పాడైపోయినప్పుడు కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. వాటిని సరైన విధంగా, సరైన సమయానికి గుర్తిస్తే ఎలాంటి ఇబ్బంది లేకుండా సమస్యల నుంచి బయటపడవచ్చు. ఇందులో ముఖ్యంగా కనిపించే మొట్టమొదటి లక్షణం ఏంటంటే..తరచూ యూరిన్ రావడం. ఎక్కువ సార్లు మూత్రం రావడం కిడ్నీలు పాడైపోయాయనడానికి సంకేతం. ముఖ్యంగా రాత్రి పూట తరచూ యూరినేషన్ వస్తుంది. ఇక మరో ముఖ్యమైన విషయం ఏంటంటే.. అంతకు ముందు రోజులతో పోల్చి చూస్తే మూత్రం చాలా తక్కువ క్వాంటిటీలో వస్తుంది. ఇది కూడా కిడ్నీ డ్యామేజ్ కి సంకేతమే. మూత్రంలో ఎక్కువగా నురగ, మరీ పసుపు పచ్చగా రావడం, రక్తం కనిపించడం లాంటి లక్షణాలు కూడా కిడ్నీలు పాడైపోయాయి అనడానికి సంకేతాలే. కిడ్నీలు సరైన విధంగా పని చేయకపోతే శరీరంలో మలినాలు పేరుకుంటాయి. ఇవి బయటకు వెళ్లకపోతే ఎన్నో సమస్యలు వస్తాయి. ముఖ్యంగా జీర్ణ సమస్యలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.ఎప్పుడైతే మూత్ర పిండాలు సరిగ్గా పని చేయవో అప్పుడు బాడీలో టాక్సిన్స్ పెరుగుతాయి. ఇవి నేరుగా జీర్ణ వ్యవస్థపై ప్రభావం చూపిస్తాయి. తరచూ వాంతులు, ఆకలి మందగించడం లాంటి లక్షణాలు కనబడతాయి. అంత కన్నా ముఖ్యంగా కనిపించే లక్షణం ఏంటంటే..మలబద్ధకం. ఒక్కసారి ఈ సమస్య మొదలైందంటే..అంత సులభంగా తగ్గదు. పైగా మలబద్ధకం కారణంగా ఇతరత్రా అనారోగ్యాలు కూడా తలెత్తుతాయి. ఇక మరో ముఖ్యమైన లక్షణం ఏంటంటే..ఎప్పుడైతే కిడ్నీలు సరిగ్గా పని చేయవో అప్పుడు బాడీలో ఉన్న అదనపు నీరు, ఉప్పు బయటకు వెళ్లడానికి వీలుండదు. సోడియం పెరిగే కొద్దీ అది కండరాల్లోకి చేరుకుంటుంది. ఎక్కువ రోజుల పాటు అలాగే నిల్వ ఉండడం వల్ల వాపులు వస్తాయి. ముఖ్యంగా చేతులు, కాళ్లలో ఈ వాపు కనిపించవచ్చు. ఉదయం పూట ఈ లక్షణం ఎక్కువగా కనబడుతుంది.కిడ్నీలు పాడైపోయినప్పుడు కనిపించే మరో లక్షణం విపరీతమైన నీరసం. సాధారణంగా మూత్ర పిండాలు ఎరిత్రోపొయిటిన్ అనే హార్మోన్ ని ఎక్కువగా ఉత్పత్తి చేస్తుంది. ఇది ఎర్ర రక్త కణాలను ఉత్పత్తి చేసేందుకు ఉపయోగపడే హార్మోన్. ఎప్పుడైతే కిడ్నీల పని తీరుపై ప్రభావం పడుతుందో అప్పుడు ఈ హార్మోన్ ఉత్పత్తి కాదు. ఫలితంగా..ఎర్ర రక్త కణాల సంఖ్య తగ్గిపోతుంది. ఇదే క్రమంగా అనీమియాకి దారి తీస్తుంది. అంటే..హిమోగ్లోబిన్ తగ్గిపోతుంది. ఎప్పుడైతే రక్తం తగ్గిపోతుందో అప్పుడు విపరీతంగా నీరస పడిపోతారు. చాలా మంది దీన్ని మామూలు నీరసంగానే చూస్తారు. కానీ..ఇలా తరచూ నీరసంగా అనిపిస్తోంది అంటే తప్పనిసరిగా అప్రమత్తం కావాల్సిన అవసరం ఉంటుంది. కిడ్నీలు పాడైపోయినప్పుడు వెన్ను నొప్పి కూడా వస్తుంది. కిడ్నీలో రాళ్లు రావడం, ఇన్ఫెక్షన్ , ఇన్‌ఫ్లమేషన్ కారణంగా ఇలా విపరీతంగా నొప్పి వస్తుంది. మూత్రంలో కూడా మార్పు వస్తే అప్పుడు వైద్యుడిని సంప్రదించడం అవసరం.



# సినిమా



## నన్ను ఎవడైనా గెలికితే అంతే!



'ది గర్ల్‌ఫ్రెండ్' సక్సెస్ మీట్ సందర్భంగా హీరో విజయ్ దేవరకొండ హాట్ కామెంట్ చేశారు. ఇండస్ట్రీలో తనను ఎవరైనా గెలికితే, మామూలుగా ఉండదని వార్నింగ్ ఇచ్చారు విజయ్ దేవరకొండ. వాళ్లకు రివర్స్‌గా తాను వ్యవహరిస్తానని హెచ్చరించారు. అయితే హీరోయిన్ రష్మిక తన లాగా కాదని, చాలా క్యూట్ అంటూ ప్రశంసించారు. 'ది గర్ల్‌ఫ్రెండ్' మూవీ సక్సెస్ మీట్ నిన్న జరుగగా స్పెషల్ గెస్ట్‌గా విజయ్ దేవర కొండ పాల్గొని మాట్లాడారు. కెరీర్ పీక్స్ లో ఉన్న సమయంలో 'ది గర్ల్‌ఫ్రెండ్' లాంటి కథలు ఎంచుకోవడం చాలా గొప్ప విషయమని వివరించారు. రష్మిక జర్నీని చూస్తే చాలా గర్వంగా ఉంటుందన్నారు. నిజ జీవితంలో కూడా ఆమె భూమా దేవినే అంటూ వ్యాఖ్యానించారు. ఎవరెన్ని మాటలు అన్నా కూడా, వాటిని లెక్కచేయదని తెలిపారు. వాటిని పట్టించుకోకుండా కెరీర్ పైన దృష్టి పెట్టి ముందుకు వెళుతుందని పొగిడారు విజయ్ దేవర కొండ. ఇక ఈవెంట్ ప్రారంభాని కంటే ముందు రష్మికను చూడగానే ఆమె చేతిపై కిస్ పెట్టారు విజయ్ దేవరకొండ. దీనికి సంబంధించిన ఫోటోలు, వీడియోలువైరల్‌గా మారాయి. దీంతో ఈ జంట త్వరలోనే పెళ్లి చేసుకోబోతుందని, అందుకే విజయ్ కిస్ ఇచ్చి హింట్ ఇచ్చినట్లు సోషల్ మీడియాలో కామెంట్లు పెడుతున్నారు.

## ఇది చాలా అరుదైన సినిమా..

దుల్కర్ సల్మాన్ మోస్ట్ ఎవైటెడ్ పీరియాడికల్ డ్రామా 'కాంత'. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్ కాగా.. రానా, సముద్రఖని కీలక పాత్రలు పోషిస్తున్నారు. దుల్కర్ సల్మాన్ 'వేఫేర్ ఫిలిమ్స్ ప్రైవేట్ లిమిటెడ్', రానా దగ్గుబాటి 'స్పిరిట్ మీడియా' సంయుక్తంగా నిర్మిస్తున్నారు. నవంబర్ 14న గ్రాండ్ థియేట్రికల్‌కి సిద్ధం అవుతున్న ఈ చిత్రంపై ఆసక్తికర కామెంట్స్ చేశాడు రానా. 'ఇది కంప్లీట్‌గా ఫిక్షనల్ కథ. ఇప్పుడు స్టూడియోలో ఏదైనా జరిగితే ఇమ్మీడియట్‌గా అందరికీ తెలిసిపోతుంది. కానీ ఇలాంటి కథలు చాలా జరిగాయి. చాలా తక్కువ మందికి తెలిసేవి. ఆ కాలం నుంచి ఇన్స్పిరేషన్ పొంది రాసిన కథ. ఇది ఒక ఇన్సిడెంట్ అని చెప్పలేం. డార్క్ సైడ్ ఆఫ్ గ్రేట్ పీపుల్ అని చెప్పొచ్చు. ఒక ఇద్దరు గొప్ప వ్యక్తులు వాళ్ళ ఆర్టిస్ట్ బ్రిలియన్స్ కోసం గొడవలు పడిన నేపథ్యం చాలా ఆసక్తికరంగా ఉంటుంది. 50%o% బ్యాక్ డ్రాప్‌ని ఎంచుకోవడానికి కారణం ఏంటంటే.. ఆ కాలంలో లిటరేచర్, మ్యూజిక్‌కి చాలా ఎక్కువ ప్రాముఖ్యత ఉండేది. ఈరోజు షార్ట్ కాంటెంట్‌లో ఉన్నాం.. ఏ మ్యూజిక్ ఏ సాహిత్యమైన ఒకే అన్ని సర్దుకుపోతున్నాం. కానీ ఆ కాలంలో అలా ఉండేది కాదు. పర్ఫెక్షన్ ఉండేది. ఆ టైంలో జరిగిన కథ అంటే తెలియని రొమాన్స్ వస్తుంది. కాంత నా కెరియర్లో చాలా స్పెషల్ ఫిలిం. ఇలాంటి సినిమాలు జీవితంలో ఒకేసారి వస్తాయి. ఇలాంటి ఎక్స్‌పీరియన్స్‌ని మళ్ళీ మళ్ళీ రీ క్రియేట్ చేయలేం. నేను కథ విన్న వెంటనే కచ్చితంగా సినిమా చేయాలనుకున్నాం. కాంత సినిమాని రియల్‌గా సెలబ్రేట్ చేసుకునేలా ఉంటుంది. ఇందులో ఉండే డ్రామా ఎమోషన్ అద్భుతంగా ఉంటాయి. ఇలాంటి సినిమా ఒకేసారి వస్తుందని భావిస్తున్నాను.



## ఎమోషనల్‌గా ఆకట్టుకునే సాంగ్




విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా నటిస్తున్న సినిమా 'సంతాన ప్రాప్తిరస్తు'. మధుర ఎంటర్‌టైన్మెంట్, నిర్వి ఆర్ట్స్ బ్యానర్స్ పై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మిస్తున్న ఈ మూవీకి సంజీవ్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నాడు. పాజిటివ్ ఎక్స్‌పెక్టేషన్స్ మధ్య ఈ సినిమా ఈ నెల 14న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. దీంతో ప్రమోషన్స్‌లో జోరు పెంచిన చిత్ర బృందం మూవీ నుంచి వరుస అప్డేట్స్ ఇస్తూ సందడి చేస్తున్నారు. ఇందులో భాగంగానే తాజాగా 'మరి మరి..' లిరికల్ సాంగ్ రిలీజ్ చేశారు. ఉమా వంగూరి లిరిక్స్ అందించిన ఈ పాటను సునీల్ కశ్యప్ కంపోజ్ చేశారు. ప్రముఖ సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్ పాడారు. 'మరి మరి నిన్ను వెతికేలా.. మరవదు ఓ క్షణమైనా.. మనసంతా నీ తలపులే.. ప్రతి చోటా నీ గురుతులే.. వేచా గడిచిన నిన్నల్లో.. వెతికా నడిచిన దారుల్లో.. వెలుగే విడిచిన నీడల్లో.. వదిలి వెళ్లిన జాడల్లో...' అంటూ ఎమోషనల్ బీట్‌తో సాగిన ఈ సాంగ్ ప్రజెంట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఇందులో.. వెన్నెల కిషోర్, తరుణ్ భాస్కర్, అభినవ్ గోమటం, మురళీధర్ గౌడ్, హర్షవర్ధన్, బిందు చంద్రమౌళి, జీవన్ కుమార్, సత్య కృష్ణ, తాగుబోతు రమేష్, అభయ్ బేతిగంటి, కిరీటి, అనిల్ గీల, సద్దామ్, రియాజ్, తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

## వైవిధ్యమైన కథ..

ఖుషి టాకీస్ పై నిర్మించిన 'సీత ప్రయాణం కృష్ణతో' సినిమా ఈనెల 14న రిలీజ్ కానుంది. రోజా భారతి, దినేష్, సుమంత్, అనుపమ తదితరులు నటించిన ఈ చిత్రానికి దేవేందర్ దర్శకుడు. ఈస్ట్ వెస్ట్ ఎంటర్టైన్మెంట్స్ ప్రెజెంటర్‌గా డా.రాజీవ్, డా. రోజా భారతి నిర్మించారు. సినిమా విడుదల నేపథ్యంలో హీరోయిన్ డా.రోజా భారతి మాట్లాడుతూ, 'నన్ను నమ్మి అందరూ ఈ సినిమా నాది అని అనుకుని పని చేసారు. కాబట్టే ఇవాళ రిలీజ్ వరకు రాగలిగాం. అందరు 14న మా సినిమాని చూసి ఆదరిస్తారని ఆశిస్తున్నాను' అని తెలిపారు. 'నాకు సినిమాలో అవకాశం ఇచ్చిన రోజా, రాజీవ్‌కి చాలా థ్యాంక్స్. వాళ్లిద్దరూ లేకపోతే ఈరోజు మేము ఇక్కడ ఇలా ఉండి మాట్లాడలేము. కచ్చితంగా మా సినిమా అందరిని ఎంటర్టైన్ చేస్తుందని నమ్ముతున్నాను' అని హీరో దినేష్ చెప్పారు. హీరోయిన్ రాఖి శర్మ మాట్లాడుతూ, 'ఈ చిత్రంలో రాధికా అనే క్యారెక్టర్‌లో నటించాను. నాకు ఈ రోల్ చాలా స్పెషల్' అని తెలిపారు. డా.రాజీవ్



మాట్లాడుతూ,'ఈ సినిమా మాకు చాలా సెంటిమెంట్. సినిమాలో నటించి, ప్రొడ్యూసర్‌గా డా. రోజా భారతి మాకు ఇచ్చిన సపోర్ట్ మరువలేనిది' అని చెప్పారు. 'మా సినిమాని అన్ని తానై మోసిన రోజా భారతికి ఎప్పుడూ రుణపడి ఉంటాను. ఓ డిఫరెంట్ కాన్సెప్ట్‌తో ఈ సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాం' అని డైరెక్టర్ దేవేందర్ అన్నారు.




## ప్రేమ జంట మధ్యలోకి పోలీస్ ఆఫీసర్ ఎంట్రీ

'కలర్ ఫోటో' ఫేమ్ సందీప్ రాజ్ దర్శకత్వంలో రాబోతున్న లేటెస్ట్ మూవీ 'మోగ్లీ'. రోషన్ కనకాల, సాక్షి మడోల్కర్ జంటగా నటిస్తున్న ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. షూటింగ్ కంప్లీట్ చేసుకున్న ఈ మూవీ నుంచి ఇప్పటికే వచ్చిన పోస్టర్స్, టీజర్, ట్రైలర్ మంచి రెస్పాన్స్‌ను సొంతం చేసుకోగా.. తాజాగా టీజర్ రిలీజ్ చేశారు మేకర్స్. 'కొన్ని కథలు చెప్పడానికే ఉంటాయి.. ఇది అనుభూతి చెందడానికి.. ఒక నిశ్శబ్ద ప్రేమకథలోని అత్యంత పెద్దా వార్‌ను అనుభవించడానికి సిద్ధంగా ఉండండి' అంటూ షేర్ చేసిన ఈ లో ప్రేమ కోసం ఎంత దూరమైనా వెళ్లే యువకుడిగా రోషన్ కనకాల కనిపించి మెప్పించాడు. ఇక అతడు ప్రేమించే అమ్మాయిగా సాక్షి మడోల్కర్ అలరించనుంది. ఇలా అడవి నేపథ్యంలో సాగే వీరి క్యూట్ ప్రేమ కథలో రావణుడి లాంటి ఓ పోలీస్ ఆఫీసర్ ఎంట్రీ ఇవ్వడం ఆసక్తిని క్రియేట్ చేసింది. ఈ క్రమంలోనే తనకు ఎదురయ్యే సమస్యలను హీరో ఎలా ఎదుర్కొంటాడు.. తన ప్రేమను ఎలా గెలిపించుకుంటాడు అనే దానిపై ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ నెలకొంది. మొత్తంగా ఈ టీజర్‌తో సినిమాపై మరింత హైప్ క్రియేట్ అయింది. కాగా.. భారీ అంచనాల మధ్య ఈ మూవీ డిసెంబర్ 12న రిలీజ్ అయ్యేందుకు సిద్ధంగా ఉంది.

## బుచ్చిబాబు మీద బాలీవుడ్ కన్ను


తెలుగు తమిళంలో ఎవరైనా దర్శకులు బ్లాక్ బస్టర్లు కొట్టినా, ఫేమ్ తెచ్చుకున్నా ఆటోమేటిక్‌గా బాలీవుడ్ కళ్ళలో పడటం సహజం. లేదంటే అట్లీతో షారుఖ్ ఖాన్ జవాన్ సాధ్యమయ్యేది కాదు. సుజిత్ ఒప్పుకోలేదు కానీ లేదంటే ఈ అవకాశం ఓజి కన్నా ముందు సుజిత్ కే వచ్చేది. కబీర్ సింగ్ చూశాకే సందీప్ రెడ్డి వంగా మీద నమ్మకం ఏర్పడి రన్బీర్ కపూర్ ప్రాణం పెట్టి యానిమల్ చేశాడు. షాహిద్ కపూర్ మన గౌతమ్ తిన్ననూరిని నమ్మి జెర్సీ చేసినా, రాజ్ కుమార్ రావు హిట్ డైరెక్టర్ శైలేష్ కొలనుతో చేతులు కలిపినా ఇదంతా సక్సెస్ మహాత్యమే. అయితే ఉప్పెన అయ్యాక బుచ్చిబాబు మీద హిందీ మేకర్స్ దృష్టి పడలేదు. కానీ ఇప్పుడు లెక్క మారుతోంది. పెద్దిలో చికిరి చికిరి సాంగ్ చేస్తున్న సెన్సేషన్, సినిమా మేకింగ్ గురించి లీకవుతున్న ఇన్ ఫుట్స్ అంతకంతా బుచ్చిబాబు రేంజ్ ని పెంచేస్తున్నాయి. దీంతో పలు ముంబై హ్యాండిల్స్ బుచ్చిబాబుకి షారుఖ్ ఖాన్ కు ముడిపెట్టి ఈ కాంబోలో ఒక మూవీ వస్తుందని, చైల్డ్ సెంటిమెంట్ ఆధారంగా రూపొందే ఈ సినిమా కోసం కింగ్ ఖాన్ విభిన్నమైన గెటప్స్ ట్రై చేస్తున్నాడని ఏదేదో వండి వారుస్తున్నారు. నిజానికి బుచ్చిబాబుకి ఇప్పుడు పెద్ది తప్ప వేరే ప్రపంచం లేదు. దాని పోస్ట్ ప్రొడక్షన్ పూర్తి చేసి ఫస్ట్ కాపీ చేతికి వచ్చేదాకా సరిగ్గా భోజనం కూడా చేసేలా లేదు. అంత కమిట్ మెంట్ తో కష్టపడుతున్నాడు. సో ఎలా చూసుకున్న బుచ్చిబాబు నెక్స్ట్ మూవీ గురించి అప్పుడే ఒక అంచనాకు రాలేం. అయితే మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ ద్వారా తన వర్కింగ్ స్టైల్ తెలుసుకున్న మహేష్ బాబు ఏదైనా కథ ఉంటే చెప్పమని అంగీకారం తెలిపాడని ఇన్ సైడ్ టాక్ ఉంది.



అక్కినేని నాగార్జున, ఆర్జీవీ కాంబోలో 1998లో వచ్చిన 'శివ' బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచింది. అమల హీరోయిన్‌గా జేడీ చక్రవర్తి కీలక పాత్రలో నటించిన ఈ సినిమా అప్పట్లో బాక్సాఫీసు వద్ద పెద్ద సంచలనమే సృష్టించిన విషయం తెలిసిందే. మళ్లీ 36 ఏళ్ల తర్వాత 'శివ' మూవీ నవంబర్ 14న రీరిలీజ్ కాబోతుంది. ఇప్పటికే ఇందులోంచి వచ్చిన ట్రైలర్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇక

## నా స్వార్థంతో నిన్ను ప్రమాదంలో పెట్టా..

ప్రమోషన్స్‌లో భాగంగా ఆర్జీవీ, నాగార్జున పలు విషయాలను ప్రేక్షకులతో పంచుకుంటున్నారు. తాజాగా, రామ్ గోపాల్ వర్మ 'శివ'లో నటించిన నటికి క్షమాపణలు చెప్తూ పెట్టిన పోస్ట్ వైరల్‌గా మారింది. ఆమె మరెవరో కాదు.. శివ మూవీ చైల్డ్ ఆర్టిస్ట్ సుష్మ. ఇందులో భవానీ గ్యాంగ్.. నాగార్జునను చేజ్ చేస్తుండగా.. నాగ్ ఓ చిన్న పాపను సైకిల్‌పై కూర్చో బెట్టుకుని వేగంగా వెళ్తాడు. ఇంతలో యాక్సిడెంట్ అయి ఇద్దరు కిందపడి పోతారు. అప్పుడు పాపను ఎత్తుకుని నాగ్ గూండాలతో ఫైటింగ్ చేస్తుం టాడు. అయితే ఆ పాప ఈ సినిమాలో నాగ్ అన్న కూతురిలా నటిస్తుంది. ఇక ఈ సీన్ గురించి ఆర్జీవీ తన తప్పు 36ఏళ్ల తర్వాత అర్థమైనట్లు తెలుపుతూ.. "సైకిల్ చేజ్ సీన్‌లో ఉంది ఈ చిన్నారే సుష్మ. అమెరికాలో ఏఐ, కాగ్నిటివ్ రీసెర్చ్ చేస్తోంది. సుష్మ నువ్వు చాలా సాహసోపేతమైన సన్నివేశాల్లో నటించావు. అప్పుడు ఆ సీన్ ఎంత ప్రమాదమనేది నాకు అర్థం కాలేదు. దర్శకుడిగా నా స్వార్థం చూసుకుని ఇలాంటి ప్రమాదకరమైన షాట్స్ తీశాను. అందుకు నన్ను క్షమించు. నాకు నా తప్పు ఇప్పుడు అర్థం అయింది" అని రాసుకొచ్చాడు. అలాగే చైల్డ్ ఆర్టిస్ట్‌గా చేసిన సుష్మ ఇప్పుడెలా ఉందో ఫొటోను కూడా షేర్ చేశాడు. ఇక అది చూసిన నెటిజన్లు షాక్ అవుతూ.. నువ్వు క్షమాపణలు చెప్పావా అని పలు రకాలుగా కామెంట్లు పెడుతున్నారు.



# ఉట్కూర్ పి హెచ్ సి ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**మక్తల్ నవంబర్ 12(వృదయం ప్రతినిధి)** ఊట్కూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో 24 గంటల పాటు ఎవరెవరు విధులు నిర్వహిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో జరిగిన ప్రసవాలు, స్టాఫ్, మందుల సరఫరా తదితర విషయాలపై ఆరా తీశారు. సెప్టెంబర్ లో 9, గత నెలలో 6 ప్రసవాలు జరిగాయని వైద్య సిబ్బంది కలెక్టర్ కు తెలిపారు. ఆస్పత్రి పరిధిలో ఉన్న సబ్ సెంటర్లు ఎన్ని ఉన్నాయని, టీబీ పరీక్షల నిర్వహణ ఎలా ఉందని కలెక్టర్ ప్రశ్నించారు. ప్రసవాల గదికి తలుపు లేకపోవడం గమనించిన కలెక్టర్ వైద్య సిబ్బంది పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని చూసుకోవాలని, అజాగ్రత్త, అలసత్వం వద్దని సున్నితంగా హెచ్చరించారు. అనంతరం శిథిలావస్థలో ఉన్న పాత పీ హెచ్ సీ భవనాన్ని చూసిన కలెక్టర్ భవన నాణ్యత ను ఆర్ అండ్ బి, పంచాయత్ అధికారులతో ధ్రువీకరింపజేసి ఆ భవనాన్ని కూల్చి వేయాలని వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ రామచంద్రనాయక్, తహసిల్దార్ చింత రవి, ఎంపీడీవో కిషోర్ కుమార్, ఎంపీఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# 15న జరిగే బస్సు జాతరను జయప్రదం చేయండి

-సిపిఐ పార్టీ 100 ఏండ్ల ముగింపు సభను విజయవంతం చేయండి...

-సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్

**రామకృష్ణాపూర్/నవంబర్ 13 (వృదయం ప్రతినిధి)** సిపిఐ పార్టీ 100 ఏండ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో డిసెంబర్ 26న ఖమ్మం లో జరిగే ముగింపు సభను జయప్రదం చేయాలని, ఈనెల 15 న చోడే ఘాట్ నుండి భద్రాచలం వరకు జరిగే బస్సు జాతరను జయప్రదం చేయాలని మంచిర్యాల జిల్లా సిపిఐ కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ కోరారు. జోడేఘాట్ నుండి భద్రాచలం వరకు జరిగే బస్సు జాతర కరపత్రాలను రామకృష్ణాపూర్ పట్టణంలోని సిపిఐ పార్టీ కార్యాలయంలో విడుదల చేశారు. అనంతరం రామడుగు లక్ష్మణ్ మాట్లాడారు. బస్సు జాతర కార్యక్రమానికి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సిపిఐ జాతీయ మాజీ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి హాజరవుతారని తెలిపారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ ,రాష్ట్ర ప్రచార కార్యదర్శి మారుపాక అనిల్, ఏ ఐ ఎస్ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మణికంఠ రెడ్డి తెలంగాణ ప్రజానాట్యమండలి కళాకారులు బస్సు జాతర వెంట ఉంటారని తెలిపారు. శతజయంతి ఉత్సవాలు, ఖమ్మంలో జరిగే ముగింపు భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని అన్ని వర్గాల ప్రజలను కోరుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు ఇప్పకాయల లింగయ్య జిల్లా సమితి సభ్యులు మిట్టపల్లి పౌలు, మనం సత్యనారాయణ, మామిడి గోపి, రాములు, దేవానంద్, చందర్, శంకర్, మురళి తదితరులు పాల్గొన్నారు.



# నేటి నుండి 20వ తేదీ వరకు 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

**జయశంకర్ భూపాలపల్లి నవంబర్ 13 (వృదయం ప్రతినిధి):** నేటి నుండి ఈనెల 20వ తేదీ వరకు 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు భూపాలపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి టి. శ్రీలత గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రంథాలయ జాతీయ వారోత్సవాలను పురస్కరించుకొని కళాశాల పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం, రంగోలి, పాటలు పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 14 న జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభ వేడుకలతో పాటు బాలల దినోత్సవం ఉత్తమ గ్రంథ పాలకులు పాఠకులకు సన్మాన కార్యక్రమం, 15 న పాఠశాల కళాశాల విద్యార్థిని విద్యార్థులకు పుస్తక ప్రదర్శన, 16 న గ్రంథాలయ సందర్శన, సెమినార్ కవి సమ్మేళనం, 18న వ్యాసరచన, చిత్రలేఖన,పోటీ, 19న రంగోలి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా పోటీలో పాల్గొనే ఆసక్తి కలిగిన విద్యార్థిని విద్యార్థులు పోటీలు జరుగుతేదీలలో అరగంట ముందు తమ పేర్లను కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. పోటీలలో పాల్గొని విజేతలైన వారికి సంబంధించిన ప్రశంసా పత్రం బహుమతులు అందిస్తామని తెలిపారు.

# నియోజకవర్గంలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ సుడిగాలి పర్యటన



**దమ్మపేట నవంబర్ 13 నవంబర్ (వృదయం ప్రతినిధి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వ రావుపేట నియోజకవర్గం లోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే జారే సుడి గాలి పర్యటన చేశారు ఆదినారా యణ సుడిగాలి పర్యటన చేశారు ఈ కార్యక్రమంలో ముందుగా గ్రామాల్లో ఈ కార్యక్రమంలో గండుగులపల్లి జెడ్ పి హెచ్ ఎస్ పాఠశాలను సందర్శించి, యువ భారత్ శక్తీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా, "చదువు వల్లనే నేను ఎమ్మెల్యే అయ్యాను అని చెప్పారు చదువుతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చుఅని చెప్పారు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని కష్టపడి చదవాలని విద్యార్థులకు సూచించారు. గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో దమ్మపేట మండలానికి చెందిన లబ్ధిదారులకు ?11,24,500 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి ( సీఎంఆర్ఎఫ్ ) చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. "ప్రజల బాధలో నేను కూడా భాగమే, ప్రజలకు సహాయం అందించడం నా బాధ్యత," అని చెబుతూ, పేద కుటుంబాలకు ఉపశమనం అందించడానికి తాను ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని తెలిపారు. తరువాత అన్నపురెడ్డిపల్లి మండలం కట్టుగూడెం,నరసాపురం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి, రైతులతో పంట పరిస్థితుల గురించి చర్చించారు. "రైతు చెమట చుక్క విలువైనది, పంట కొనుగోలు త్వరితగతిన జరగాలి, ఎక్కడా ఆలస్యం ఉండకూడదు," అని అధికారులకు సూచిస్తూ, రైతు సమస్యలపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వినాయకపురం, వేదంతపురం గ్రామాలలో కొత్తగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ళను ప్రారంభించారు. ప్రతి అర్హుడికి ఇందిరమ్మ గృహం కట్టించడమే మన కాంగ్రెస్ ప్రభుత్వం ధ్యేయం అని చెబుతూ, పేదల ఆత్మగౌరవాన్ని పెంచే లక్ష్యంతోనే ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తుందని తెలిపారు అశ్వారావుపేట క్యాంపు కార్యాలయంలో అశ్వారావుపేట మండలానికి చెందిన లబ్ధిదారులకు ?5,21,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. సేవలోను, అభిరుదిలోను రాజకీయాలు సబ్బాబు కాదు రాజకీయాలు పదవికి కాదు, సేవకే," అని పేర్కొంటూ, ప్రజల కష్టాల్లో తాను ఎప్పుడూ అండగా ఉంటానని, తన తలుపు ఎప్పుడూ తెరిచే ఉంటుందని స్పష్టం చేశారు. అదేవిధంగా అశ్వారావుపేట మండల కేంద్రంలోని మినీ స్టేడియం మరియు రోడ్ల విస్తరణ పనులను పరిశీలించారు. యువత క్రీడల్లో ముందుకు రావడానికి స్టేడియం, ట్రాఫిక్ సమస్యల తగ్గింపు కోసం రోడ్ల విస్తరణను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పర్యటన పొడవునా ప్రతి గ్రామంలో ప్రజలు, యువత, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. డప్పులు, పూలతో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ప్రజల సమస్యలను విని వెంటనే స్పందించే ఆయన శైలి ప్రజల్లో మరింత విశ్వాసాన్ని, ఆశను నింపింది. ఈ కార్యక్రమలో మండల అధ్యక్షులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు, గ్రామ అధ్యక్షులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, అధికసంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# కటింగులు లేకుండా ధాన్యం కొనుగోలు ప్రారంభం

## 48 గంటల్లో రైతుల ఖాతాల్లోకి డబ్బులు



**పెద్దపల్లి జిల్లా: నవంబర్ 13 (వృదయం) ప్రతినిధి:** కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని మీర్జంపేట, వెన్నంపల్లి గ్రామాల్లో గురు వారం రోజున ఐకేపీ, సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయ కులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ రమణ రావు మాట్లాడుతూ, తాను ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుండి ఇది ఐదోసారి ధాన్యం కొనుగోళ్లు జరుపుతున్నామని తెలిపారు. ఎలాంటి కటింగులు లేకుండా కొనుగోళ్లు పూర్తి చేస్తామని చెప్పారు. రైతులు వడ్లను ఆరబెట్టి తేమ శాతం 17 లోపు ఉండేలా చూడాలని సూచించారు. వడ్లను అమ్మిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లోకి డబ్బులు జమ అవుతాయని తెలిపారు. రైతులు ట్రక్ షీట్లు పొందిన తర్వాత ఇండ్లలోనే ఉండవచ్చని, రైస్ మిల్లులకు వెళ్లాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. సెంటర్లలో ఎలాంటి సమస్యలు ఎదురైన వెంటనే తమను నేరుగా సంప్రదించాలని రైతులను కోరారు.

# సీపీఐ రాష్ట్ర బస్సు జాత ప్రారంభోత్సవాన్ని జయప్రదం చేయండి

## సీపీఐ జిల్లా కార్యదర్శి బి ఆంజనేయులు




**గద్వాల నవంబర్ 13 (వృదయం ప్రతినిధి)** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ వందేళ్ల సందర్భంగా గద్వాల నుంచి నిర్వహించే రాష్ట్ర బస్సు జాతాను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ విజ్ఞప్తి చేసింది.సిపిఐ పార్టీ జిల్లా కార్యాలయంలో ఈరోజు మీడియా సమావేశం ఏర్పాటు చేసిన సిపిఐ జిల్లా కార్యదర్శి బి.ఆంజనేయులు మాట్లాడారు. ఈ సందర్భంగా గద్వాలలో ఈనెల 15న నిర్వహించే సిపిఐ రాష్ట్ర బస్సుజాతను జయప్రదం చేయాలని, జాత ప్రారంభోత్సవానికి సిపిఐ జాతీయ కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ పల్లా వెంకట్ రెడ్డి గారు, సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బాల నరసింహులు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై జాతను ప్రారంభిస్తారని జిల్లా కార్యదర్శి బి.ఆంజనేయులు తెలిపారు. ఈ దేశంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఏర్పడి వందేళ్లు అవుతున్న సందర్భంగా పెద్ద ఎత్తున ఉత్సవాలు నిర్వహిస్తూ ఈ దేశం కోసం ఈ దేశంలో ఉండే సామాన్య పేద ప్రజల కార్మికుల రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటం చేసిన సంఘటనలను త్యాగాలను విజయాలను నెమరు వేసుకుంటూ భవిష్యత్తులో ప్రజా ఉద్యమాలు నిర్మించేందుకు అలాగే విచ్ఛిన్నకర శక్తులకు బుద్ధి చెప్పి దేశాన్ని సమైక్యంగా నిర్మించేందుకు పార్టీని బలోపేతం చేసేందుకు ఈ యొక్క బస్సు జాత కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని అలాగే వందేళ్ళ సిపిఐ ఉత్సవాలలో భాగంగా డిసెంబర్ 26వ తేదీన తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లాలో ఐదు లక్షల మంది తో భారీ బహిరంగ సభను నిర్వహించడం జరుగుతుందని ఈ యొక్క సభకు ప్రపంచ దేశాల నుంచి ఇతర రాష్ట్రాల నుంచి కమ్యూనిస్టు మేధావులు హాజరవుతారని పేర్కొన్నారు.

కావున వందేళ్ల ఎర్రజెండా పోరాట చరిత్రను చాటి చెప్పేందుకు సిపిఐ రాష్ట్ర బస్సు జాతలను నిర్వహించ తలపెట్టిన సందర్భంగా ఈ నెల 15వ తేదీన జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమానికి కార్మికులు రైతులు ప్రజలు పెద్ద ఎత్తున హాజరు కావాలని పిలుపునివ్వడం జరిగింది. దీని విజయవంతానికి సిపిఐ పార్టీ కార్యకర్తలు ప్రజాసంఘాల నాయకులు సీరియస్గా కృషి చేయాలని కోరారు నేడు ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిన సందర్భంగా ప్రజాస్వామ్యాన్ని, దేశాన్ని సగర్వంగా సమైక్యంగా నిలిపేందుకు ఎర్రజెండా నాయకత్వంలో సిపిఐ ఆధ్వర్యంలో మరో పోరాటానికి సిద్ధం కావాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు ఈ యొక్క మీడియా సమావేశంలో సిపిఐ జిల్లా కార్య వర్గ సభ్యులు కామ్రేడ్ రంగన్న కామ్రేడ్ ఆశన్న జిల్లా సమితి సభ్యులు ప్రవీణ్ పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కార్తీక మాస వన భోజనానికి పద్మశాలి కులస్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలి..

## -పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షులు వనం సత్యనారాయణ



**రామకృష్ణాపూర్/నవంబర్ 13 (వృదయం ప్రతినిధి)** క్యాతన్ పల్లి మున్సిపాలిటీ పరిధిలోని పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గాంధారి వనంలో నేడు జరిగే కార్తీక మాస వనభోజనాల కార్యక్రమానికి పద్మశాలి సంఘం సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని వనభోజన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షులు వనం సత్యనారాయణ కోరారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు వనం సత్యనారాయణ మాట్లాడారు. వనభోజనం సందర్భంగా ఉచిత వివాహ పరిచయ వేదిక కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని సాంస్కృతిక కార్యక్రమాలు పాటల పోటీలు వినోద కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, పద్మశాలి సంఘ సభ్యులు కుటుంబ సమేతంగా వచ్చి వనభోజన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఆడేపు తిరుపతి, సంయుక్త కార్యదర్శి వేముల అశోక్, ఆర్గనైజర్ సెక్రటరీ కొండ కుమార్, స్టీరింగ్ కమిటీ సభ్యులు ఆడెపు లక్ష్మణ్, సంతోష్, సారయ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదువుతూ లక్ష్యసాధనకు కృషి చేయాలి

## ట్రిపుల్ ఐటీ ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**మహబూబ్ నగర్ నవంబర్ 12(వృదయం ప్రతినిధి)** జిల్లాకు తలమానికంలా రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ట్రిపుల్ ఐ.టి) నిలువనుందని జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి అన్నారు. గురువారం కలెక్టర్ స్వయంగా ట్రిపుల్ ఐటీని సందర్శించి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇక్కడ చదివే విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను గురించి, భోజన వసతి, విద్యా బోధన, ప్లే గ్రౌండ్, కల్చరల్ యాక్టివిటీస్ గురించి అడిగి తెలుసుకున్నారు. మెస్ లో వంటగదికి వెళ్లి వంటకాలను సైతం పరీక్షించారు. నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. ప్రతీరోజు విద్యార్థులకు అందిస్తున్న మెనూ వివరాలను కనుక్కున్నారు. ఆ తరువాత తరగతి గదులను సందర్శించారు. విద్యార్థుల సమస్యలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ యేడాది ట్రిపుల్ ఐటీలో చేరిన విద్యార్థుల్లో ఎంతమంది ప్రభుత్వ పాఠశాలల నుండి వచ్చింది, వారిలో ఎంతమంది తెలుగు మీడియం బ్యాక్ గ్రౌండ్ నుండి వచ్చిన విషయాన్ని తెలుసుకున్నారు. ఈ ప్రథమ బ్యాచ్ బాగా చదివితే తరువాత వచ్చే బ్యాచ్ లకు ఆదర్శంగా ఉంటుందన్నారు. ఆ తదనంతరం విద్యార్థులతో వివిధ అంశాలపై ముచ్చటించారు. మొబైల్ ఫోన్ల వల్ల కలిగే దుష్ప్రయోజనాలను గురించి వివరించారు. సమయం విలువను గుర్తు చేస్తూ ప్రణాళిక బద్ధంగా చదవాలని, లక్ష్య సాధన కోసం కృషి చేయాలని కలెక్టర్ విద్యార్థులకు ఉద్బోధించారు. వీలైనంత త్వరలోనే స్పోర్ట్స్ క్లబ్, కల్చరల్ క్లబ్ లను ఏర్పాటు చేయాలని ప్రిన్సిపాల్ గారికి సూచించారు.మంచిపుస్తకాలు, మ ప్రోత్సాహాన్నిచ్చే సినిమాల పేర్లు చెబుతానన్నారు. వాటిని ప్రాజెక్టర్ ద్వారా పిల్లలకు ప్రదర్శించాలని కలెక్టర్ కోరారు. ప్లే గ్రౌండ్ శుభ్రం కొరకు మున్సిపల్ అధికారులను ఆదేశిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ తో పాటు అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వాన్ని ప్రజలకే అంకితం చేసాం, ప్రజలకే జవాబుదారీగా ఉంటాం

ఐదు సంవత్సరాల్లో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మారుస్తాం: మల్లు భట్టి విక్రమార్క డిప్యూటీ సీఎం



**మధిర, నవంబర్ 13 (వృదయం ప్రతినిధి)** ప్రజలకు ఇచ్చిన మాట మేరకు ప్రభుత్వాన్ని ప్రజలకే అంకితం చేసాం, ప్రజలకే జవాబుదారీగా ఉంటాం అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. గురువారం ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం లోని ముదిగొండ మండలంలో కాకతీయ నాటి శివాలయం పునర్నిర్మాణ కార్యక్రమంలో భాగంగా స్థానికంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. పది సంవత్సరాలు రాష్ట్రాన్ని పాలించిన వారు తాము లేకపోతే కరెక్టే ఉండదు రాష్ట్రం అంధకారమవుతుందని అన్న విషయాన్ని గుర్తు చేశారు.ఈ రాష్ట్రంలో కరెంటు ఉత్పత్తి చేసింది రైతులకు ఉచితంగా ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వాలే అని అన్నారు. 200 యూనిట్లు ఉచిత విద్యుత్తు ఇస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వమే అని వివరించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఎంత త్వరితగతిన ఇల్లు నిర్మించుకుంటే అంత వేగంగా బిల్లులు మంజూరు చేసుకుంటూ పోతాం అన్నారు. ఎన్నికలకు ముందు తాను చేపట్టిన పీపుల్స్ పాదయాత్రలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అనేక మందిని కలిసి మాట్లాడినట్టు తెలిపారు. ఇల్లు లేని పేదలు 10 సంవత్సరాల పాటు టిఆర్ఎస్ పాలనలో ఎదురుచూసి కళ్ళు కాయలు కాసి అలసిపోయామని ప్రజలు తన చేయి పట్టుకొని తెలిపిన విషయాన్ని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గుర్తు చేశారు. అధికారంలోకి రాగానే రాష్ట్రవ్యాప్తంగా ఇల్లు లేని వాళ్ళందరికీ ఇల్లు నిర్మిస్తున్నాం అన్నారు. ఆనాడు పాదయాత్రలో ఇచ్చిన మాట మేరకు ముదిగొండ మండలానికి చెందిన ప్రియాంకకు ఇల్లు కేటాయించామని తెలిపారు. ఒకటి కాదు రెండు కాదు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మొదటి దశలో 3500 చొప్పున నాలుగున్నర లక్షల ఇళ్లు నిర్మిస్తున్నాం అని డిప్యూటీ సీఎం వివరించారు. మన బిడ్డల భవిష్యత్తు మన భవిష్యత్తు వారి భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు విద్యారంగానికి పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తున్నాం అన్నారు. మన బిడ్డలు ప్రపంచంతో పోటీపడేలా అధికారంలోకి రాగానే బహిరంగ మార్కెట్లో పెరిగిన ధరల ప్రకారం మెస్ చార్జీలు పెంచేందుకు కమిటీ వేసి 20% డైట్, 200% కాస్మోటిక్ చార్జీలు పెంచామని తెలిపారు. ప్రపంచీకరణ జరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో చదువుకునే ప్రతి బిడ్డ ప్రపంచంతో పోటీపడే విధంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒకటి చొప్పున నిర్మిస్తున్నాం అన్నారు. మహిళలంతా ఆత్మగౌరవంతో బతకాలని వడ్డీ లేని రుణాలు అందిస్తున్నాం, ఐదు సంవత్సరాల్లో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మారుస్తాం అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ఇందిరా మహిళా క్రాంతి పథకాన్ని గత పది సంవత్సరాలు పరిపాలించిన వారు పూర్తిగా ఎత్తివేశారు కానీ మహిళల సంక్షేమమే లక్ష్యంగా పనిచేసే ఇందిరమ్మ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తిరిగి వడ్డీ లేని రుణాల పథకాన్ని ప్రారంభించామన్నారు. నియోజకవర్గంలోని ఒక్కొక్క మహిళకు రెండు గేదలు పంపిణీ చేసి దేశంలోనే ప్రతిష్టాత్మక డెయిరీనీ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. దశలవారీగా గేదెల కొనుగోలు కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. దేశం అంతా మధిర నియోజకవర్గానికి రావాలి ఇక్కడ మహిళలు నిర్వహించే డెయిరీ నీ సందర్శించాలి అన్నారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షను మన్నించి పార్లమెంట్లో బలం లేకపోయినా యూపీఐ చైర్మన్ సోనియా గాంధీ ఇతర పార్టీలతో మాట్లాడి ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేయించారు అని డిప్యూటీ సీఎం వివరించారు. టిఆర్ఎస్ పాలకులు గత పది సంవత్సరాలు అధికారంలో ఉండి గ్రూప్ వన్, టు పరీక్షను నిర్వహించలేకపోయారు అని ఎద్దేవా చేశారు. ఫలితంగా పోటీ పరీక్షలకు సిద్ధమైన యువత వయసు కూడా అయిపోయి పోగు చేసి పిల్లల కోసం పంపించిన తల్లిదండ్రులు ఆవేదనతో మిగిలిపోయారని గుర్తు చేశారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రూప్ వన్ పరీక్షలు నిర్వహించడమే కాదు ఎన్ని అడ్డంకులు ఎదురైనా నియామక పత్రాలు సైతం అందించాము అన్నారు. గ్రూప్ 2 నియామకాలు జరిపి పత్రాలు సైతం అందించాము అని తెలిపారు. గత పాలకులు 10 సంవత్సరాల పాటు రేషన్ కార్డులు ఇవ్వలేకపోయారు, రేషన్ కార్డుల్లో మార్పులు చేర్పులు చేయలేకపోయారు కానీ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే అర్హులైన అందరికీ రేషన్ కార్డులు పంపిణీ చేశామని తెలిపారు. ఎక్కడ ఉన్న ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తాను, మధిర నియోజకవర్గ ప్రజలు వేసిన ప్రతి ఓటుకు గౌరవం తీసుకువస్తాను అన్నారు. మధిర ప్రజల ఇంటి బిడ్డగా రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖలకు సంబంధించిన జిల్లా ఉన్నతాధికారులు, ఆయా మండలాల కాంగ్రెస్ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

# సజావుగా పత్తి కొనుగోలు చేయాలి

## జిల్లా కలెక్టర్ శిక్త పట్నాయక్



**నారాయణపేట నవంబర్ 12 (వృదయం ప్రతినిధి)** జిల్లాలోని జిన్నింగ్ మిల్లులలో గల సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సజావుగా పత్తి కొనుగోళు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచిం చారు. గురువారం ఆమె నారాయణపేట మండ లం లింగంపల్లి గ్రామ సమీపంలో గల భాగ్య లక్ష్మి కాటన్ మిల్ కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. కొనుగోలు కేంద్రానికి రైతులు తీసుకువచ్చిన పత్తిని పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలో ఉన్న మౌలిక వసతి సదుపాయాలను పరిశీలించి రైతులతో మాట్లా డారు. అమ్మకానికి తీసుకొచ్చిన పత్తి రైతుతో మాట్లాడి పత్తిని మిల్కు ఎలా తీసుకొచ్చారని ప్రశ్నించగా కపాస్ యాప్ ద్వారా స్లాట్ ను బుక్ చేసుకున్నానని, గురువారం స్లాట్ ఉండటంతో మిల్లుకు పత్తిని తీసుకుని వచ్చా నని ఆ రైతు కలెక్టర్‌కు తెలిపారు. రైతులకు ఇబ్బం ది కాకుండా కొనుగోలు చేపట్టాలని, ప్రతిరోజు కొనుగోలు వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయా లని, రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోలు చేప ట్టాలని యాజమాన్యానికి సూచించారు. అనంతరం కొనుగోలు ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలోని కాంటాను, డంపింగ్‌లను చూశారు. ఈకార్యక్రమంలో మార్కెట్ కమిటీ కార్యా లయ కార్యదర్శి,సూపర్ వైజర్, సీ సీ ఐ అధికా రులు, మిల్ యజమాని, రైతులు పాల్గొన్నారు.

# నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలి

## జిల్లా కలెక్టర్




**నారాయణపేట నవంబర్ 12(వృదయం ప్రతినిధి)** నిర్దేశించిన లక్ష్యాలను నెలాఖరు నాటికి సాధించాలని, ప్రతి మండలంలో లక్ష్యాలను అధిగమించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో స్త్రీ నిధి రివ్యూ కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో స్వయం సహాయక సంఘాలపై అప్పు నిలువ 74.5 కోట్లు ఉండగా 9 కోట్ల 76 లక్షలు బకాయిలు ఉన్నాయని నవంబర్ నెల చివరి వరకు బకాయి మొత్తం వసూలు చేసి జిల్లా రికవరీని 90 శాతానికి పెంచాలని ఏ పీఎం, సీసీ లను ఆదేశించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 40 కోట్లు రుణాలు పంపిణీ చేయాల్సి ఉండగా ఇప్పటివరకు 22.68 కోట్లు పంపిణీ చేశారనీ, మిగతా మొత్తాన్ని తొందరగా పూర్తి చేయాలన్నారు. లోన్ బీమా, ప్రమాద బీమా క్లైమ్‌లను వారంరోజుల్లో పూర్తి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గ్యాంగ్వర్, డి ఆర్ డి ఓ మొగు లప్ప, స్త్రీ నిధి జోనల్ మేనేజర్ శ్రీనివాసులు, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు అరుంధతి, డీ పీ వో సుధా కర్ రెడ్డి, స్త్రీనిధి జిల్లా రీజినల్ మేనేజర్ తిరుప తయ్య, డిపిఎంలు, ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

# రికార్డులను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్



**జన్నారం, నవంబర్ 13(వృదయం విలేకరి)** జన్నారం మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో పలు రికార్డులను మంచిర్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రయ్య తనిఖీ చేశారు. గురు వారం మధ్యాహ్నం ఆయన జన్నారం పట్టణం లో గల ఎమ్మార్వో కార్యాలయాన్ని సందర్శించి భూభారతి తదితర రికార్డులను పరిశీలించి అధికారులతో మాట్లాడారు.అనంతరం రైతులు, ప్రజా సమస్యలను అధికారుల నుండి అడిగి తెలు సుకున్నారు. ప్రజల నుంచి వచ్చే ఆర్జీలను స్వీక రించి సమస్యలను త్వరగా పరిష్కరించాలన్నారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రాజమనోహర్ రెడ్డి,సిబ్బంది ఉన్నారు.

# పేటలో కోర్టు విధుల బహిష్కరణ



**నారాయణపేట నవంబర్ 12(వృదయం ప్రతినిధి)** నిర్మల్ జిల్లా కోర్టులో న్యాయవాది పై కానిస్టేబుల్ దాడి చేయడాన్ని నిరసిస్తూ గురువారం నారాయణపేట జిల్లా కోర్టులో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు విధులను బహి ష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్మల్ కోర్టులో న్యాయవాది అశోక్ పై కానిస్టేబుల్ దాడి చేయడమే కాకుండా కారును ధ్వంసం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు.ఇప్పటికైనా ప్రభుత్వం న్యాయవాదుల రక్షణ చట్టం చేయాలని డిమాండ్ చేశారు.న్యాయవాది పై దాడి చేసిన కానిస్టేబుల్ ను కఠినంగా శిక్షించాలని కోరారు.

# శివసేన, ఎన్సీపీ పార్టీలు ఎవరివో తేల్చనున్న 'సుప్రీం'!

మహారాష్ట్ర రాజకీయాలను కుదిపేస్తున్న రెండు కీలక ప్రశ్నలకు త్వరలోనే సమాధానం లభించనున్నది. రెండు ప్రధాన పార్టీలైన శివసేన, ఎన్సీపీ పార్టీ నేతల మధ్య విభేదాలతో రెండువర్గాలుగా చీలిపోయిన విషయం తెలిసిందే. రెండు పార్టీల మధ్య ఎన్నికల గుర్తుల మధ్య వివాదం కొనసాగుతున్న విషయం తెలిసిందే. అయితే, ఈ అంశంలో సుప్రీంకోర్టు జనవరి 21న తుది విచారణ జరుపనున్నది. ఏక్‌నాథ్ షిండే వర్గాన్ని శివసేనగా గుర్తించి.. విల్లు, బాణం ఎన్నికల గుర్తులను ఈసీ కేటాయించడాన్ని సవాల్ చేస్తూ శివసేన సుప్రీం కోర్టును ఆశ్రయించింది. బుధవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చిలతో కూడిన ధర్మాసనం తుది విచారణను వాయిదా వేసింది.

ఎన్సీపీ (అజిత్ పవార్)కి ఈసీ గడియారం గుర్తును కేటాయించడాన్ని ఎన్సీపీ (శరద్ పవార్) దాఖలు చేసిన పిటిషన్‌ను పరిశీలించేందుకు సుప్రీంకోర్టు ధర్మాసనం అంగీకరించింది. రెండు కేసుల్లోని అంశాలను గుర్తించి.. రెండు కేసులను కలిపి విచారించేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. ఈ కేసులో వచ్చే ఏడాది జనవరి 21న విచారిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది. అవసరమైతే జనవరి 22న విచారణ కొనసాగించేందుకు వీలుగా.. మరుసటి రోజు ఇతర అత్యవసర అంశాలపై జాబితా చేయొద్దని జస్టిస్ సూర్యకాంత్ ఆదేశించారు. శివసేన సీనియర్ తరఫున అభిషేక్ మను సింఘ్వి, దేవదత్ కామత్ హాజరయ్యారు. మరో వైపు సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గి, ఎన్‌కే కౌల్ హాజరయ్యారు.

పార్టీ పేరు, గుర్తును ఏక్‌నాథ్ షిండే వర్గానికి కేటాయించాలనే ఈసీ నిర్ణయాన్ని శివసేన (యూబీటీ) విమర్శించింది.





2022లో శివసేనలో రాజకీయ సంక్షోభం తర్వాత.. ఫిబ్రవరి 2023లో షిండే నేతృత్వంలోని వర్గానికి అనుకూలంగా ఎన్నికల కమిషన్ తన ఉత్తర్వును జారీ చేసింది. పార్టీలో మెజారిటీని నిర్ణయించడానికి కేంద్ర ఎన్నికల కమిషన్ విఫలమైందని.. ఎన్నికైన ఎమ్మెల్యేల్లో షిండే వర్గం బలం ఎక్కువగా ఉన్నట్లు అంచనా వేసిందని ఉద్ధవ్ థాకరే వర్గం వాదించింది. ఈ విషయం పెండింగ్‌లో ఉండగా శివసేన (%ఖదీ%), బర్నింగ్ టార్చ్ గుర్తును ఉపయోగించాలని ఉద్ధవ్ థాకరే వర్గానికి సుప్రీంకోర్టు సూచించింది. అలాగే, శరద్ పవార్ వర్గం సైతం 2024లో అజిత్ పవార్‌కు గడియారం గుర్తును కేటాయించాలనే ఈసీ నిర్ణయాన్ని శరద్ పవార్ వర్గం సవాల్ చేసింది. సుప్రీం కోర్టు శరద్ పవార్ వర్గానికి ట్రంపెట్ గుర్తును కేటాయిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

# 26/11 నుంచి 10/11 పేలుళ్ల వరకూ మసూద్ అజార్ కీలక పాత్ర

**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట వద్ద నవంబర్ 10న జరిగిన బాంబు పేలుడు ఘటనతో యావద్దేశం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఈ దాడి వెనుక పాక్ ఉగ్రవాద సంస్థ జైషే మహ్మద్ ప్రమేయం ఉన్నట్టు వెల్లడవుతుండటంతో మరోసారి జైషే ఉగ్రవాది మసూద్ అజార్ పేరు తెరపైకి వచ్చింది. భారత్‌లో పలు ఉగ్రదాడులతో ప్రమేయం ఉన్న అజార్‌ను ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి అంతర్జాతీయ ఉగ్రవాదిగా గుర్తించింది. ఐఎస్ఐ నిధులతో ఉగ్రవాదాన్ని నడిపిస్తున్న అజార్‌కు 26/11 ముంబై దాడుల నుంచి తాజాగా ఢిల్లీ బ్లాస్ట్ వరకూ ప్రమేయం ఉందని నిఘా సంస్థలు బలంగా నమ్ముతున్నాయి. పాక్ గడ్డపై అజార్ లేడని ఆ దేశం బుకాయిస్తున్నప్పటికీ ఇస్లామాబాద్ అండదండలతో అతను స్వేచ్ఛగా పాక్ గడ్డపై తిరుగుతుండటం జగద్విదితం. ఇప్పుడు ఎర్రకోట వద్ద జరిగిన 10/11 బ్లాస్ట్‌లో ఆయన ప్రమేయంపై మరోసారి అనుమానాలు బలపడుతున్నాయి. హుండాయ్ ఐ20 కారులో నవంబర్ 10న జరిగిన పేలుడులో మృతుల సంఖ్య 12కు చేరింది. ఈ దారుణ ఘటన వెనుక జైషే మహ్మద్ ప్రమేయం ఉన్నట్టు ఆధారాలు వెలుగుచూస్తున్నాయి.

**ఎవరీ మసూద్ అజార్**

మసూద్ అజార్ (56) పాక్ జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థ వ్యవస్థాపకుడు. ఇండియాలో అనేక ఉగ్రదాడులకు జైషే పాల్పడింది. అజార్‌ను భారత ఏజెన్సీలు గతంలో పట్టుకున్నప్పటికీ ఎయిర్ ఇండియా ఐసీ814 హైజాకింగ్ తరువాత అతన్ని విడిచిపెట్టారు. 1999 డిసెంబర్‌లో ఐదుగురు ఉగ్రవాదులు ఢిల్లీ నుంచి ఖాట్మండు వెళ్తున్న ఐసీ814 విమానాన్ని హైజాక్ చేసి అమృత్‌సర్, లాహోర్, దుబాయ్ మీదుగా అఫ్గానిస్థాన్‌లోని కాందహార్‌కు మళ్లించారు. బందీల విడుదలకు ప్రతిగా అజార్, మరో ఇద్దరు ఉగ్రవాదులను ఇండియా విడిచిపెట్టింది. ఆ తర్వాతే 1999-2000లో జైషే మహ్మద్ సంస్థను అజార్ స్థాపించాడు. పాకిస్థాన్ నుంచి ఈ ఉగ్రసంస్థ కార్యకలాపాలు సాగిస్తోంది. 2001లో పార్లమెంటుపై దాడి, 2008 ముంబై దాడులు, 2016లో పఠాన్‌కోట్ ఎయిర్‌బేస్‌పై దాడి, 2019 పుల్వామా దాడిలో మసూద్ ఆజార్ ప్రమేయం ఉంది. తాజాగా ఢిల్లీ పేలుళ్ల ఘటనలో పలువురిని అరెస్టు చేయడంతో జైషే ప్రమేయం మరోసారి బయటకు వచ్చింది.



**ఆపరేషన్ సిందూర్**


పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా మే 7న 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాక్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత్ విరుచుకుపడింది. ఈ దాడుల్లో 9 ఉగ్రవాద స్థావరాలు నేలమట్టం కాగా, 100 మందికి పైగా ఉగ్రవాదులు హతమయ్యారు. ఈ దాడిలో 10 మంది మసూద్ కుటుంబ సభ్యులు కూడా చనిపోయారు. ఆయన పెద్ద సోదరి, ఆమె భర్త, మేనల్లుడు, ఆతని భార్య, మేనకోడలు, ఐదుగురు పిల్లలు ఇందులో ఉన్నారు. అజార్ మాత్రం ప్రాణాలతో బయటపడ్డాడు. తన కుటుంబసభ్యులు చనిపిపోయినందుకు తాను బాధపడటం లేదని, తాను కూడా వారితో చనిపోయి ఉంటే బాగుండేదని అజర్ అప్పట్లో వ్యాఖ్యానించాడు. ఆ తర్వాత పంజాబ్ ప్రావిన్స్‌లో జరిగిన ఒక ఇస్లామిక్ సెమినరీలో భారత్‌పై దాడులు కొనసాగిస్తామని ప్రతిజ్ఞ చేశాడు.

**మహిళా బ్రిగేడ్**

కాగా, జైషే ఉగ్రవాద సంస్థ కొత్తగా జమాత్ ఉల్-మోయినాత్ అనే మహిళా బ్రిగేడ్‌ను ఏర్పాటు చేసింది. మహిళలను ఇందులో రిక్రూట్ చేసుకుని ఉగ్రవాదంపై శిక్షణ ఇస్తోంది. గత నెలలో పుల్వామా దాడి మాస్టర్‌మైండ్ ఉమర్ ఫరూఖ్ భార్య అఫిరా బీబీ ఈ సంస్థ అడ్వయిజరీ కౌన్సిల్‌లో చేరింది. జైషే లింక్స్‌పై ఇటీవల ఫరీదాబాద్‌లో అరెస్టయిన మెడికల్ కాలేజీ డాక్టర్ షహీన్ సయూద్ ఇండియాలో జమాత్ ఉల్-మోయినాత్ యూనిట్ చీఫ్‌గా వ్యవహరిస్తున్నట్టు తెలుస్తోంది.

# ఆ మూడు గంటలు కారులో ఎందుకు ఉండిపోయాడంటే..

**న్యూఢిల్లీ :** దేశ రాజధాని న్యూఢిల్లీలోని ఎర్రకోట వద్ద పేలుడు ఘటనలో తవ్వే కొద్ది సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఎర్రకోట వద్దకు మధ్యాహ్నం 3.19 గంటలకు వచ్చిన కారు.. సాయంత్రం 6.28 గంటల వరకు అక్కడే పార్కింగ్ చేసి ఉంది. అంటే దాదాపు 3 గంటల పాటు కారు అక్కడే ఉంది. అయితే ఈ సమయంలో ఉమర్ మహమ్మద్ కారులోనే ఉన్నాడు. అతడు కారు దిగడం కానీ.. డోర్ ఓపెన్ చేయడం కానీ చేయలేదని సీసీ ఫుటేజ్ ద్వారా స్పష్టమవుతుంది. ఇక్కడ ఆసక్తికర విషయం ఏమిటంటే.. అతడు అంత సేపు కారులో ఎందుకు ఉండిపోయాడు? అక్కడే ఉండి పోయి.. ముందుగా అనుకున్న ప్లాన్‌ను అమలు చేయాలనుకున్నాడా? లేకుంటే మరో ఆలోచన చేస్తూ అంతసేపు అతడు అక్కడే ఉండిపోయాడా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. శీతాకాలం కావడంతో సాయంత్రం వేళ.. ఎర్రకోట వద్దకు భారీగా ప్రజలు చేరుకుంటారు. అందుకే అతడు కారు వెనుక సీటులో డిటోనేటర్లు పెట్టుకుని ఎర్రకోటకు వచ్చాడు. కానీ సోమవారం ఎర్రకోటకు సెలవు. అక్కడికి వచ్చిన తర్వాత ఈ విషయాన్ని అతడు గుర్తించాడు. దీంతో కారును ఇక్కడే ఉంచాలా? లేకుంటే మరో ప్రాంతానికి వెళ్లాలా? అనే ఆలోచన ఉమర్ మహమ్మద్‌లో మొదలై ఉంటుందనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అలా అక్కడి నుంచి ఉమర్.. తన కారును నేతాజీ సుభాష్ మార్గ్ వైపునకు మళ్లించాడు. అలా కారు ఎర్రకోట మెట్రో స్టేషన్ సిగ్నల్ వద్దకు చేరుకుంది. కాసేపటికే ఉమర్ ప్రయాణిస్తున్న కారులో భారీ పేలుడు సంభవించింది. ఈ పేలుడు దాటికి పలు వాహనాలు ధ్వంసమయ్యాయి. ఈ ఘటనలో 12 మంది మరణించారు. 20 మందికిపైగా గాయపడ్డారు.



**ఫరీదాబాద్ నుంచి రెడ్ ఫోర్ట్ వరకు ..**

ఈ బాంబు పేలుడు తర్వాత దాదాపు 600 మంది పోలీసులు రంగంలోకి దిగి.. ఈ కారు ప్రయాణించిన మార్గాన్ని ట్రాక్ చేశారు. అందుకోసం దాదాపు 1000 సీసీ టీవీ ఫుటేజ్‌లను వారు పరిశీలించారు. ఆ క్రమంలో ఫరీదాబాద్‌లోని అల్ ఫలాహ్ యూనివర్సిటీ నుంచి సోమవారం ఉదయం హుండయి ఐ20 కారు బయలుదేరింది. అలా ఆ రోజు ఉదయం 8.13 గంటలకు హర్యానా - న్యూఢిల్లీ సరిహద్దుల్లోని భద్రాపూర్ టోల్ ప్లాజ్‌ను దాటింది. ఎర్రకోట పార్కింగ్ ప్రాంతానికి చేరుకునే క్రమంలో ఈ కారు.. మయూర్ విహార్, కన్నాట్ ప్లేస్ ప్రాంతాల మీదగా చేరుకుంది. అయితే పాత ఢిల్లీ సమీపంలోని అసఫ్ అలీ రోడ్డు వద్ద దాదాపు అరగంట పాటు కారును ఉమర్ నిలిపివేశాడు. ఆ సమయంలో సైతం అతడు కారులో ఒంటరిగానే ఉన్నాడు. అనంతరం తన కారును ఎక్కడ ఆపకుండా ఎర్రకోట వద్ద పార్కింగ్ ప్రాంతానికి చేరుకున్నట్లు సీసీ ఫుటేజ్‌లలో పోలీసులు గుర్తించారు.

**కన్నాట్ ప్లేస్‌ను లక్ష్యంగా చేసుకున్నాడా?**

ఉమర్ ఢిల్లీలోకి ప్రవేశించిన నాటి నుంచి అతడు పలు ప్రాంతాల మీదగా .. ఎర్రకోట వద్దకు చేరుకున్నాడు. అయితే అతడు తొలుత కన్నాట్ ప్లేస్‌ను లక్ష్యంగా చేసుకున్నాడా ? అని కూడా పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అందులో భాగంగా మయూర్ విహార్, అక్షరధామ్ దేవాలయం, కన్నాట్ ప్లేస్‌ల్లోని సీసీ ఫుటేజ్‌లను సైతం పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఇక ఉదయం 8.00 గంటలకు ఉమర్ ఢిల్లీలోకి ప్రవేశించగా.. దాదాపు 11 గంటల తరువాత అంటే సాయంత్రం 6, 7 గంటల సమయంలో పేలుడు సంభవించింది. ఈ మధ్య సమయంలో అతడు ఏం చేశాడనే విషయాన్ని తెలుసుకోవడంపై పోలీసులు ఫోకస్ చేశారు. ఇక అతడి ఫోన్ గురించి పోలీసులు ఆరా తీయగా.. ఇక్కడా షాకింగ్ విషయాలు వెలుగు చూశాయి. ఉమర్ తన ఫోన్‌ను 10 రోజుల ముందే స్విచ్ ఆఫ్ చేసినట్లు గుర్తించారు. అంతేకాదు.. ఈ ఫోన్ కూడా అల్ ఫలాహ్ యూనివర్శిటీలో ఉన్నట్లు గుర్తించారు. అయితే ఉమర్ ఫోన్ లేకుండా ఎలా ఉన్నాడు. ఈ బాంబు దాడి వెనుక ఉన్న వారి ఆదేశాలు.. ఉమర్‌కు ఎలా అందాయి అనే కోణంలోనూ పోలీసులు విచారణ జరుపుతున్నారు. లేదంటే ఉమర్ వద్ద మరో ఫోన్ ఉందా? ఈ పేలుడులో ఆ ఫోన్ ధ్వంసమైందా? అని పోలీసులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. ఆ దిశగా సైతం దర్యాప్తు జరుపుతున్నారు.

## నిర్మలా సీతారామన్ సంతకం ఫోర్జరీ చేసి..

## 99లక్షల కాజేశారు

**పూణే:** హలో మేడం.. మేం 'డేటా ప్రొటెక్షన్ ఏజెన్సీ' నుంచి మాట్లాడుతున్నాం. మీరు ఆధార్‌కు లింక్ చేసిన ఫోన్ నంబర్ ద్వారా నిబంధనలకు విరుద్ధంగా ఆర్థిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. మిమ్మల్ని అరెస్ట్ చేస్తాం" అంటూ అరెస్టు వారెంట్ పంపించారు. లెటర్‌పై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సంతకం ఉండటంతో బాధితురాలు నమ్మింది. ఆ తర్వాత ఫోన్ చేసిన వ్యక్తి రూ.99 లక్షలు అడిగాడు. భయంతో బాధితురాలు ఆ మొత్తాన్ని చెప్పిన బ్యాంక్ ఖాతాలకు బదిలీ చేసింది. అనంతరం అదే నంబర్‌కు కాల్ చేయగా..ఫోన్‌లు స్విచ్ ఆఫ్ అయినట్లు గుర్తించింది. తాను మోసపోయినట్లు గ్రహించిన ఆమె వెంటనే పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సైబర్ నేరస్తులు ఇప్పుడు కొత్త పంథాను ఎంచుకున్నారు. ఓటీపీలు షేర్ చేయొద్దంటూ ప్రభుత్వం చేస్తున్న ప్రచారంతో ప్రజల్లో అవగాహన పెరగడంతో, సైబర్ మోసగాళ్లు నకిలీ అరెస్ట్ వారెంట్‌లు, అధికార ముద్రలు, ప్రముఖుల సంతకాలను ఉపయోగిస్తూ మోసాలకు పాల్పడుతున్నారు. తాజా ఘటన అక్టోబర్ చివరి వారంలో పూణేలోని కొథ్రుడ్ ప్రాంతంలో చోటుచేసుకుంది. బాధితురాలు ఎల్ఐసీ సంస్థలో ఉన్నతోద్యోగినిగా పనిచేసి ఇటీవల పదవీ విరమణ చేశారు. ఇంట్లో ఉంటున్న సమయంలో ఆమెకు ఫోన్ కాల్ వచ్చింది. 'డేటా ప్రొటెక్షన్ ఏజెన్సీ' నుంచి సీనియర్ అధికారినంటూ నిందితుడు పరిచయం చేసుకున్నాడు. ఆమె ఆధార్‌కు లింక్ చేసిన ఫోన్ నెంబర్‌తో అక్రమ లావాదేవీలకు ఉపయోగించినట్లు బెదిరించాడు.తర్వాత ఆమెను జార్జ్ మాథ్యూ అనే మరో వ్యక్తికి కనెక్ట్ చేసి, మనీలాండరింగ్ కేసులో ఆమె పేరు ఉందని చెప్పాడు. నిర్మలా సీతారామన్ నకిలీ సంతకంతో, అధికారిక ముద్ర, సీల్‌తో కూడిన అరెస్ట్ వారెంట్ పంపించారు. ఆమె వయస్సు కారణంగా మినహాయింపు ఇస్తున్నామని, విచారణ కోసం కెమెరా ముందు రావాలని సూచించారు. ధృవీకరణ కోసం కొంత నగదు బదిలీ చేయాలని చెప్పడంతో, ఆమె రూ.99 లక్షలు పంపించారు. చివరికి తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితురాల్ని పోలీసుల్ని ఆశ్రయించడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది.

## ఇండిగో విమానాలకు బాంబు బెదిరింపు..

## మెయిల్ పంపిన దుండగులు

**ఢిల్లీ, కోల్‌కతా, తిరువనంతపురం నుంచి నడుస్తున్న విమానాశ్రయాల్లో బాంబు అమర్చినట్లు బెదిరింపులు**

**విమానాశ్రయ అధికారులను అలర్ట్ చేసిన అధికారులు**

**విమానాన్ని ఐసోలేషన్ బేకు తరలించిన అధికారులు**



ఇండిగో విమానాలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. బుధవారం గురుగ్రామ్‌లోని ఇండిగో ప్రధాన కార్యాలయానికి గుర్తు తెలియని వ్యక్తులు బాంబు బెదిరింపు మెయిళ్లు పంపించారు. దేశ రాజధాని ఢిల్లీ, కోల్‌కతా, తిరువనంతపురం నుంచి నడుస్తున్న పలు విమానాల్లో బాంబు అమర్చినట్లు బెదిరింపులు వచ్చాయి. అప్రమత్తమైన ఎయిర్‌లైన్స్ అధికారులు సంబంధిత విమానాశ్రయ అధికారులను అప్రమత్తం చేశారు. కోల్‌కతా నుంచి ముంబైకి వెళుతున్న ఇండిగో విమానంలో బాంబు పెట్టినట్లు బెదిరింపు రావడంతో, ఆ విమానంలోని 186 మంది ప్రయాణికులను కిందకు దించి, విమానాన్ని ఐసోలేషన్ బేకు తరలించారు. ఢిల్లీ, తిరువనంతపురం విమానాశ్రయాల్లో భద్రతా చర్యలను కట్టుదిట్టం చేశారు. బాంబు స్క్వాడ్ బృందాలతో ఇండిగో విమానాల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

## ఉగ్రవాదం మన నగరాలపై

## దాడి చేయొచ్చేమో కానీ...

## మన ఆత్మలను కదిలించలేదు



దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన కారు పేలుడు ఘటనపై ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ కష్టకాలంలో భారత్‌కు, ప్రధాని నరేంద్ర మోదీకి తమ దేశం అండగా నిలుస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. బుధవారం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా నెతన్యాహు స్పందించారు. "ప్రియ మిత్రుడు నరేంద్ర మోదీకి, ధైర్యవంతులైన భారత ప్రజలకు.. నేను, నా భార్య సారా, ఇజ్రాయెల్ ప్రజల తరఫున బాధితుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాము. ఈ దుఃఖ సమయంలో ఇజ్రాయెల్ మీకు అండగా నిలుస్తుంది" అని వివరించారు. భారత్, ఇజ్రాయెల్ ప్రాచీన నాగరికతలకు నిదర్శనాలని, శాశ్వత సత్యాలపై నిలబడినవని ఆయన పేర్కొన్నారు. "ఉగ్రవాదం మన నగరాలపై దాడి చేయగలదేమో కానీ, మన ఆత్మలను ఎప్పటికీ కదిలించలేదు. మన దేశాల వెలుగు.. శత్రువుల చీకటిని మించి ప్రకాశిస్తుంది" అని నెతన్యాహు తన సందేశంలో ఉద్ఘాటించారు. ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి గిడియాన్ సార్ కూడా ఈ దాడిని ఖండించారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలుపుతూ, ఉగ్రవాదంపై పోరాటంలో భారత్‌కు తమ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

## బంగ్లాదేశ్‌కు తిరిగి వెళ్లడానికి

## షరతు విధించిన షేక్ హసీనా

బంగ్లాదేశ్‌కు తిరిగి రావడానికి షేక్ హసీనా ఒక షరతు విధించారు. తాను స్వదేశానికి తిరిగి రావాలంటే బంగ్లాదేశ్‌లో అందరి భాగస్వామ్యంతో కూడిన ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలని ఆమె అన్నారు. గత ఏడాది రిజర్వేషన్ల అల్లర్ల నేపథ్యంలో అక్కడి నుంచి వచ్చిన షేక్ హసీనా భారతదేశంలో ఒక గుర్తు తెలియని ప్రాంతంలో తలదాచుకుంటున్నారు. బంగ్లాలో అవామీ లీగ్ పార్టీపై నిషేధం ఎత్తివేసి, స్వేచ్ఛాయుతమైన, న్యాయమైన ఎన్నికలను నిర్వహించినప్పుడే తాను తిరిగి వెళతానని ఆమె స్పష్టం చేశారు. అటువంటి పరిస్థితులనే అక్కడి ప్రజలు కోరుకుంటున్నారని షేక్ హసీనా పేర్కొన్నారు. ప్రస్తుతం యూనస్ నేతృత్వంలో అధికారంలో ఉన్న తాత్కాలిక ప్రభుత్వం తీవ్రవాద శక్తులకు అధికారం ఇస్తూ భారత్‌తో ఆ దేశ సంబంధాలను ప్రమాదంలో పడేస్తోందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు భారతదేశంతో బలమైన సంబంధాలు కొనసాగించామని, యూనస్ ప్రభుత్వం వచ్చాక మూర?త్వంతో వాటిని బలహీనపరుస్తున్నారని ఆమె విమర్శించారు. కష్టకాలంలో తనకు ఆశ్రయం కల్పించినందుకు భారతదేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి, భారత ప్రజలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

Printed, Published & Owned by **SIRIKONDA MARIA,** Printed at ASHISH PUBLICATIONS H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-1-12/45/1, P.H.C. Colony, Adilabad - 504001, Telangana. Editor : **SIRIKONDA AUGUSTIN . RNI No.: APTEL/2013/52694.** E-mail: voodayam2007@gmail.com, Cell : 9247698676, 7075458621. Telefax. No. 040-27678676.